www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శనివారం | 6-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 7 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి ఉ. 10.21 తదుపరి త్రయోదశి; నక్షత్రం: శతభిషం మ. 3.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.9.21-10.46, దుర్ముహూర్తం: ఉ.6.10-7.48, అమృతఘడియలు: ఉ.9.12-10.38, తె.5.52 మొదలు, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 6.26 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 6 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com

'రామాయణ్' కోసం ఆస్కార్ సంగీత దర్శకులు



మూడు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న 'రామాయణ్' షూటింగ్ ఇటీవల మొదలైన విషయం విదితమే. నితీశ్ తివారి దర్శకత్వంలో నవిఎత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా గురించి కానీ, నటీనటుల గురించి కానీ అధికారిక ప్రకటన ఏమీ వెలువడక పోయినప్పటికీ యూనిట్ సభ్యుల నుంచి లీక్ అవుతున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆస్కార్ అవార్డ్ పొందిన ఇద్దరు సంగీత దర్శకులు ఈ సినిమాకు సంగీతం అందించనున్నారు. వారిలో ఒకరు ఏ.ఆర్. రెహమాన్ కాగా మరొకరు హాలీవుడ్ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్. 'రామాయణ్' చిత్రంతో జిమ్మర్ భారతీయ చిత్ర పరిశ్రమకు పరిచయమవుతున్నారు. 'గ్లాడియేటర్', 'పైరెట్స్ ఆఫ్ ది కరేబియన్', 'ది డార్క్ నైట్ ట్రయాలజీ', 'ది లయన్ కింగ్', 'నో టైమ్ టు డై' తదితర చిత్రాలకు ఆయన సంగీత దర్శకత్వం వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న 'రామాయణ్' చిత్ర వివరాలు దర్శకనిర్మాతలు వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మొదటి భాగాన్ని ఏప్రిల్ నుంచి జులై వరకూ చిత్రీకరించనున్నారు. వచ్చే ఏడాది దీపావళికి తొలి భాగాన్ని విడుదల చేస్తారు.

సరికొత్త లుక్‌లో శ్రీవల్లి



సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'పుష్ప 2: ది రూల్'. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. 'పుష్ప' చిత్రానికి ఇది కొనసాగింపు. తొలిభాగంలో శ్రీవల్లి పాత్రలో హీరోయిన్‌గా రష్మిక తన దైన నటన, యాసతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమె గెటప్‌ను తెలుపుతూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. చీరకట్టులో తీక్షణంగా చూస్తూ శ్రీవల్లి పాత్రలో కొత్తగా కనిపించారు. ఆగస్టు 15న 'పుష్ప 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 8న టీజర్‌ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

కాలేజ్ స్టూడెంట్

రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ అందమైన ప్రేమకథలో దీక్షిత్‌శెట్టి, రష్మికకు జోడీగా నటిస్తున్నారు.ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో రష్మిక కాలేజ్ స్టూడెంట్ పాత్రలో అలరించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్. సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వాసంత్

ఇటలీలో ప్రభాస్



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. ప్రభాస్, బాలీవుడ్ నటి దిశ పటానీ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో తీసిన కొన్ని ఫొటోలను దిశా షేర్ చేశారు. అలాగే ప్రభాస్‌తో తను దిగిన సెల్ఫీని కూడా ఆమె షేర్ చేయడంతో ఆ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. వీటిని అభిమానులు షేర్ చేస్తూ హ్యాపీ మూడ్‌లో ఉన్నారు. ప్రభాస్ సరసన దీపిక పదుకోణ్ నటిస్తున్న 'కల్కి'లో సీనియర్ నటుడు కమల్ హాసన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతం, భవిష్యత్‌తో ముడిపడిన కథతో రూపొందున్న ఈ చిత్రాన్ని అగ్ర నిర్మాత అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు కలిగిన ఈ సినిమా కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించిన 'ఫ్యామిలీస్టార్' చిత్రం శుక్రవారం విడుదలై చక్కటి ప్రేక్షకాధరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు చిత్రబృందంతో కలసి సక్సెస్‌ను సెలబ్రేట్ చేశారు.

ఈతరం ప్రేమకథలో...



యువ కథానాయకుడు అశోక్‌గల్లా నటిస్తున్న తదుపరి చిత్రం ఖరారైంది. శుక్రవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా అశోక్‌గల్లా కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఉద్భవ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీగౌరీ ప్రియ కథానాయిక. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ప్రేమ, హాస్యం కలబోసిన ఈ తరం ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతోంది. 'ది స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ' శైలిని అనుకరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. దీన్నిబట్టి అమెరికా నేపథ్యంలో కథ సాగుతుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.


అశోక్ గల్లా కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. ఈ చిత్రం నుంచి 'ఏమయ్యిందే' అంటూ సాగే సాంగ్ ప్రోమోను యూనిట్ విడుదల చేసింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. వారణాసి మానస కథానాయికగా నటిస్తున్నారు.

తాప్సీ పెళ్లి ఖర్చు ఎంతో తెలుసా?



తన బాయ్‌ఫ్రెండ్, మాజీ బాడ్మింటన్ ఆటగాడు మాతీస్ బో తో హీరోయిన్ తాప్సీ వివాహం మార్చి 22న జరిగినా ఇంతవరకూ ఆమె ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కనీసం పెళ్లి ఫొటోను కూడా సోషల్ మీడియాలో రిలీజ్ చేయలేదు. అయితే వీరి పెళ్లికి సంబంధించిన కొన్ని ఫొటోలు ఇటీవల లీక్ అయి వైరల్ అయ్యాయి. వీరి పెళ్లి ఎక్కడ జరిగింది?, ఎలా జరిగింది?, ఎంత ఖర్చు అయింది? అన్న సమాచారం తెలిసింది. తాప్సీ సన్నిహితులు వెల్లడించిన వివరాలు ఏమిటంటే.. తాప్సీ పెళ్లి డానిష్, హిందూ సంప్రదాయాల ప్రకారం జరిగింది. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఏకలవ్య స్టార్ హోటల్‌లో జరిగింది. ఇది చాలా ఖరీదైన హోటల్ కావడంతో పెళ్లి ఏర్పాట్లు, భోజనాలకే రూ. 60 నుంచి 80 లక్షల వరకూ ఖర్చు అయిందని అంటున్నారు. మిగిలిన అన్ని ఖర్చులు కలిపితే కోటి రూపాయలు దాటిందని అంటున్నారు. కుటుంబ సభ్యులు, అతి ముఖ్యులైన స్నేహితులే హాజరైనా పెళ్లి మాత్రం చాలా గ్రాండ్‌గా జరిగిందని అంటున్నారు. డీజే గణేశ్, అభిలాష్ తాప్లియాల్, డెల్‌రాజ్ బున్‌షా తదితరులు ఆట పాటలతో హోరెత్తించి, అతిథులను ఆనంద పరిచారట.

కృష్ణమ్మ రాక ఖాయం



సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'కృష్ణమ్మ'. వి. వి గోపాలకృష్ణ దర్శకత్వంలో కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ సమర్పిస్తున్నారు. 'కృష్ణమ్మ' విడుదల తేదీ ఖరారైంది. మే3న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన చిత్రమిది. కృష్ణమ్మ టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుంది. సత్యదేవ్ హీరోగా మరో మెట్టు ఎక్కుతాడు' అన్నారు. అతీరారాజ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, అర్చన, కృష్ణ, రఘు కుంచె కీలకపాత్రలు పోషించారు. సంగీతం: కాలభైరవ. సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి

భయపెట్టే భవనమ్



బ్లాక్‌బస్టర్ చిత్రాల నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆర్.బి చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మాతలుగా బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో 'భవనమ్' అనే చిత్రం రూపొందుతోంది. సప్తగిరి, ధనరాజ్, షకలకశంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. శుక్రవారం 'భవనమ్' ఫస్ట్‌లుక్, టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. 'ది హాంటెడ్ హౌస్' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ చిత్రం టీజర్ సస్పెన్స్, థ్రిల్లింగ్ హారర్‌తో పాటు ఫన్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంది. చరణ్ అర్జున్ నేపథ్య సంగీతం అలరించింది. మేలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మురళీమోహన్ రెడ్డి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 6-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 7

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్



కుటుంబ సభ్యులతో కలిసి ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సన్‌రైజర్స్ అదే జోరు


అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్

మార్‌క్రమ్ హాఫ్ సెంచరీ

చెన్నై సూపర్‌కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం

9

మాది సైద్ధాంతిక పోరాటం



తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర సభకు ఏర్పాటు చేసిన వేదిక

- దేశం కాంక్షిస్తున్నవే మేనిఫెస్టోలో పొందుపర్చాం
- ఈడీ, సీబీఐ, ఐటీ, ఈసీని బీజేపీ నియంత్రిస్తోంది
- చివరకు సోషల్ మీడియానూ ఫిక్స్ చేశారు
- ప్రధాని ఎవరనేది ఎన్నికల అనంతరమే నిర్ణయం
- 2004లో ఇలాగే ఎన్డీఏ వెలుగుల ప్రచారం చేసింది
- అప్పట్లో యూపీఏ నెగ్గింది.. ఇప్పుడూ అదే ఫలితం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- మా మేనిఫెస్టోలో అద్భుత భారతం: ఖర్గే

8

నేడే జనజాతర

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ శంఖారావం.. తుక్కుగూడ సభకు భారీ ఏర్పాట్లు

పార్టీ మేనిఫెస్టో తెలుగు ప్రతిని విడుదల చేయనున్న రాహుల్‌గాంధీ.. 10 లక్షలకు పైగా జన సమీకరణ

అభ్యర్థులకు బాధ్యత అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం తుక్కుగూడ నుంచి ప్రచారానికి శంఖారావం పూరించనుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుక్కుగూడలోనే నిర్వహించిన ప్రజాగర్జన సభ నుంచే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రకటించడం, తరువాత అధికార పగ్గాలు చేపట్టడం తెలిసిందే. దీంతో అదే సెంటిమెంట్‌తో పార్లమెంట్ ఎన్నికలకూ ఇక్కడి నుంచే ప్రచారానికి శ్రీకారం చుడుతోంది. జనజాతర పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తోంది. ఈ సభ నుంచే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 10 లక్షలకు పైగా జనాన్ని సమీకరించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. జన సమీకరణ బాధ్యతను పార్టీ అభ్యర్థులతోపాటు మంత్రులపైనా టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టారు. ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేలకు తగ్గకుండా జనాన్ని సమీకరించాలని, మిగిలిన నియోజకవర్గాల్లో బూత్‌కు ఒక వాహనం బయలు దేరాలని, ఒక్కో వాహనంలో పది మందికి తక్కువ

మిగతా 11వ పేజీలో...

పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ

- యువత, మహిళ, రైతు, శ్రామిక వర్గాలకు న్యాయం.. అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం
- 25 గ్యారెంటీల ద్వారా ఐదు న్యాయాల అమలు
- కొలువుల్లో మహిళలకు 50%.. పేద మహిళకు ఏటా లక్ష
- 50% రిజర్వేషన్ల పరిమితిని తొలగించేలా సవరణ
- ఎమ్మెస్పీకి చట్టబద్ధత, ఉపాధి కూలి రూ.400
- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'న్యాయ పత్రం' విడుదల

8

గద్ద లెక్క వాలుతా!



సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో కేసీఆర్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు

- రైతు సమస్యల పరిష్కారానికి సర్కారు మెడలు వంచుతా
- ఇది అసమర్థ, అవివేక, చవట ప్రభుత్వం
- 4 నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం చేస్తారా!?
- ఈ దద్దమ్మలకు చేతకాకపోతే వాళ్లను పండబెట్టి తొక్కి అయినా మేడిగడ్డ నుంచి నీటిని విడుదల చేస్తా
- మేడిగడ్డలో 10 వేల మందితో ధర్నా
- పంటకు రూ.500 బోనస్ ఇవ్వకపోతే కొరికి చంపుతారు
- రుణ మాఫీ అమలుపై స్పష్టత ఇవ్వాలి లేకపోతే, సర్కారును వెంటాడతాం
- నేతన్నల సమస్యలపై రాష్ట్రమంతా రణరంగం చేసి ఫుట్‌బాల్ ఆడతాం: కేసీఆర్

10

రైతులకు నీళ్లు అందించాలని కాళేశ్వరం స్పీడ్‌గా కంప్లీట్ చేశాం. పైనుంచి అధిక వర్షం రావడంతో కోమటిరెడ్డి కంపెనీ కట్టిన మిడ్ మానేరు కట్ట ఆనాడు కొట్టుకుపోయింది. కోమటిరెడ్డిని జైల్లో పెట్టాలనుకుంటే మేం పెట్టకపోయే వాళ్లమా!?

అడ్డమైన హామీలూ ఇవ్వడంతో మీకు 1.8 శాతం ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. మేం ఔట్ కాలేదు. లత్కోర్ హామీల కారణంగా స్వల్ప ఓట్లే ఎక్కువ వచ్చాయి.

కేసీఆర్ కుటుంబానికి రూ.2లక్షల కోట్ల ఆస్తులున్నాయ్!

- చిట్టా మొత్తం ఉంది.. బయటపెడతా.. సీబీఐతో విచారణ జరిపిస్తాం
- ధరణి, కాళేశ్వరం పేర్లతో రాష్ట్రాన్ని నాశనం చేశారు
- కేసీఆర్ ఈ యాత్రలు కాదు.. తిహాడ్ జైలు యాత్ర చేయాలి
- ఆయన స్థానంలో నేనుంటే కచ్చితంగా ఉరి వేసుకునే వాణ్ని
- నేను తప్పు చేసి ఉంటే పదేళ్లు చర్యలు తీసుకోకుండా ఏం చేశారు?
- నేను కాంట్రాక్టర్‌ను అని రుజువు చేస్తే మంత్రి పదవి వదిలేస్తా
- నా పేరు వాడుకుంటే బతకలేరు.. రాజకీయంగా తొక్కుకుంటూ పోతా
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదు: మంత్రి కోమటిరెడ్డి

10

ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చూపుతారా?

- ఈత తోక తెలిసిన వ్యక్తి కట్టిన ప్రాజెక్టు మూడేళ్లకే కుప్పకూలింది
- కరీంనగర్ వెళ్లిన వ్యక్తి కాళేశ్వరాన్ని సందర్శిస్తే బాగుండేది: పొంగులేటి

10

జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లో ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కిషన్‌రెడ్డి



రేవంత్ సీఎంగా ఉన్నంత వరకూ

రాహుల్ ప్రధాని కాలేరు

కాంగ్రెస్ హామీలన్నీ ఎన్నికల స్టంట్‌లే.. ఏ మొహంతో తుక్కుగూడ సభ పెట్టారు?

నాలుగు నెలల్లో ఏం సాధించారు?.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్/హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. "కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే.. గ్యారంటీల అమలు సాధ్యమన్నట్లుగా ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ.. సీఎంగా రేవంత్ కొనసాగినన్ని రోజులు రాహుల్‌గాంధీ ప్రధాని కాలేరు. ఎన్నికల తర్వాత రాహుల్ దేశంలో ఉంటారో లేక విదేశాలకు వెళ్లిపోతారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్ శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలన్నీ ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. తెలంగాణలో రైతు, మహిళ, మైనారిటీ, బీసీ డిక్లరేషన్ల పేరిట అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు జాతీయ స్థాయిలోనూ

మిగతా 10వ పేజీలో...

రాధాకిషన్‌రావుకు స్వల్ప అస్వస్థత

- డాక్టర్‌ను పిలిపించి చికిత్స అందించిన పోలీసులు
- డ్రై ఫ్రూట్స్, భోజనంతో స్టేషన్‌కు కుటుంబసభ్యులు
- ట్యాపింగ్ కేసులో ఇద్దరు నల్లగొండ కానిస్టేబుళ్ల స్టేట్‌మెంట్
- మునుగోడు ఉప ఎన్నికలో ఫోన్ ట్యాపింగ్‌లో వీరి పాత్ర

11

రంగంలోకి సీబీఐ

- కవితను విచారించేందుకు అనుమతి ఇచ్చిన కోర్టు
- తిహాడ్ జైల్లోనే విచారణకు ఓకే
- కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సోమవారం తీర్పు
- ఆమెకు బెయిల్ వస్తే సీబీఐ మళ్లీ అరెస్టు చేసే అవకాశం

12



తుక్కు మాటున నొక్కేశారు!

కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేతలో గోల్‌మాల్



కేంద్రం నుంచి ఉత్తర్వులు రావడానికి 2 రోజుల ముందు.. కేటీపీఎస్ ఓఅండ్ఎం కూల్చివేతకు టర్బైన్‌లో కేబుల్స్‌ను కత్తిరిస్తున్న సిబ్బంది

- మెటీరియల్ మార్కెట్ విలువ 2 వేల కోట్లకు పైనే!
- 485 కోట్లకే ముంబై సంస్థకు 'కారు' చౌకగా టెండర్
- ప్లాంట్‌ను 2030 దాకా కూల్చవద్దన్న కేంద్రం
- దీనికి 2 రోజుల ముందే టర్బైన్‌లోని కేబుల్స్ కత్తిరింపు
- గత ప్రభుత్వంలోని వారి పాత్రపై భారీగా ఆరోపణలు
- విజిలెన్స్ విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి
- ప్లాంట్ అక్రమాలపై జెన్‌కో సీఎండీ రిజ్వీ ఆగ్రహం
- నోట్ ఫైల్ సిద్ధం.. విద్యుత్తు మంత్రి దృష్టికి అంశం

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 5: మార్కెట్ విలువలో పావు వంతు ధరకే అడ్డగోలుగా అప్పగింత..! అధికారులు సహా సెక్యూరిటీ అంతా వారి వారే..! అంచనాలు మొదలు.. టెండర్ కేటాయింపు వరకు అంతా అనుమానాస్పదమే..! ఇదీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ (కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్) ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేతలో సాగిన తతంగం. దీనివెనుక రూ.కోట్లు చేతులు మారాయంటూ పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన, విలువైన పంచలోహ సామగ్రి వినియోగించి 1966 జూలై 15న కేటీపీఎస్ నాలుగు యూనిట్ల నిర్మాణం చేపట్టారు. క్రమంగా 8 యూనిట్లుగా

మిగతా 7వ పేజీలో...



వార్తలు సమాప్తం

తొలి తెలుగు టీవీ న్యూస్‌రీడర్ శాంతిస్వరూప్ ఇక లేరు

- గుండెపోటు, చికిత్స పొందుతూ మృతి
- 3 దశాబ్దాలకు పైగా దూరదర్శన్‌లో సేవలు
- కవిత్వం, నవలలూ రాసిన శాంతిస్వరూప్
- ముగిసిన అంత్యక్రియలు.. పలువురి సంతాపం

12

పొంచి ఉన్న ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పు

- ఏటా 14 లక్షల కేసులు
- 2040 నాటికి రెండింతలు పెరిగే చాన్స్
- లాన్సెట్ తాజా అధ్యయనంలో వెల్లడి

వాహనాలు నిలువ

నీడ లేకపాయే!



- కొత్త సచివాలయంలో పార్కింగ్ కష్టాలు
- మండే ఎండల్లోనే కార్లు, ద్విచక్ర వాహనాలు
- కార్ల డ్రైవర్లకు కనీస సదుపాయాలూ కరువే
- విశ్రాంతి గది లేనే లేదు.. తాగునీటికీ కటకటే
- ఎండ దెబ్బతో వాహనాలకు మరమ్మతులు
- మల్టీలెవల్ పార్కింగ్ ఊసే మరిచారు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వందల కోట్లు ఖర్చు చేసినా నిలువ నీడే లేదు.. చూద్దామన్నా ఒక్క చెట్టూ కనిపించదు... కార్లు, ద్విచక్ర వాహనాలు ఎండలో మగ్గాల్సిందే.. విశ్రాంతి గది లేకపోవడంతో డ్రైవర్లూ ఆయా కార్లలోనే పడి ఉండాల్సిందే.. కనీసం తాగేందుకు

మిగతా 10వ పేజీలో...

నేడు వడగాలులు..

రేపు వర్షాలు

- రెండు రోజుల పాటు తగ్గనున్న ఎండలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

12

పాక్ ఉగ్రవాదులపై

'రా' గురి!

- వారి దేశంలోనే వారిపై స్పాట్
- 2020 నుంచి 20 మంది హతం
- స్థానిక యువతతో ఆపరేషన్లు
- వారికి పెద్ద ఎత్తున డబ్బుల అందజేత
- 2019 పుల్వామా దాడి తర్వాత మారిన 'రా' వ్యూహం
- వెల్లడించిన గార్డియన్ కథనం
- ఖండించిన భారత విదేశాంగశాఖ
- అది తమ విధానం కాదని స్పష్టీకరణ

8

అమెరికాలో భూకంపం

ఐరాస సమావేశం వాయిదా

8



కబ్జాలపై చర్యలేవీ?

కేయూ భూములు కాజేసిన వర్సిటీ అధికారులు, పోలీసులు, నేతలు

- కాకతీయ విశ్వవిద్యాలయ భూములు అన్యాక్రాంతం
- కలెక్టర్ సర్వే.. 51 ఎకరాలు మాయమైనట్లు గుర్తింపు
- విచారణ కమిటీ నివేదికను తొక్కిపెడుతున్న అధికారులు
- దర్యాప్తు జరిపిస్తే వందల కోట్ల భూ దందా వెలుగులోకి

వరంగల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాకతీయ యూనివర్సిటీ భూములు కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. వర్సిటీ అధికారులు, పోలీసులు, రాజకీయ నేతలు, రౌడీ షీటర్లు యథేచ్ఛగా విశ్వవిద్యాలయ భూములను ఆక్రమించేస్తున్నారు. అంతా తెలిసినా వర్సిటీ అధికారులు చోద్యం చూస్తుండటంతో రూ.వందల కోట్ల విలువ చేసే 51 ఎకరాల భూములు ఇప్పటికే మాయమయ్యాయి. కబ్జాలపై విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను తొక్కి పెడుతూ యూనివర్సిటీ అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారనే

మిగతా 7వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉద్వేగ ప్రచారాలు

ఆటల్లో కానీ, పోరాటాల్లో కానీ, గెలుపు కోసం పోటీ ఉండే ఏ రంగంలో అయినా కానీ, సకల పక్షాలూ అంగీకరించే కొన్ని కట్టుబాట్లు, కట్టుదిట్టాలు ఉంటాయి. నియమాలను ఉల్లంఘించకుండా చూడడానికి ఒక పర్యవేక్షణా ఉంటుంది. అయినా సరే, విజయమే ముఖ్యమైన వారు ఎలాగో అలాగ, హద్దు మీరి అయినా సరే, పై చేయి కావాలని చూస్తారు. తీర్పరి స్థానంలో ఉండే పెద్దమనిషి, బుద్ధిమంతుడూ, ధైర్యవంతుడూ అయితే, తప్పును గుర్తించి, నియమాన్ని అమలు జరుపుతాడు. తటస్థుడు కూడా లోపాయికారీగా ఏదో ఒక పక్షానికి చెందిన మనిషి అయితే, అక్కడ న్యాయానికి ఆస్కారం ఉండదు. ఎన్నికల ప్రక్రియ కూడా అంతే. ఎన్నో ఎన్నికలు, అనుభవాల తరువాత, ఇప్పుడు మనం చూస్తున్న నియమ నిబంధనలు అమలులోకి వచ్చాయి. నిజానికి ఆస్కారం ఉన్న అక్రమాలతో పోలిస్తే, ఇప్పుడు ఉన్న హద్దులు సరిపోవు. ఎన్నికల సంఘం నిర్ణయించిన అభ్యర్థి ప్రచార ఖర్చుకు, వాస్తవంలో జరిగే ఖర్చుకు ఎంత వ్యత్యాసం ఉందో గమనిస్తే, న్యాయబద్ధమైన ఎన్నికల ప్రక్రియను నిర్వహించడానికి కావలసినంత నైతికతా చట్రం మనం ఇంకా రూపొందించుకోలేదని తెలిసిపోతుంది.

కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లుగా తటస్థులు ఎంపిక కాకుండా, తమ వారినే నియమించుకోవడానికి వీలుగా చట్టానికే సవరణ తేవడానికి కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనుకాడలేదు. న్యాయస్ఫూర్తికి కలుగుతున్న విఘాతాన్ని, ప్రజల దృష్టిలో కలిగే అప్రదిష్ఠను ఏ మాత్రం ఖాతరు చేయలేదు. అంతేకాదు, ఎన్నికల ప్రచార సందర్భంగా పెట్టుకున్న ఎన్నో విధినిషేధాల విషయంలో స్వయంగా అధికారపార్టీయే అనేక ఉల్లంఘనలు చేస్తున్నది. ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు చెందిన నాయకులు ఎక్కడన్నా పొరపాటున నోరుజారినా వెంటనే నోటీసులు అందుతున్నాయి. సాక్షాత్తూ, ప్రధానమంత్రే మతప్రమేయాన్ని ధ్వనింపజేసే వ్యాఖ్యలు చేసినప్పుడు, ప్రతిపక్షాలు ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం ఖాతరు చేయడం లేదు. వాట్సాప్ ద్వారా ప్రధానమంత్రి తన ప్రభుత్వ లబ్ధిదారులకు పంపుతున్న సందేశాలను మాత్రం విరమింపజేయడం విశేషం. కానీ, ప్రభుత్వ యంత్రాంగం ద్వారానే అనేక నియమోల్లంఘనలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల సమయంలో 'కేరళ స్టోరీ' సినిమాను దూరదర్శన్‌లో ప్రసారం చేయాలని తలపెట్టడం మీద వివాదం తెలిసిందే.

ప్రజలలో భావోద్వేగాలు కలిగించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత పార్లమెంటు ఎన్నికలకు ముందు 'పుల్వామా' సంఘటన కలిగించిన ప్రభావం తెలిసిందే. ఈ సారి అటువంటి సంఘటన ఏదీ జరగనందువల్ల, పొరుగుదేశాలతో ఉద్రిక్తతల వాతావరణం కూడా లేనందువల్ల, ప్రస్తుత అధికారపార్టీ గట్టి జాతీయవాది అని కానీ, పొరుగు దేశాల వల్ల బాధితురాలు అని కానీ, దేశ ప్రయోజనాల కోసం ఎంతకైనా వెళ్లగలిగే సాహసి అని కానీ ప్రచారం జరగడానికి ఆస్కారం లేకపోయింది. అయినా సరే, తమకు సహాయం కాగలిగిన సంఘటనలు సంభవించకున్నా కానీ, కృత్రిమమైన వివాదాలను సామాజిక మాధ్యమాల ద్వారా రేకెత్తించే ప్రయత్నం జరుగుతోంది. యాభై ఏళ్ల కిందటి కచ్చతీవు దీవి అప్పగింత అంశం, ఒక సమాచార హక్కు ప్రశ్న ద్వారా, రంగం మీదికి ఒక వివాదంగా వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు, దేశాన్ని రక్షించకపోగా, బాధ్యతారహితంగా భూభాగాలను కూడా పరులకు ఇచ్చారన్న భావాన్ని ప్రజలలో కలిగించడానికి ఈ వివాదం ప్రయత్నిస్తోంది.

మరి కొన్ని ప్రయత్నాలు, పైకి ప్రతికూలంగా కనిపిస్తాయి కానీ, పరోక్షంగా మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠను మరింత బలాన్ని చేకూర్చేవి. గత మూడు సంవత్సరాల కాలంలో భారతీయ ఏజెంట్లు పాకిస్థాన్‌లోకి జొరబడి, 20 మందికి పైగా టెర్రరిస్టు అనుమానితులను చంపారనే వార్త 'ది గార్డియన్' పత్రికలో వచ్చింది. కెనడాలోని ఖలిస్తానీవాదుల మీద భారత్ గురిపెట్టిందని, గత ఏడాది అమెరికాలోనూ ఒక ప్రయత్నం చేసిందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఈ వార్తలను భారత ప్రభుత్వం అధికారికంగా ఖండించింది కానీ, వాటి ప్రచారం తమ ప్రతిష్ఠను పెంచుతుందని అధికారపార్టీ భావిస్తుంది. వాస్తవాధీన రేఖను దాటి వైమానిక దాడి జరపడం ఎట్లాగైతే, సాహసచర్యగా కీర్తి పొందిందో, పాకిస్థాన్‌లోకి చొరబడి ప్రత్యర్థులను చంపగలగడం కూడా మోదీ ప్రభుత్వ ఘనతగానే కనిపిస్తుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో, స్వయంగా దేశరక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఇంట్లోకి చొచ్చుకు వెళ్లి చర్య తీసుకోవడాన్ని మరొక్కసారి ప్రస్తావించి సమర్థించారు. అది పైకి చూడడానికి దేశభద్రతా విధాన ప్రకటనే, కానీ, అదే సమయంలో అది, ఎన్నికల ప్రచారం కాకుండా పోతుందా? అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా అమెరికా, జర్మనీ, ఐక్యరాజ్యసమితి చేసిన ప్రకటనలు మన అంతరంగిక వ్యవహారాలలో జోక్యంగా భారత్ చెబుతోంది, గట్టిగా ప్రచారం చేస్తోంది. ప్రపంచం అంతా కలిసి మోదీ మూడోసారి ఎన్నిక కాకుండా కుట్ర చేస్తున్నదని జాతీయ ఇంగ్లీషు చానెల్స్‌లో ప్రసారమవుతున్న కథనాలు గమనిస్తే, విమర్శలు సానుకూల అంశాలుగా మారిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. జాతీయ ఇంగ్లీషు చానెళ్లలో ప్రతిసాయంత్రం ప్రసారమవుతున్న చర్చలు, కథనాలు అన్నీ వాస్తవానికి ఒకపార్టీ ప్రచార ఖర్చు కింద లెక్క వేయాలి. కానీ, అవి ప్రచ్ఛన్నంగా మాత్రమే ప్రచారం చేస్తున్నాయి. నేరుగా జరిగే ఉల్లంఘనలనే పట్టించుకోని ఎన్నికల సంఘం ఈ పరోక్ష ప్రచారాలను ఏమని అభ్యంతరపెట్టగలదు?

మతం, కులం, ప్రాంతీయతత్వం వంటి వాటితో ప్రచారాంశాలను రూపొందించకూడదన్న నిబంధన ఉన్నట్టే, జాతీయవాదాన్ని, దేశభక్తిని ఉపయోగించుకుంటూ రాజకీయ ప్రచారాలు చేయకూడదన్న నియమం కూడా ఉండాలి.

ముఖ్యమంత్రిని దించేయడం ఎలా?

అవినీతికి పాల్పడ్డాడన్న అభియోగం మీద పదవీబాధ్యతల్లో తలమునకలై ఉన్న ఓ ముఖ్యమంత్రిని అరెస్టుచేసిన వ్యవహారంలో అనేక రాజకీయ, న్యాయ, రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడివున్నాయి. ఇది రాజ్యాంగనైతికతకు సంబంధించిన విషయం కూడా. అందువల్ల, ప్రతీ అంశాన్నీ, 'నిజా'న్నీ లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఈ కేసులో ఆరోపణ ఏమంటే, లంచం ఇచ్చినవారికి ప్రభుత్వపరంగా మేలు చేకూర్చేందుకు ముఖ్యమంత్రి లంచం పుచ్చుకున్నారని. ప్రస్తుతానికి ఇది అవినీతి ఆరోపణే తప్ప, తప్పు జరిగిందన్న నిర్ధారణ అయితే కాలేదు. నేరం రుజువై, దోషి అని తేలేవరకూ ఎవరైనా సరే, నిరపరాధే. ఈ సూత్రానికి, విలువకు భిన్నంగా ఏ వ్యవస్థా వ్యవహరించడానికి లేదు.

ఇప్పుడు అసలు చర్చ చేద్దాం. ఒక వ్యక్తి ఓ రాజకీయపార్టీ సభ్యుడు. ఆ పార్టీ ఎన్నికల్లో పోటీచేస్తుంది, పార్టీకి చెందిన అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో గెలిచి శాసన సభ్యులవుతారు. వారంతా ఆ వ్యక్తిని తమ నాయకుడుగా ఎన్నుకుంటారు, అతడితో గవర్నర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయిస్తారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గసహచరులు బాధ్యతలు స్వీకరిస్తారు, కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. గత ఏడున్నర దశాబ్దాల్లో ఇలా వందలసార్లు జరిగింది. నిజానికి ఇందులో కొత్తగా కనిపించేదీ ఏమీ ఉండదు. రాజ్యాంగపరంగానూ, రాజకీయకోణంలోనూ జరగాల్సింది కూడా ఇదే. తన విధులు నిర్వర్తించే విషయంలోనూ, బాధ్యతలు చక్కబెట్టడంలోనూ ముఖ్యమంత్రికి పరిపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలన్నది నిర్వివాదాంశం. తన విధుల్లో భాగంగా ఆయన గవర్నర్‌కు సలహాలు ఇవ్వాలి, మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలి, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలి, ప్రజల సాధకబాధకాలు వినాలి. అసెంబ్లీలో మాట్లాడాలి, చర్చలు చేయాలి, సభ్యులందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. తీర్మానాలు, బిల్లులపైన ఆయన ఓటుచేయాలి. అన్నింటికీ మించి, మన వ్యవస్థ ఇప్పటికీ రికార్డులు, ఫైళ్ల మీదనే ఆధారపడి కొనసాగుతోంది, ప్రతీదీ రాతకోతలమీదే నడుస్తోంది. అందువల్ల ముఖ్యమంత్రి స్వయంగా ఫైళ్లమీద రాయడం, సంతకాలు చేయడం వంటివి ఆయన పనుల్లో ముఖ్యమైనవి. పైన చెప్పినవన్నీ కూడా ఒక ముఖ్యమంత్రి బందీగా ఉన్నప్పుడు లేదా స్వేచ్ఛగా లేనప్పుడు ఎంతమాత్రం నిర్వర్తించలేడు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ముఖ్యమంత్రిని ఓడించడానికి లేదా పదవినుంచి తప్పించడానికి చాలా దారులున్నాయి. ఎన్నికల విధానంలో ఐదేళ్లకోమారు లేదా అంతకుముందు గానీ ఆయనను, ఆయన పార్టీని ఓడించవచ్చు. అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం లేదా, ఆర్థిక బిల్లును తిరస్కరించడం లేదా అతిముఖ్యమైన తీర్మానానికి అడ్డుకొట్టడం వంటి సభాసంబంధిత ప్రక్రియలతోనూ ఆ పనిచేయవచ్చు. అయితే, ఇటువంటి సందర్భాల్లో మెజారిటీదే విజయం, సంఖ్యాబలం ఉన్నవారిదే పైచేయి. కనుక, ఒక ముఖ్యమంత్రిని దించేయడానికి కొన్ని అడ్డదారులొచ్చాయి. నిర్దిష్టమైన సంఖ్యలో ఎమ్మెల్యేలు అధికార పక్షానికి రాజీనామాచేయడం లేదా మరోపార్టీలో చేరిపోవడం ఆపరేషన్ లోటస్‌లో భాగంగా జరుగుతూండటం చూస్తున్నాం. ఇటువంటి చర్యల ద్వారా అధికారపక్షం మైనారిటీలోకి జారిపోయి కుప్పకూలిపోతుంది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ఇలా పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హతవేటు వేసేందుకు, ఫిరాయింపులను నిరోధించేందుకు ఉపకరిస్తుంది కానీ, దానిని అమలు చేయకుండా, నిస్సిగ్గుగా ఉల్లంఘించడం జరిగిపోతున్నది.



ఇదంతా చట్టబద్ధంగా జరుగుతున్నదే... కానీ, రాజకీయకోణంలో అత్యంత దుర్మార్గమైనది. వెస్ట్‌మినిస్టర్ పాలనావిధానాన్ని ఆమోదించుకున్న ఈ దేశంలో, ఒక ముఖ్యమంత్రిని అరెస్టుచేయడం, నిర్బంధించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలు, విలువలకు భిన్నమైనది కాదా? అధికారంలో ఉన్న రాజకీయశక్తులు తమ ప్రయోజనాలకు వీలుగా రాజ్యాంగ విలువలను ఈ విధంగా భ్రష్టుపట్టించవచ్చునా?

ముఖ్యమంత్రిని దించడానికి ఇంకా ఏమైనా మార్గాలున్నాయా? నేను అన్వేషించినంతమేరకు, నాకు తెలిసినంతవరకూ ఇంకేమీ లేవు. కానీ, మనదగ్గర కొందరు అతితెలివైన వాళ్ళున్నారు. ముఖ్యమంత్రిని నిర్బంధించడానికి, అతడి స్వేచ్ఛ, స్వతంత్రతలను హరించడానికి వారొక మార్గం కనిపెట్టారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఓ ఎఫ్ఐఆర్ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) రిజిస్టర్ చేస్తారు. ప్రశ్నించాల్సి ఉన్నదనీ, విచారణకు రావాలనీ పిలిచి, అరెస్టు చేస్తారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ మరీ బరితెగించింది. ముఖ్యమంత్రి అరెస్టుకావడంతోనే ఆయన రాజీనామా చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటుంది. ముఖ్యమంత్రి అయితేనేమి, అతడూ అన్ని ప్రక్రియలూ దాటాల్సిందే అన్న వాదనతో, కోర్టుల చుట్టూ తిరగడం, బెయిల్ కోసం దరఖాస్తులు పెట్టుకోవడం, పోలీసు రిమాండు, జుడీషియల్ రిమాండ్, కోర్టుల ఆదేశాలమీద అప్పీళ్ళు, చివరకు బెయిల్ దరఖాస్తును సుప్రీంకోర్టు ఆమోదించడం లేదా కాదనడం వరకూ ఈ సుదీర్ఘ ప్రక్రియలన్నీ తప్పడం లేదు. కానీ, ఇంతలోగా అతడి ప్రభుత్వం దుర్బలంగా మారుతుంది. అంతవరకూ శత్రుదుర్భేద్యంగా ఉన్న అతడి కోట కాస్తా బలహీనపడుతుంది. అటూఇటూ ఊగి చివరకు కూలిపోతుంది. అరెస్టయిన ముఖ్యమంత్రి స్థానంలోకి తాత్కాలికంగా మరొకరు వచ్చికూర్చున్నా వారికీ ఇదే ప్రమాదం పొంచివుంటుంది, చివరకు అరెస్టుకావడమూ తప్పదు. ఇలా వెంటాడివేధిస్తున్నప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఒకరి తరువాత మరొకరిని వరుసపెట్టి తమవారిని కూచోబెట్టగలిగే, పరిస్థితులకు ఎదురొడ్డి నిరంతరం పోరాడగలిగే సామర్థ్యం ఏ రాజకీయపార్టీకీ ఉండదు. కాబట్టి, అవినీతి ఆరోపణల తక్షణ రాజకీయ లక్ష్యం-ముఖ్యమంత్రిని గద్దె దించడం-సంపూర్ణంగా నెరవేరుతుంది.


ఇదంతా చట్టబద్ధంగా జరుగుతున్నదే. కానీ, రాజకీయకోణంలో అత్యంత దుర్మార్గమైనది. రాజ్యాంగపరంగా ఇది సహేతుకమైనదేనా అన్న విషయంపై లోతైన చర్చ జరగాలి. ఇక, నా ప్రశ్న మరింత లోతైనది. వెస్ట్‌మినిస్టర్ పాలనావిధానాన్ని ఆమోదించుకున్న ఈ దేశంలో, ఒక ముఖ్యమంత్రిని అరెస్టుచేయడం, నిర్బంధించడం రాజ్యాంగనైతికతకు లోబడినదేనా? ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలు, విలువలకు అది భిన్నమైనది కాదా? అధికారంలో ఉన్న రాజకీయశక్తులు తమ ప్రయోజనాలకు వీలుగా రాజ్యాంగ విలువలను ఈ విధంగా భ్రష్టుపట్టించవచ్చునా?

రాజకీయకక్షలతో వచ్చిపడే ఈ తరహా ప్రమాదాన్ని కొన్ని దేశాలు గుర్తించి ప్రభుత్వ అత్యున్నత స్థానాలకు కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పించాయి. పదవిలో ఉన్నప్పుడు వారిని అరెస్టుచేయడం దాదాపుగా అసాధ్యం చేశాయి. ఇది ఎందుకంత ముఖ్యమైనదో, పాత్రలను కాస్తంత అటుఇటుగా మార్చి ఓ ఉదాహరణగా చూద్దాం. ఒక రాష్ట్ర ప్రభుత్వం తన భౌగోళిక పరిధుల్లో ఈ దేశ ప్రధాని నేరం చేశాడంటూ కేసుపెట్టి, ఆయనను అరెస్టుచేసిందని అనుకుందాం. ప్రధానమంత్రిని పోలీసు లేదా జుడీషియల్ కస్టడీకి ఓ మేజిస్ట్రేటు అప్పగించాడనీ ఊహిద్దాం. ఈ పరిణామాలు ఎంత తీవ్రమైనవో, వాటి ప్రభావం దేశంమీద ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ప్రత్యేక రక్షణలు కరువైన తరుణంలో, ఒక ముఖ్యమంత్రికి శాసనసభలోనూ, ప్రధానమంత్రికి లోక్‌సభలోనూ ఉన్నబలమే రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న ప్రత్యేక రక్షణగా న్యాయస్థానాలు ఎందుకు చూడకూడదు? మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గెలవాలన్నా, రాజ్యాంగనైతికత వెలగాలన్నా ఈ ప్రశ్నకు సమాధానం సాధించాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

విలువలకు.. విధ్వంసానికి నడుమ యుద్ధం

ఇల్లు నిర్మించిన వారికన్నా, ఆ ఇంట్లో నివసించే వారే గొప్ప అనడం ఎంత వరకు న్యాయం? ఈ దేశ నిర్మాణంలో ఒక సమూల మార్పుకు నాంది పలికిన ఆధార్ కార్డు వ్యవస్థను తీసుకువచ్చింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం. తద్వారా ప్రతీ పౌరునికి ఒక గుర్తింపునిచ్చింది. ఈ విధానం ద్వారా ఆధార్ నెంబర్‌ను పౌరుల బ్యాంకు అకౌంట్లకు లింకు చేసి ఒక సమ్మిళిత వ్యవస్థను రూపొందించింది. దీంతో ఈ దేశంలో మొట్టమొదటిసారి ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని నగదు బదిలీ (డీబీటీ) విధానం ద్వారా ప్రజలకు అందించి.. కోట్లమంది ప్రజల గుండెల్లో ఒక కొత్త ఆశకు ఊపిరి పోసింది. కానీ, ఇప్పుడు బీజేపీ నాయకులు మాత్రం.. వివిధ పథకాల ద్వారా డీబీటీ చేయడం తమ ప్రభుత్వ గొప్ప మాత్రమే అన్నట్టు మాట్లాడుతున్నారు. ఇది రాజకీయాల్లో అత్యంత దారుణమైన ప్రవర్తన. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఈ మధ్యనే అధికారంలోకి వచ్చినట్టు.. నిన్నటి వరకూ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నట్టు... నిరంతరాయంగా ఆరోపణలు చేస్తున్నారు, అబద్ధాల మీద అబద్ధాలు చెప్తున్నారు. పదేళ్ల అధికారంలో ఉండి.. తమ పరిపాలన కాలంలో ప్రజల జీవన ప్రమాణాల్లో తెచ్చిన మార్పులను ప్రజలకు వివరించి, ఓట్లు అడగాల్సిన ఆ పార్టీ అధినాయకత్వం.. ఇంకా కాంగ్రెస్‌పై ఆరోపణలతోనే సరిపెడుతోంది.



అధికారంలోకి రావడం కోసం బీజేపీ అవలంబించిన అసంబద్ధపు ప్రచార వైఖరులు, ప్రకటించిన అబద్ధపు హామీలు ఈ దేశం మొత్తం చూసింది. కానీ, వారి నియంతృత్వ సంకెళ్ల బంధనాల్లో చిక్కుకొని గొంతెత్తి ఈ దురాగతాలను ప్రశ్నించలేకపోతున్నది. కనీసం.. యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన చట్టాలని, పరిపాలన సంస్కరణలని గుర్తించాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉన్నది. సమాజంలో మౌలిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పుల కోసం యూపీఏ రూపొందించిన విధానాలకు జై కొట్టవల్సిన తక్షణావసరం ఉంది.

అస్పష్ట వైఖరులు ప్రజాపరిపాలన యంత్రాంగంలో ఉండకూడదని.. దీనికి జవాబుదారీతనం ఒక్కటే పరిష్కారం అనే సంకల్పంతో 2005లో యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం దేశంలో ఎన్ని సంచలనాలను బయటపెట్టిందో, ఎంతటి మార్పుకు నాంది పలికిందో ప్రపంచం మొత్తం చూసింది. ఆనాడు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక ప్రజలంతా ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రతీ ఒక్కరికీ యేడాదికి కనీసం 100 రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో అదే ఏడాది కాంగ్రెస్ పార్టీ 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' తీసుకువచ్చింది. ఇది ఇప్పటికీ పల్లెల్లో ఎంత ప్రభావశీలంగా ఉపాధికి ఊతం ఇస్తోందో గ్రామీణ ప్రజానీకానికి అనుభవమే. అయితే ఎన్డీయే క్రమంగా లక్షల ఉపాధి హామీ కార్డులను తొలగిస్తూ వస్తున్నది. ఒక్క 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 5,48,27,121 జాబ్ కార్డులను వివిధ కారణాలు చెప్పి తొలగించింది. తెలంగాణలోనూ అదే ఏడాదిలో 17,32,936 జాబ్ కార్డులను తొలగించింది. ఇది గ్రామీణ ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది.

యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం–2009.. విద్యా వ్యవస్థలో ఒక విప్లవానికి నాందిగా నిలిచింది. ఈ చట్టం కింద 6–14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చింది. ఈ చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు పేదలకు కేటాయించేలా ఏర్పాట్లను చేసింది. కానీ ఎన్డీయే ప్రభుత్వం ఈ చట్టాన్ని పూర్తిగా శిథిలం చేసింది. అలాగే అవినీతిని కూకటివేళ్లతో పెకలించేందుకు 2013లో లోక్‌పాల్ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇవేకాదు, మహిళలపై హత్యలను, అత్యాచారాలను నిరోధించేందుకు అదే ఏడాది నిర్భయ చట్టాన్ని కూడా ఆమోదించింది. దేశంలో మూడింట రెండొంతుల మందికి ఆహార భద్రతను అందించేందుకు జాతీయ ఆహార భద్రతా చట్టం–2013 తీసుకువచ్చింది. దశాబ్దాలుగా దేశాన్ని పట్టి పీడించిన పోలియో మహమ్మారి పీడ యూపీఏ హయాంలోనే విరగడ అయ్యింది. అంతేకాదు ఆరు దశాబ్దాల కల అయిన తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. ఆనాడు తెలంగాణ బిడ్డల త్యాగాలకు చలించిపోయిన సోనియా గాంధీ.. ఎందరో అమాయకులైన పిల్లలు బలిదానాలు చేసుకుంటున్నారని ఆవేదనపడి, లాభ నష్టాల్ని బేరీజు వేసుకోకుండా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.

పది సంవత్సరాల యూపీఏ ప్రభుత్వంలో ఎన్నో రాజకీయ, పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తినా ఒక్కరోజు కూడా రాజకీయ అవసరాల కోసం నిర్ణయాలు తీసుకోలేదు. కాంగ్రెస్ పనిచేస్తూ పోతుంటే, బీజేపీ నాయకులు అబద్ధాలు చెప్తు, ప్రజల్ని అభూతకల్పనలతో భ్రమల్లోకి తీసుకుపోయారు. లేదంటే దేశం కోసం ఎన్నో అద్భుతమైన చట్టాల్ని రూపొందించిన కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోవడం ఏమిటి? యూరియా సబ్సిడీ, రక్షణ బడ్జెట్, విద్యా, వైద్య రంగాలకు యూపీఏ కేటాయించినంత కూడా ఈ పదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం కేటాయించలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

బీజేపీ నాయకులు ప్రజల్లో తాత్కాలిక అంతరాలను రెచ్చగొట్టి ఓట్లు రాబట్టుకునే కుతంత్రాలు చేస్తున్నారు కానీ, దూరదృష్టి కలిగిన ప్రణాళికలు, వివేకం వారిలో ఎక్కడా కనిపించడం లేదు. రైతులు కార్పొరేట్లకు ఊడిగం చేసేలా బీజేపీ తీసుకువచ్చిన మూడు రైతు చట్టాలు ఈ దేశ రైతాంగాన్ని తీవ్ర భయాందోళనలకు గురి చేశాయి. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు.. తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, తమను అశక్తులను చేసే చట్టాలను రద్దు చేయాలని పోరాటం చేసి చనిపోవడం తీవ్రంగా కలచివేసే అంశం. చివరికి రైతుల పోరాటానికి తలొగ్గిన బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాలను వెనక్కి తీసుకుంది. ఎన్డీయే ప్రభుత్వం రగిలించిన ఈ కుంపటి ఇప్పటికీ ఢిల్లీ చుట్టూరా మండుతూనే ఉంది.

గొళ్ళెం లేని తలుపు ఇంటిని కాపాడలేదు, కళ్ళెం లేని గుర్రం గమ్యం చేర్చలేదన్నట్టు.. హద్దు అదుపు లేని మాటలు, నినాదాలు–హామీలు గుప్పించిన బీజేపీ నాయకులు దేశ ఆర్థిక రంగాన్ని, జనసామాన్యాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేశారు. దేశంలో ఇప్పుడు నిరుద్యోగం 75 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తానన్న మోదీ ప్రభుత్వం.. అది మరిచి మహిళలపై అఘాయిత్యాలను రెండింతలు చేసింది. రేపటి భారతాన్ని నిర్మించాలంటే చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన సందర్భంలో 2023–24 బడ్జెట్‌లో 0.55శాతం నిధులే కేటాయించి అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే కుట్రకు తెరతీసింది. ఇవన్నీ ప్రజలు గమనించాలి. యూపీఏ పదేళ్ల పాలనలో మన దేశ జీడీపీ యావరేజ్ గ్రోత్ రేట్ 6.82శాతం ఉంటే, ఎన్డీయే పాలనలో అది 5.84శాతానికి పడిపోయింది.



రాజ్యాంగ విలువలకు అనుగుణంగా సాగిన యూపీఏ ప్రజాస్వామ్య పాలన, రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే ఎన్డీయే పాలనను ప్రజలు చూశారు. ఇప్పుడు ఎన్నికల రూపంలో ఒక అవకాశం వచ్చింది. ప్రజల కోసం పాలించిన ఆనాటి స్వర్ణయుగం మళ్లీ రావాలంటే.. పాంచ్ న్యాయ్ అందిస్తున్న ఇండియా కూటమి గెలుపు ఒక్కటే పరిష్కారం. అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పాలించేది కాంగ్రెస్ ఒక్కటే.

ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన నోట్ల రద్దు నిర్ణయం పేదల్ని రాత్రికిరాత్రి రోడ్డు పాలు చేసింది. పిల్లలకు పాల ప్యాకెట్లు కూడా కొనలేని అసహాయక స్థితికి ప్రజల్ని దిగజార్చింది. మనిషికి, మనిషికి నడుమ ఆర్థిక అంతరానితనాన్ని ప్రేరేపించింది. చేతిలో డబ్బులున్నా పూట గడవని భయంకరమైన పరిస్థితిలోకి నెట్టేసింది. ఇక జీఎస్టీ పేరిట తీసుకువచ్చిన చట్టం రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పూర్తిగా దెబ్బతీసింది. స్వయంగా రాష్ట్రమే ప్రజల స్థోమతకు అనుగుణంగా పన్ను వసూలు చేసుకునే వెసులుబాటును పూర్తిగా నిర్వీర్యం చేసి.. కేంద్రం గుంజేసుకుంది. ఇవేకాదు, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్ వంటి వివాదాస్పద చట్టాలను తీసుకువచ్చి ప్రజల్ని ఒక విధమైన గంభీరమైన వాతావరణంలోకి నెట్టేసింది. ఇక వ్యాక్సిన్ల విషయంలో బీజేపీ చేసినంత హడావిడి ఈ ప్రపంచంలో మరే పార్టీ చేయలేదు. అసలు వ్యాక్సిన్‌ను కనిపెట్టిందే నరేంద్ర మోదీ అన్నట్టు వ్యాక్సిన్ సర్టిఫికెట్ల నుంచి ప్రసారమాధ్యమాల దాకా మోదీ నామస్మరణ చేశారు.

రాజ్యాంగ విలువలకు అనుగుణంగా సాగిన యూపీఏ ప్రజాస్వామ్య పాలన, రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే ఎన్డీయే పాలనను ప్రజలు చూశారు. ఇప్పుడు ఎన్నికల రూపంలో ఒక అవకాశం వచ్చింది. కాంగ్రెస్ తెలంగాణ వేదికగా పాంచ్ న్యాయ్ పేరిట మ్యానిఫెస్టో విడుదల చేస్తున్నది. చదువుకున్న ప్రతీ యువతీయువకుడికి యువ న్యాయం కింద ఒక లక్ష రూపాయల ఆర్థిక తోడ్పాటును అందిస్తుంది. నారీ న్యాయం కింద ప్రతి నిరుపేద మహిళకు ఒక లక్ష ఆర్థిక సహాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రైతు న్యాయం కింద రుణమాఫీ, ఎంఎస్పీ ధరను భరోసా ఇస్తుంది. శ్రామిక న్యాయం కింద కార్మికుడికి ప్రతీ రోజు రూ.400 రూపాయల పని కల్పిస్తుంది. సామాజిక న్యాయం కింద దేశ ప్రజలంతా కోరుకుంటున్న జనగణను చేపడుతుందన్న సంగతిని ప్రజలంతా గ్రహించి ఆశీర్వదించాలి. ప్రజల కోసం పాలించిన ఆనాటి స్వర్ణయుగం మళ్లీ రావాలంటే.. పాంచ్ న్యాయ్ అందిస్తున్న ఇండియా కూటమి గెలుపు ఒక్కటే పరిష్కారం. అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పాలించేది కాంగ్రెస్ ఒక్కటే.

తమను పాలించే నాయకుణ్ణి ఎన్నుకునే అధికారం కేవలం ఎన్నికల ద్వారా మాత్రమే ప్రజలకు ప్రాప్తిస్తుంది. పాతమంత్రులు పోతుంటారు.. కొత్త సచివులు వస్తుంటారు అంటాడు శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో. ఇప్పుడు కొత్త సచివులు రావాల్సిన అవసరం ఉంది. అందరిదీ ఒక కీర్తన.. అందరిదీ ఒకే ప్రార్థన.. ఈ నియంతృత్వం పోవాలి.. దేశమంతా ప్రజాప్రభుత్వం రావాలి. ప్రజల కోసం నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని ఆశిస్తూ.. తుక్కుగూడ సభ ప్రజాప్రభుత్వ ఏర్పాటుకు నాంది పలుకుతుందని ఆశిస్తున్నాను.

• కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

'క్విడ్ ప్రో కో' మరో రూపం ఎలక్టోరల్ బాండ్స్!

కేజ్రీవాల్ అరెస్ట్‌పై యాగీ ఎందుకు' అనే శీర్షికన మార్చి 26న ఆంధ్రజ్యోతి పత్రికలో బీజేపీ నాయకులు సత్యకుమార్ వ్యాసం రాశారు. అందులో ప్రజాస్వామ్యం, అవినీతి వంటి అనేక అంశాలు ప్రస్తావించారు. 1975 ఎమర్జన్సీ నుంచి నేటి పరిస్థితిని పోల్చి కొన్ని విషయాలు తెలిపారు.

ఆ విషయాలన్నీ పక్కన పెట్టి ఆయన వేసిన, బాగా ఆశ్చర్యమైన ఒక ప్రశ్నకు సమాధానం వెతక్కోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలకు అవసరం. అవి ఆ పని చేస్తాయా, చేయవా అనేది వారి విజ్ఞతకే వదిలెయ్యాలి. అందులో సామాన్యులు చేయగలిగిందేమీ లేదు. అయితే సామాన్యులు కూడా ఆయన వేసిన ప్రశ్నకు సమధానం వెతకడం, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు అత్యవసరం.

ఎన్నికల బాండ్ల గురించి ప్రస్తావిస్తూ ఆయన వేసిన ప్రశ్న ఏమిటంటే 'రాజకీయ పార్టీలు నిధులు సమకూర్చుకోవడానికి ఇంతకంటే మెరుగైన విధానమేదైనా ఉందని సూచిస్తే మోదీ ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది' అని పేర్కొన్నారు. ఇది చాలా విలువైన ప్రశ్న. చూడ్డానికి తేలికగా కనబడుతుంది కానీ, కొద్దిగా లోతులకు వెళ్లి సమాధానం వెతికితే అనేక రాజకీయాలు, వివిధ రాజకీయ పార్టీల అసలు నైజాలు ప్రజలకు అవగతం మవుతాయి.

సాధారణంగా మన నిజ జీవితంలో మనకు సహాయం చేసినవారికి తిరిగి సహాయం చేయడం పరిపాటి. అది అవసరం కూడా. రాజకీయ పార్టీలన్నీ ఎటువంటి మినహాయింపులూ లేకుండా తాము ప్రజా సేవ చేయడానికే పని చేస్తున్నామని తెలుపుతారు. తాము కార్పొరేట్ల కోసం పని చేస్తామని ఎవరూ తెలపరు. కానీ విచిత్రంగా అనేక పార్టీలు ఒక్క వామపక్షాలు మినహా గెలిచిన తరువాత ప్రజలకు చేసే సేవ కంటే ఎక్కువ భాగం తరతమ స్థాయిలలో కార్పొరేట్ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయనేది ఆచరణలో మనం చూస్తున్నాం. ఎందుకిలా జరుగుతోంది అన్నది పరిశీలించవలసిన విషయం.

ప్రజల కోసం పనిచేసే వారైతే వారి పార్టీలకు అవసరమైన నిధులు కూడా ప్రజల నుండే వసూలు చేసుకోవాలి. అప్పుడు మాత్రమే కేవలం ప్రజా ప్రయోజనాలే మిన్నగా పని చేస్తారు. కానీ మన దేశంలో కమ్యూనిస్టేతర పార్టీలేవీ ప్రజల నుండి నిధులు సమకూర్చుకోవడం లేదు. ఈ పార్టీలన్నీ నిధుల కోసం ఆధారపడేది కార్పొరేట్ సంస్థల మీదే. తెలుగు రాష్ట్రాలలో కూడా ప్రధాన ప్రాంతీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు భారీగానే సమకూరాయని సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఎన్నికల కమిషన్ ప్రకటించిన వివరాలను బట్టి తెలుస్తోంది.

తమది పెద్ద పార్టీ కాబట్టి ఎక్కువ నిధులు వచ్చాయని సత్యకుమార్ ఎంత సమర్థించుకోవడానికి ప్రయత్నించినా, పోనీ ఆయన చెప్పిన లెక్కన చూసినా ఒక్క విషయం మాత్రం స్పష్టంగా తెలిసేదేమిటంటే వారి సీట్ల సంఖ్య, వచ్చిన ఓట్ల కంటే రెట్టింపుకు పైగా బీజేపీకి నిధులు వచ్చాయన్నది వాస్తవం.

అసలు ఇటువంటి నిధుల సేకరణను ఎన్నికల బాండ్ల ద్వారా చట్టబద్ధం చేసింది మోదీ ప్రభుత్వమే. అంతే కాక, ఎవరు, ఎవరికి, ఎంత నిధులు ఇచ్చారనేది కూడా గోప్యంగా ఉంచేలా చేసింది కూడా మోదీ ప్రభుత్వమే. ఎందుకిలా చేసిందన్నది కొద్దిగా ఆలోచించేవారెవరికైనా ఇట్టే అర్థమవుతుంది. దీన్ని సమర్థించుకోవడానికి వారు చేస్తున్న ఇంకో వింత వాదన ఏమిటంటే ఈ బాండ్ల ద్వారా నల్లధనం బయటకు వచ్చి తెల్ల ధనంగా మారుతుందని. దీనర్థం ఏమిటంటే కార్పొరేట్ల నల్లధనాన్ని తెల్లదిగా మార్చే ఏజెంట్లుగా రాజకీయ పార్టీలు వ్యవహరించడన్న



ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలది కీలకమైన స్థానం. అలాంటి రాజకీయ పార్టీలను కార్పొరేట్ బ్రోకర్లుగా మార్చే పథకమే ఎలక్టోరల్ బాండ్ల పద్ధతి. అందువల్ల ఈ పథకంలో పారదర్శకతా లేదు, నైతికత అంతకంటే లేదు. నిజంగా ప్రజాసేవ చేయాలనుకునే ఏ పార్టీ అయినా కేవలం ప్రజల నుండి నిధులు సమకూర్చుకుంటేనే వారి మాటలను నమ్మవచ్చు.

మాట. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలది కీలకమైన స్థానం. అలాంటి రాజకీయ పార్టీలను కార్పొరేట్ బ్రోకర్లుగా మార్చే పథకమే అవుతుంది ఇది. అందువల్ల ఈ పథకంలో పారదర్శకతా లేదు, నైతికత అంతకంటే లేదు. సుప్రీంకోర్టు జోక్యం లేకపోతే ఈ విషయాలేవీ ఎప్పటికీ తెలిసేవే కావు. కోర్టు అంత గట్టిగా చెప్పినా స్టేట్ బ్యాంకు వివరాలను తెలపడానికి ఎన్ని నాటకాలాడిందో చూసాం. పారదర్శకత లేకుండా అంత గోప్యం ఎందుకు వహించవలసి వచ్చింది అన్నది మోదీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

వాస్తవంగా బీజేపీ ఈ నిధులు సమకూర్చుకోవడానికి ఒక కొత్త పద్ధతి కూడా కనిపెట్టింది. అదేమిటంటే ఈడీ, సీబీఐ, ఇన్‌కంటాక్స్ వంటి సంస్థల ద్వారా కంపెనీలపై దాడులు చేయించడం, ఆ కంపెనీలు తరువాత భారీగా ఎన్నికల బాండ్లు కొనడం, వాటిని బీజేపీ మార్చుకోవడం వంటి అంశాలన్నీ వివిధ పత్రికలు, న్యూస్ చానళ్లలో చూస్తూనే ఉన్నాం. భారీ మొత్తంలో బీజేపీకి అందిన ఈ నిధులతోనే అనేక రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను మోదీ ప్రభుత్వం కూల్చేసింది. ఎమ్మెల్యేలను బజార్లో సరుకులుగా కొనేసింది. అలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. తిరిగి తామేదో ఘనకార్యం చేసేశామని, తాము తమ మిత్రపక్షాలే అత్యధిక రాష్ట్రాలలో అధికారంలో ఉన్నామని గొప్పలు చెప్పుకుంటోంది. కానీ వాస్తవాలను గమనిస్తే నిజంగా ఎన్నికల ద్వారా బీజేపీ అధికారంలోనికి వచ్చింది తక్కువే. మిగిలిన సందర్భాలన్నీ ఈ నిధుల సహాయంతో ప్రభుత్వాలను కూల్చినవే. దీన్నిబట్టి తెలుస్తున్నదేమిటంటే ఎన్నికల బాండ్లు కేవలం కార్పొరేట్లకు సేవ చేయడమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకే భంకరంగా ఉంటాయన్నది ఈ దేశ పౌరులు అర్థం చేసుకోవడం దేశ ప్రయోజనాలకు అత్యవసరం.

సరిగ్గా ఈ కార్పొరేట్ల నుంచి నిధులు తీసుకోవడం వల్లనే, మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలకు, అడవులను, గనులను, ఖనిజాలను, ఆఖరుకు సముద్రంతో సహా సహజ వనరులన్నింటినీ కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోంది. దీనినే క్విడ్ ప్రో కో అంటారు. ఇది దేశ ప్రయోజనాలకు తీవ్ర హానికరం. మోదీ ప్రభుత్వ ఈ కపట నీతిని ప్రజలు అర్థం చేసుకోవాలి. నిజంగా ప్రజాసేవ చేయాలనుకునే ఏ పార్టీ అయినా కేవలం ప్రజల నుండే నిధులు సమకూర్చుకుంటేనే వారి మాటలను నమ్మవచ్చు. ఈ విషయంలో నిస్సందేహంగా కమ్యూనిస్టు పార్టీలే ఆదర్శం.

■ ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక


నాయకత్వ సమస్యకు పరిష్కారమేమిటి?

రాజకీయాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. అలాంటి రాజకీయాలు మళ్ళీ సమాజాన్నే ప్రతిబింబిస్తాయి. ఓ ఆర్థిక నేరస్థుడో, ఓ హంతకుడో అధికారం చేపడితే అమాయకులైన ప్రజలను సదరు వ్యక్తి మోసం చేసి ఓట్లు వేయించుకున్నాడనుకోవడం హాస్యాస్పదం. నేర ప్రవృత్తిగల వ్యక్తులు అందలమెక్కారంటే, అందుకు కారణం... సమాజంలో అదే తరహా నేర ప్రవృత్తి గల ప్రజలు అధిక సంఖ్యాకులు కావడమేనని సూత్రీకరిస్తే, అది తప్పెలా అవుతుంది?

ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్ష నాయకులను అవినీతి కేసుల్లో జైళ్లకు పంపుతున్నప్పటికీ అధికార పార్టీలు నిజాయితీకి నిలయాలని ప్రజలు భ్రమపడే పరిస్థితి లేదు. రాజకీయాలంటేనే రొచ్చుగుంట, రాజకీయ నాయకులందరూ అవినీతిపరులేనని ప్రజలు భావిస్తుండడమే రాజకీయ చైతన్యం కొరవడడానికి ప్రధాన కారణం. అంతేకాదు, రోజు రోజుకూ ప్రజలు కూడా అవినీతి రొంపిలోకి లాగబడుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉచిత పథకాలు అనుచితాలవుతున్నాయి. పెరుగుతున్న సంపదలో పేదలు భాగస్వాములు కాకుండా, వారికి తమ స్థితి పట్ల పూర్తి అవగాహన రాకుండా చేయడంలో రాజకీయ పెట్టుబడిదారులకు ఉచిత పథకాలు వజ్రాయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. సంక్షేమం మాటున సంపద దోపిడీ చేసినవారు, జనాన్ని మతం మత్తులో ముంచి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని నిస్సిగ్గుగా ముందుకు తీసుకెళ్తున్న వారు మహానేతలుగా చెలామణీ కావడం దేశ భవితకు హానికరం.

ఇన్ని రాజకీయ పార్టీలు, ఇంతమంది రాజకీయవేత్తలు, ఇంత జనాభా ఉన్న దేశంలో ప్రధానమంత్రి పదవికి పోటీ పడగల సమర్థుడైన మరో వ్యక్తి ముందుకు రాకపోవడం వింతకు లోనయ్యే స్థితికాదు, చింతకు గురయ్యే పరిస్థితి. స్వతంత్రం వచ్చినపుడు మన దేశ జనాభా సుమారు ముప్పై నాలుగు కోట్లు. అపుడు త్యాగశీలురు, ధీరోదాత్తులు, మేధావులైన రాజకీయనేతలెందరో ఉండేవారన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ప్రస్తుత భారతదేశ జనాభా నూటనలభై కోట్లకు పైనే, అక్షరాస్యత కూడా ఎంతో పెరిగింది, అయినా సమర్థులైన నాయకుల కొరత ఎందుకొచ్చిందో తెలుసుకోవడం ప్రజలకే అవసరం. ఎందుకంటే అంతిమంగా తమ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది రాజకీయాలే. మంచి పౌరులతో కూడిన సమాజంలోనే మంచి రాజకీయం వీలవుతుంది. అటువంటి సమాజమే మంచి నాయకులను లోకానికి అందించగలుగుతుంది. సామాజిక జీవనంలో నిజాయితీ, పౌరుడిగా తమ బాధ్యతలు నిర్వహించడంలో నిబద్ధత కలిగి ప్రజాస్వామిక దృక్పథంతో వ్యవహరించే ప్రజలే దేశానికి అవసరం. వారి నుంచే దేశాన్ని పురోగమనం దిశగా నడిపించే నాయకుడు అవతరిస్తాడు.

– గౌరాబత్తిన కుమార్‌బాబు





విద్యార్థిని కూచిపూడి నృత్యం

విజ్ఞానం.. వినోదం..

- నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ప్రారంభం
- వసంతోత్సవ సంబురంతో క్యాంపస్‌లో సందడే సందడి
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు



నుక్కడ్ నాటక్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిట్‌లో జరిగిన ప్రో షోలో పాటలు పాడుతున్న సింగర్స్ శిరీషా, హరిచరణ్





మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి

విద్యార్థులకు సాంకేతిక విద్యా విజ్ఞానాన్నే కాదు.. వినోదాన్ని కూడా పంచేలా వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో ప్రతీ ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) వేడుకలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంస్కృతిక మేళా కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన వేలాది మంది విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. ఈ ఉత్సవాలను వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి ప్రారంభించారు. ఇక మొత్తం 50కిపైగా ఈవెంట్లకు గాను తొలిరోజు 17ఈవెంట్లను నిర్వహించారు. అలాగే రాత్రి నిట్ స్టేడియంలో నిర్వహించిన కొరియోనైట్ పాప్‌షో ఉర్రూతలూగించగా.. మ్యూజిక్‌కు అనుగుణంగా విద్యార్థులు కేరింతలు కొడుతూ చిందులేశారు. చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వివరాలు 5లో..



పాత బస్‌స్టేషన్‌లో ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తవ్వుతున్న దృశ్యం

వరంగల్ కొత్త బస్టాండ్ పనులు షురూ

- పాత భవనాల కూల్చివేత
- బస్టాండ్‌కు రాకపోకల నిలిపివేత

4లో..



పాత బ్రిడ్జి కూల్చివేత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు

నయీంనగర్ కొత్త బ్రిడ్జి 3 నెలల్లో పూర్తి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ముమ్మరంగా పాత బ్రిడ్జి కూల్చివేత పనులు

6లో..

శుక్రవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0° C
కనిష్ఠం : 24.0° C

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.36 గం..
సహర్ : ఆదివారం ఉ : 4.43 గం..

‘ఆయుర్వేదం’పై నిర్లక్ష్యం!



బోధనాసుపత్రిని పట్టించుకోని ప్రభుత్వం

- ఉద్యోగులు, సిబ్బంది కొరతతో అందని సేవలు
- రిటైర్ అయిన వారి స్థానాలు ఏళ్లుగా ఖాళీగానే..

గిర్మాజిపేట, ఏప్రిల్ 5 : దీర్ఘకాలిక, మొండి రోగాలే కాకుండా అల్లోపతికి కూడా లొంగని రోగాలకు సంపూర్ణ వైద్య చికిత్స అందిస్తున్న ఆయుర్వేదంపై ప్రజలు విశ్వాసం చూపుతున్నా ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది. మైగ్రేన్, మోకాళ్ల, నడుము నొప్పులు, స్పాండిలైటిస్, అర్షమొలలు, డయాబెటిక్ ఫుట్, వెరికొస్‌వేన్స్ లాంటి వాటికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి.. సిబ్బంది కొరత, సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా ఆయుర్వేదం ఆసుపత్రికి మహర్దశ రావటంలేదనే విమర్శలున్నాయి. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో అధునాతన భవనాలు, మౌలిక సదుపాయాలతో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలోని 120పడకల ఇన్‌పేషంట్ వార్డులో నిత్యం 90 మంది వరకు ఉచితంగా చికిత్స పొందుతుంటారు. వీరిలో ఉమ్మడి వరంగల్‌తో పాటు ఖమ్మం, కరీంనగర్ జిల్లాలు, ఏపీ, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వచ్చే రోగులుంటారు.

మొత్తం పోస్టులు 61, ఖాళీలు 38...

రిటైర్ అవుతున్న సిబ్బంది స్థానంలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఆసుపత్రిలో 120 పడకలున్నా 58పడకల స్థాయిలోనే 61సాంక్షన్ పోస్టులుండగా మరో 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బయోకెమిస్ట్-1, హెడ్ నర్సు-1, స్టాఫ్ నర్సులు-7, ఫార్మసిస్టులు-2, ల్యాబ్ టెక్నిషియన్-1, రేడియోగ్రాఫర్-1, డార్క్‌రూం అసిస్టెంట్-1,ఎక్స్‌రే అసిస్టెంట్-1, ఏఎన్ఎం-1, పంచకర్మ మాసాజిస్ట్-1, నర్సింగ్ అర్డర్లీ-4 పోస్టులతో పాటు దాయ, కుక్, స్వీపర్, వాచ్ మెన్, స్కావెంజర్, వాటర్‌మెన్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మసిస్ట్ శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నా ఆయుష్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ప్రమోషన్ ఇవ్వకపోవటంతో ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొందరు వైద్యులు డిప్యూటేషన్‌పై రావడంతో కొంతమేరకు కొరత తీరింది. అలాగే అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు, హౌజ్‌సర్జన్‌లు కూడా సేవలు అదిస్తున్నారు. ఇక ఆసుపత్రి ఆవరణ, విభాగాలను శుభ్రం చేసే సిబ్బంది సరిపడా లేరు.

మంత్రి సురేఖపై ఆశలు



మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనే అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, ప్రభుత్వ ఆయుర్వేద బోధన అస్పత్రి ఉండటంతో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. గతంలో ఈ కళాశాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన కొండా సురేఖ మంత్రిగా మరోసారి దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఉద్యోగులు, సిబ్బంది నియామకం, ఎక్స్‌రే, తదితర యూనిట్ల పునరద్ధరణ లాంటి వాటితో మెరుగైన ఆయుర్వేద వైద్య సేవలు అందుతాయని భావిస్తున్నారు.

నర్సింగ్ సేవలు పూర్తిగా బంద్

ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలోని మొత్తం 8 నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉండటంతో నర్సింగ్ సేవలు అసలే లేవు. హెడ్ నర్సు ఒకరు, స్టాఫ్ నర్సులు ఏడుగురు రిటైర్ అవగా అప్పటి నుంచి ఖాళీగానే ఉంటున్నాయి. దీంతో రోగులకు వారి బంధువులే నర్సింగ్ సేవలు అందిస్తుండగా.. కొన్ని కేసుల్లో ఆయుర్వేద వైద్య విద్యార్థులు, హౌజ్ సర్జన్లు నర్సింగ్ సేవలందిస్తున్నారు.

దశాబ్దాలుగా ఎక్స్‌రే యూనిట్ మూత

రేడియో గ్రాఫర్, డార్క్ రూం, ఎక్స్‌రే అసిస్టెంట్లు రిటైర్ అవడంతో ఎక్స్‌రే యూనిట్ మూతపడింది. చివరకు పాతకాలం నాటి మిషన్ కావడంతో అది తుప్పు పట్టి పాడైపోయింది. దశాబ్దాలు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో రోగులు రూ.వందలు వెచ్చించి ప్రైవేట్ ఎక్స్‌రే సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. అధునాతన మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఆయుర్వేద ఆస్పత్రి పంచకర్మ విభాగంలో రోగులు

దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది..

- ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి
- హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ చంద్రకుమార్

4లో..



జగ్జీవన్‌కు ఘన నివాళి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 5 : భారత మాజీ ఉప ప్రధాని, దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, ఎ.వెంకట్‌రెడ్డి, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌వో వైవీ గణేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ నిర్మల, ఇతర ప్రభుత్వ అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది..

- ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి
- రాష్ట్ర హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ చంద్రకుమార్
- కేయూలో ఘనంగా బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరుగుతోందని రిటైర్డు హైకోర్టు జడ్జీ జస్టిస్ బి.చంద్రకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ కేయూలో బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఎస్డీఎల్‌సీఈ సమీపంలోని బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి చంద్రకుమార్‌తోపాటు కేయూ వీసీ రమేశ్ ఇతర అధికారులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి అధ్యక్షతన ఏర్పాటు జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా 'కాంటెంపరరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై కీలక ప్రసంగం చేశారు. దేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. జీవన సౌకర్యాలకు, ప్రమాణాలకు స్థూల, దేశీయ ఉత్పత్తి, తలసరి ఆదాయ గణాంకలలో పొంతనలేదన్నారు. దేశంలో పేదరికం ఎక్కువవుతోందన్నారు. రూ.80 లక్షల కోట్లన ల్లధనం ఉందన్నరని, కొద్దిమంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతం అవుతోందని చెప్పారు. ప్రాజెక్టు అంచనాలను పెంచి ప్రజల సొమ్మును దోచుకుకుంటున్నారని చెప్పారు.

ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ గొప్ప మార్గదర్శి, సమతాస్పూర్తి బాబు జగ్జీవన్‌రాం ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో యువత ముందుండాలని చెప్పారు. విద్యతోనే మార్పు సాధ్యమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ గొప్ప విలువలున్న మానవతా మూర్తి జగ్జీవన్‌రాం అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన తుమ్మల రాజమణి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాంను ఆదర్శంగా తీసుకుని, యువత ఎదగాలని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశా కాంట్రాక్టు అధ్యాపకురాలు లక్ష్మి సభకు స్వాగతం పలుకగా, పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేశారు. చరిత్రఅండ్ టూరిజం ఫ్యాకల్టీ చిలువేరు రాజ్‌కుమార్ జస్టిస్ చంద్రకుమార్‌ను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ప్రొఫెసర్ కె.వాసుదేవారెడ్డి, దూరవిద్య కేంద్రం ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొట్టే భాస్కర్, పాలమాకుల కొమురయ్య, బైరపాక ప్రశాంత్, పెండ్లి అశోక్‌బాబు, సుదయ్య, శ్రీధర్‌కుమార్ లోథ్, ప్రణయ్‌కుమార్, వెంకటేశ్, మాచర్ల ఐలేశ్, వంగాల సుధాకర్ పాల్గొన్నారు.


మూసివేసిన పాత బస్‌స్టేషన్

కొత్త బస్టాండ్ పనులు షురూ

- వరంగల్‌ల్ ఆర్టీసీ పాత భవనాల కూల్చివేత

గిర్మాజిపేట, ఏప్రిల్ 5 : నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సేవలు అందించిన వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఇక కనుమరుగు కానుంది. మొండిగోడలు, పరిశుభ్రంలేని టాయిలెట్లు, ప్రయాణికులకు భద్రతలేని శిథిలావస్థకు చేరుకున్న బస్‌స్టేషన్ స్థానంలో అధునాతన మల్టీలెవెల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి పనులు శుక్రవారం నుంచి పనులు మొదలయ్యాయి. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా నాటి ప్రధాని దివంగత పీవీ నరసింహరావు 1986 డిసెంబరు 21న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టిరామారావు ప్రారంభించారు. సిటీ, జిల్లా బస్‌స్టేషన్‌లతో కూడిన ఈ బస్‌స్టేషన్ నుంచి నిత్యం 600 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా గత ప్రభు త్వం రూ.75కోట్ల 'కుడా' నిధులతో నూతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. గత జూన్ 17న అప్పటి మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మం త్రి కేటీఆర్ శిలాఫలకం వేయగా, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిగంటల ముందు అప్పటి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అక్టోబరు 9న పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం, ఈ ఏడాది జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో బస్‌స్టేషన్ నిర్మా ణం పనులు మొదలు కాలేదు. తాజాగా దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖల మంత్రి కొండా సురేఖ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని చెప్పడంతో 'కుడా' అధికారులు పనులు తిరిగి ప్రారంభించారు. ఏడు అంతస్థుల్లో అధునాతన బస్‌స్టేషన్‌లో 32 బస్ ప్లాట్‌ఫారాలు, మల్టీప్లెక్స్, రెస్టారెంటు,కమర్షియల్ కాంప్లెక్‌లు నిర్మించనున్నారు.

రాకపోకల నిలిపివేత..

కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం శుక్రవారం అధికారులు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బస్టాండ్ మీదుగా వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఎస్ఎన్ఎం క్లబ్‌కు ఎదురుగా రైల్వే ప్రహరికి ఆనుకుని తాత్కాలిక బస్‌స్టేషన్ నుంచి ప్రస్తుతం బస్‌ల రాకపోకలు యథాతథంగా సాగనున్నాయి. శుక్రవారం పాత బస్‌స్టేషన్‌ను పూర్తిగా మూసివేశారు. లోనికి ఎవరూ వెళ్లకుండా పెద్దతాళ్లు కట్టారు. ఖాళీ చేసిన గదుల నుంచి ఇనుప సామగ్రి, డోర్స్, కిటికీలు, పైపుల తొలగింపును ముమ్మరం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో ట్యాక్సీ స్టాండ్ ప్రాంతంలో గోతులు తీస్తున్నారు.


మూసివేసిన బస్‌స్టేషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్‌లు



ప్రతిజ్ఞ చేపిస్తున్న ప్రొఫెసర్లు

సాంకేతిక వైద్యవిద్య వైపుగా పరుగు పెట్టాలి

- ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్
- కేఎంసీలో ఘనంగా పట్టాల ప్రధానోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 5 : కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు ప్రస్తుతం మన దేశంలోనే కాకుండా, విదేశాల్లోనూ ఉన్నత వైద్యులుగా రాణిస్తున్నారని కేఎంసీ పూర్వవిద్యార్థి, ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్ తెలిపారు. అలాగే సాం కేతిక వైద్యవిద్య వైపుగా పరుగులు పెట్టాలని సూచించారు. శుక్రవారం కేఎంసీ కళాశాల మైదాన ప్రాంగణంలో వైద్యవిద్యను పూర్తి చేసిన విద్యార్థుల పట్టాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలో మానవత్వాన్ని విస్మరించవద్దని కోరారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమంలో కళాశాల మైదానంలో కోలాహాలం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు వేడుకల్లో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో వైద్యవిద్యను పూర్తి చేసుకుని పట్టాలు అందుకున్న నేపథ్యంలో విద్యార్థులు వారి బంధువులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



కుటుంబసభ్యులతో పట్టా అందుకున్న ఆనందాన్ని పంచుకుంటున్న వైద్య విద్యార్థి

గైనిక్‌లో పీజీ చేస్తా

- డాక్టర్ సాయిశ్రీభవ్య

తల్లిదండ్రులు, సోదరుడి సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ఎమ్మెస్ గైనిక్ పూర్తి చేయాలని ఉంది. వైద్యవృత్తిలో పేదలకు సేవ అందించాలని ఉంది. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేరుస్తా. పట్టా పొందడం ఆనందంగా ఉంది. అమ్మానాన్న కళ్లల్లో ఆనందం నాకు కనిపించింది.



మేళా ఈవెంట్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



కరొకే ఈవెంట్‌లో పాటలు పాడుతున్న విద్యార్థులు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజ్ఞానం.. వినోదం..

నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభం

- వసంతోత్సవ సంబురంతో సందడిగా క్యాంపస్
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజులపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : విజ్ఞానం, వినోదం కలగలిసిన స్ప్రింగ్ స్ప్రీ-2024 (వసంతోత్సవం) వేడుకలతో కాజీపేటలోని నిట్‌లో కోలాహలం నెలకొంది. శుక్రవారం ప్రారంభమైన ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. ప్రతి ఏటా ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో వరంగల్ నిట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 40 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 10 వేలమంది విద్యార్థులు పాల్గొంటున్నారు. విద్యార్థులకు ప్రతిభకు సానబట్టడంతో పాటు వారిలో దాగిఉన్న శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకతను తట్టిలేపే 50కిపైగా ఈవెంట్లను ఇక్కడ నిర్వహిస్తున్నారు. గతంలో కన్నా ఈసారి సరికొత్తవి ప్రవేశపెట్టారు. విజ్ఞానం, వినోదం కలగలిసిన ఈ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. స్ప్రింగ్ స్ప్రీ మొదటి రోజు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచే ఈవెంట్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 17 ఈవెంట్లను నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థులు నిట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకే అయిదువేల మందికిపైగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శని, ఆదివారాల్లో కూడా రెండురోజులు రిజిస్ట్రేషన్లు జరిగి మూడు రోజుల్లో మొత్తంగా పదివేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు స్ప్రింగ్ స్ప్రీ నిర్వాహకులు తెలిపారు. రాత్రి నిట్ స్టేడియంలో నిర్వహించిన కొరియోనైట్ పాప్‌షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. మ్యూజిక్ అనుగుణంగా విద్యార్థులు చిందులేశారు. చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అంబరాన్నంటిన సాంస్కృతిక సంబరం

నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం మొదటిరోజే టెక్నోక్రాట్స్ అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిత్యం సాంకేతిక రంగంతో కుస్తీ పడుతున్న భావి భారత ఇంజనీర్లు వారిలోని సృజనాత్మక సాంస్కృతికతను బహిష్కృతం చేస్తున్నారు. సాంస్కృతికానికి సాంకేతికతను అద్దుతూ ఉత్సాహవంతమైన ఈవెంట్లను ప్రదర్శించారు. కాగా, నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ-2024ను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి అట్టహాసంగా ప్రారంభించారు. ఆరంభషో అదిరింది.

ఆకట్టుకున్న ఈవెంట్లు..

- నిట్‌లోని ఏక్ భారత్ శ్రేష్ఠ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహూతలను అలరించింది. ప్రముఖ కూచిపూడి నర్తకి తాడూరి రేణుక తన శిష్య బృందంతో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.
- యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో వివిధ రకాలైన క్రీడలు నిర్వహిస్తారు. ఆసక్తిగల వారు మేళాలో నిర్వహించే అన్ని రకాల క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి. వారి ప్రతిభ ఆధారంగా వారికి పాయింట్లు ఇస్తారు. అలాగే స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమంలో భాగంగా నిట్ యానిమీ అండ్ కామిక్ క్లబ్ ఆధ్వర్యంలో యానిమీ షోలు ప్రదర్శించారు.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నుక్కడ్ నాటక్ అనే ప్రత్యేక నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. సమాజంలో జరుగుతున్న వివిధ రకాల రుగ్మతల పట్ల సమాజం స్పందించాల్సిన తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన విద్యార్థులు ఆహూతుల ప్రసంశలు అందుకున్నారు.
- అన్ సాల్వ్‌డ్ పేరుతో నిట్‌లోని లిటరసీ అండ్ డిబేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట గమ్మత్తుగా ఉండటంతోపాటు థ్రిల్లర్ సినిమాను తలపించింది. అనేక రకాల ప్రశ్నల నుంచి ఆరుగురు అనుమానితుల నుంచి అంశం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హంతకులను గుర్తించడం ఈ ఆటలో ప్రధాన అంశం.
- ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్ వరంగల్ గాట్ టాలెంటెడ్ కార్యక్రమం అద్భుతంగా సాగింది. సుమారు 100 మంది విద్యార్థులు ఈ షోలో పాల్గొని వారి కళలను ప్రదర్శించి వీక్షకుల ప్రశంసలు పొందారు. అలాగే మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గానలహరి కరొకే టెక్నోక్రాట్‌లకు కిర్రాక్ లేపింది. ఆసక్తి ఉన్న వారు తమ గాత్రాన్ని పరిచయం చేసుకుని శ్రోతలను మెప్పించాల్సి ఉంటుంది.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబరంలో డ్రామా కాంపిటేషన్‌తో పాటు డ్రామా యాక్షన్ సన్నివేశాలను ఆవిష్కరించారు. వేషాలు, వేషధారణలు లేకుండా విద్యార్థులు వివిధ రకాల పాత్రలను పండించారు. విషాదాలు, విచిత్రాలు, హాస్యాలు, హాహాకారాలు ఇలా అనేక రకాలైన పాత్రలను విద్యార్థులు అవలీలగా పోషించారు.
- ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాఫిక్ డిజైన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఛాయ్ బిస్కెట్ సినిమా ఎడిటర్ డ్రాంప్ కిరణ్ పాల్గొని విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. అనంతరం ఫిల్మ్ క్విజ్ నిర్వహించారు.
- డ్యాన్స్ అండ్ డ్రమెటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రీల్‌రీల్ రెవ్లట్‌లో ఆన్‌లైన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆసక్తి గల విద్యార్థులు పాల్గొని వారు చేసిన రీల్స్‌ను ఆన్‌లైన్‌లోనే ప్రదర్శించారు.
- ఫుడ్ హంట్ ఆహూతుల నోరూరించింది. నిట్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వారి ప్రాంతాలకు చెందిన శాఖాహార, మాంసాహార ప్రత్యేక పదార్థాలను ప్రదర్శించారు.



సంస్కృతి, సాంకేతికత సమ్మిళితంతో సరికొత్త ఆవిష్కరణలు

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి

సంస్కృతి, సాంకేతికత సమ్మేళితంతోనే సరికొత్త సృజన ఆవిష్కృతమవుతుందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి అన్నారు. శుక్రవారం స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను నిట్ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సంస్కృతి, సాంకేతికత ఈ రెండు వేర్వేరు అయినా వీటి మధ్య అంతఃసూత్రం ఉందన్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు మానసికోల్లాసానికి, తమలోని సృజనకు పదునుపెట్టడానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో తరుచూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ, నిట్ కల్చరల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.సంతోష్ బెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



దుమ్మురేపిన ప్రోషో..

వసంతోత్సవంలో మొదటి రోజు ప్రోషో దుమ్మురేపింది. ప్రముఖ గాయకుడు హరిచరణ్ బ్యాండ్ షోతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. హరిచరణ్ పాటలు పాడుతున్నంత సేపు స్టేడియం మొత్తం కోలాహలంగా మారింది. అనంతరం మరో ప్రముఖ సింగర్ శిరిష తన గానంతో భావి భారత ఇంజనీర్లను సంభ్రమాశ్చర్యాల్లో ముంచి తేల్చారు. చౌరస్తా బ్యాండ్ షోతో టెక్నోక్రాట్స్ ఉర్రూతలూగారు. ఇద్దరు గాయకులు పాటలు పాడుతున్నంత సేపు స్టేడియంలో పూనకాలు లోడయ్యాయి. చరణ్, శిరీష వారి తాజా హిట్లలోని కొన్ని పాటలను పాడి వసంతోత్సవంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆద్యంతం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ - జ్యోష్నారాణి సుబుద్ధి దంపతులు పాలుపంచుకున్నారు.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు ఇవే..

రెండోరోజైన శనివారం.. సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్ క్విజ్, హంగ్ గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలు జరగనున్నాయి.

శ్రీహరిని కలిసిన కార్పొరేటర్లు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 5 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. కావ్యకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికరెడ్డి, సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జన్ను శిభిరాణి అనిల్, ఈదురు అరుణ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సులమొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ వొకేషనల్ తదితర కోర్సుల ఫలితాలను వెల్లడించారు. మొదటి సెమిస్టర్‌లో 24.41 శాతం ఉత్తీర్ణత సాధించగా, మూడో సెమిస్టర్‌లో 30 శాతం, ఐదో సెమిస్టర్‌లో 44.45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ https://kakatiya.ac.in సంప్రదించాలని కోరారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి చాడ రాధికారెడ్డి, క్యాంపు ఆఫీసర్ ఆసీం ఇక్బాల్, నాయకపు.సమ్మయ్య పాల్గొన్నారు.

ఆత్మీయతతో వైద్య సేవలు అందించాలి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 5 : రోగులకు ఆత్మీయతతో వైద్య సేవలు అందించాలని డాక్టర్ శ్రీలక్ష్మీ తెలిపారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ రిహాబ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేషెంట్లకు సమయానికి ఆహారం అందించడమే కాకుండా మందులను సైతం అందించాలన్నారు. ఆత్మీయ రిహాబ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సెంటర్‌ను సేవా దృక్పథంలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ కిశోర్, డాక్టర్ రంగనాథ్‌శర్మ, నాగానంద్, భాస్కర్, అటల్ తదితరులు పాల్గొన్నారు.



రిహాబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీ

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

ఆయన సేవలను కొనియాడిన వక్తలు





డీసీసీ భవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కడియం శ్రీహరి నివాసంలో జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో శ్రీహరి, డాక్టరు కావ్య, కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 : పీడిత ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 1935లో అఖిల భారతీయ అణగారిన ప్రజల సంస్థను ఏర్పాటు చేసి సమాన హక్కుల కోసం పోరాడిన మహా నాయకుడన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్డీ ఇంచార్జీ డైరెక్టర్ బి.అశోక్‌కుమార్, ఫైనాన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్, సీజీఎంలు టి. మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, ప్రభాకర్, అశోక్, కె.ఎన్.గుట్ట, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ రమేశ్, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, జీయంలు అన్నపూర్ణ, బీకంసింగ్, దేవేందర్, వేణుబాబు, మాధవ్‌రావు, సత్యనారాయణ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

- వరంగల్ ఎడ్యుకేషన్ : బాబు జగ్జీవన్‌రావ్ జయంతిని పురస్కరించుకొని నిట్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు. కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో జరుగుతున్న టెన్త్ స్పాట్ క్యాంపులో పీఆర్టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, టీయూ టీఎఫ్, డీటీఎఫ్, జీటీఏ, టీపీయూఎస్, టీఎఫ్‌టీయూ తదితర సంఘాల నేతృత్వంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- కేయూ క్యాంపస్ : కేయూ దూరవిద్య కేంద్రం వద్ద బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆల్ ఇండియా వర్సిటీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎస్డీఎల్‌సీఈ పీఆర్‌ఓ డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, బొక్క మొగిలి, నమిండ్ల కిరణ్‌కుమార్, మంద శ్యాం, బుచ్చయ్య శోభన్‌కుమార్ తదితరులున్నారు. మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ కేయూ ఇన్‌చార్జి ఒడ్డెపల్లి మధు నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద కుమార్, బొడ్డు దయాకర్, ప్రొఫెసర్‌ఎల్‌పీ రాజ్‌కుమార్, పుల్లా శ్రీనివాస్, మాదాసి కనుకయ్య, డాక్టర్ సత్యజుల, మంద వీరాస్వామి, కుమార్, అరిస్టాటిల్, పవన్ పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

- పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంగాని మల్లేశ్వర్, రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాస్ నాయకులు సత్యం, వంగాల సుధాకర్, బొట్ల మనోహర్, అరూరి రంజిత్ పాల్గొన్నారు.
- హనుమకొండ చౌరస్తా : గ్రేటర్ వరంగల్ 4వ డివిజన్ పెద్దమ్మగడ్డలో హిందువాహిణి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందు వాహిణి బాధ్యులు మార్క సునిల్ మాట్లాడారు. హిందువాహిణి బాధ్యులు చిలుకమారి సంజీవ్, మోహన్‌రావు, సుధన్, సురేందర్, శోభన్, రజినికుమార్, హనుమకొండ ప్రణయ్‌రాజ్ పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా ఆధ్వర్యంలో పెద్దమ్మ గడ్డలోని జగ్జీవన్‌రామ్‌విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- హనుమకొండ సిటీ : హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం జరిగింది. టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అజీజ్‌ఖాన్, టీ అశోక్‌రావు, బొమ్మతి విక్రమ్, బంక సంపత్ యాదవ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్ చీకటి శారదా ఆనంద్, మానస రాంప్రసాద్, మామిండ్ల రాజు, గుంటి కుమారస్వామి పాల్గొన్నారు. హనుమకొండలోని స్టేషన్ ఘన్‌పూర్ కడియం శ్రీహరి నివాసంలో జగ్జీవన్ రామ్ జయంతి జరిగింది. శ్రీహరితో పాటు వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి కావ్య జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వరంగల్ క్రైం : జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శుక్రవారం కమిషనరేట్‌లో నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కృషి చేసి మహనీయుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. డీసీపీలు అబ్దుల్ బారి, రవిందర్, జనగామ ఎఎస్పీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్ పాల్గొన్నారు.
- రాంనగర్ : బాబు జగ్జీవన్ రామ్ బహుజనులకు గొప్ప స్ఫూర్తి ప్రధాత అని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతలు నర్సింగ్, లక్ష్మీనారాయణ, యాదగిరి, జనార్ధన్‌గౌడ్, రజనీకాంత్ పాల్గొన్నారు.
- కాజీపేట టౌన్ : కాజీపేట 61వ డివిజన్‌లోని బాబు క్యాంపులో భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను కాజీపేట మండలం సీపీఎం పార్టీ నాయకులునిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు జంపాల రమేష్, తొట్టె మల్లేశం, సాంబయ్య, శంకర్ పాల్గొన్నారు.
- వరంగల్ కార్పొరేషన్ : సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి బల్దియా డిప్యూటీ కమిషనర్ రవీందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌లు హాజరై సంయుక్తంగా మాట్లాడారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు ఈ వేడుకలు జరుపుతున్నామన్నారు. జగ్జీవన్ రామ్ రాష్ట్ర కేబినేట్‌లో తొలి కార్మిక మంత్రిగా అత్యుత్తమ సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో రమేష్, టీపీఆర్‌వో రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, సూపరింటెండెంట్‌లు బాకం సంతోష్, చీకటి ఆనంద్, జేఏస్ నాయకులు గౌరిశంకర్, గోల్కొండ శ్రీనివాస్, నాయకులు రాజారపు భాస్కర్, బొట్ల రమేష్, పాశం రవి యాదవ్, మాదసి సాంబయ్య, శ్యాంరావు, అనీల్‌లు పాల్గొన్నారు.

రైతులను గోసపెడుతున్న ప్రభుత్వం

- అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు కాంగ్రెస్ తూట్లు
- వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్
- సాగునీరందక పంటనష్టపోయిన కర్షకులకు పరిహారం ఇవ్వాలి
- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 : రైతుల్లో ఆశలు రేకెత్తించి, గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారిని పట్టించుకోకుండా అరిగోస పెడుతోందని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ధ్వజమెత్తారు. కర్షకుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా శుక్వారం హంటర్‌రోడ్డులోని వరంగల్ బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన శుక్రవారం రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సాగునీరు అందక ఎండిపోయిన పంటలే రేవంత్‌రెడ్డి పరిపాలనకు సజీవ సాక్ష్యాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరికి బోనస్ కల్పిస్తామని, రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా ద్వారా రైతు కూలీలకు 12,000 ఇస్తామని వాగ్ధానాలు ఇచ్చి, అధికారం చేజిక్కుంచుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అమాయక రైతుల ఉసురు తీస్తోందన్నారు. రుణమాఫీ పేరుచెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి అప్పుకట్టలేదని బ్యాంక్ అధికారులతో రైతులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణ ఇవ్వడానికి వందలాది మంది ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్.. ఇప్పుడో అన్నంపెట్టే రైతుల ఉసురు తీసుకుంటుందన్నారు. వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతు కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే అదే రైతులతో అసెంబ్లీని ముట్టడిస్తామని ఆరూరి హెచ్చరించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షరాలు రావు పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో సాగునీరు వదలకపోవడంతోనే పంటలు ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు 25,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వని పక్షంలో కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి విజయ రామారావు, పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్, రాష్ట్రనాయకులు మార్తినేని ధర్మారావు, జి.శివకుమార్, సత్యనారాయణరావు, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, జిల్లా నాయకులు సంతోష్‌రెడ్డి, జయంత్‌లాల్, కార్పొరేటర్లు అభినవ్‌భాస్కర్, జి.వసంత, ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యాన్ని విస్తృతం చేయండి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 5 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రజలందరికి ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శుక్రవారం వరంగల్‌లోని ఓ లాడ్జీలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భాగ్యలక్ష్మి హాజరై మాట్లాడారు. సీడీపీవో విశ్వజ, డిఎస్‌వీవో సత్యవాణి, నియోజకవర్గ నోడల్ అధికారి కోళ రాజేశ్ గౌడ్, నవ తెలంగాణ వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్డీ అజీం, సినీయర్ సిటిజన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, మల్లారెడ్డి, సంజీవరావు, దివ్యాంగుల సంఘం జిల్లా నాయకులు రాజేందర్, చక్కపాణి పాల్గొన్నారు.

నయీంనగర్‌లో కొత్త బ్రిడ్జిని మూడు నెలల్లో పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, ఏప్రిల్ 5 : నయీంనగర్ కొత్తబ్రిడ్జిని మూడునెలల్లో పూర్తి చేస్తామని, అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండ నయీంనగర్ నాలా పాతవంతెనను కూల్చివేసే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కూల్చివేస్తున్న పాతబ్రిడ్జి స్థానంలో రూ.150కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేస్తున్నామన్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నయీంనగర్ ప్రజల కల సాకారమైందని, కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సమీప ప్రజలు వరద ముంపు భయం నుంచి బయటపడతారన్నారు. నాలాలు ఆక్రమణకు గురికావడంతో వర్షాకాలంలో వచ్చిన వరద బీభత్సవంతో రెండు పర్యాయాలు హనుమకొండ నగరం మునిగిపోయిందని, దంతో ప్రజలు ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుపర్యాయాలు అధికారంలో ఉండి కూడా నయీంనగర్ వంతెనకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వర్షాకాలంలో వచ్చే వరదలతో ఇక్కడి ప్రజలు పడే ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా కొత్తబ్రిడ్జి నిర్మాణానికి నిధులను కేటాయించారన్నారు. వర్షాకాలం రాకముందే పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పాతవంతెన కూల్చివేత పనులు మొదలు కావడంతో నయీంనగర్ మెయిన్ రోడ్డులో వాహన రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు చాడ స్వాతి-శ్రీనివాస్‌రెడ్డి, వేముల శ్రీనివాస్, చీకటి శారదా-ఆనంద్, మానస-రాంప్రసాద్, మామిండ్ల రాజు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు వీరగంటి రవీందర్, తాడిశెట్టి విద్యాసాగర్, నాయకులు బంక సంపత్, నాయిని లక్ష్మారెడ్డి, నల్ల సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి



రాకేష్ (ఫైల్)

హసన్‌పర్తి, ఏప్రిల్ 5 : మండలంలోని అనంతసాగర్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఇన్స్‌పెక్టర్ జవ్వాజి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ మండలం ఆరెపల్లికి చెందిన యాద రాకేష్ (24) డిగ్రీ పూర్తిచేసి తన తాత బుర్రి చేరాలు దగ్గరనే ఉంటున్నాడు. రఘునాథపల్లికి చెందిన మరో విద్యార్థి బాలుగు కౌశిక్, తన మిత్రుడైన రాకేష్ ఇంటికి గురువారం వచ్చాడు. వీరిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై ఎల్కతుర్తిలో రాకేష్ బంధువుల పెళ్లికి హాజరై.. శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో ఆరెపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో అనంతసాగర్ వద్ద గల కోళ్ల ఫారం దగ్గరకు రాగానే గుర్తు తెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. దీంతో వీరిద్దరూ దూరంగా ఎగిరిపడడంతో రాకేష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన కౌశిక్‌కు స్థానికుల సమాచారంతో 108 ద్వారా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించి చికిత్స నందిస్తున్నారు. మృతుని తాత బుర్రి చేరాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కమలాపూర్ (ఎల్కతుర్తి), ఏప్రిల్ 5 : కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభించినట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి శుక్రవారం తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని రైల్లో నుంచి పడివ్యక్తి మృతి చెందిఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి ఒంటిపై ఉన్న తెలుపురంగు చొక్కపై బ్రౌన్ గీతల డిజైన్ ఉందని, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. చొక్కపై హనుమకొండలోని కచిన్ టైలర్ లేబుల్ ఉందన్నారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని, మృత దేహాన్ని జమ్మికుంట గవర్నమెంట్ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 99493 04574, 87126 58604 ను సంప్రదించాలన్నారు.

మద్యం పట్టివేత

వేలేరు (ధర్మసాగర్) ఏప్రిల్ 5: వేలేరు మండలం పీచరలో మద్యాన్ని పట్టుకున్నట్టు ఎస్సై హరిత శుక్రవారం తెలిపారు. గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వారిని గమనించిన ఓ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడన్నారు. అతడిని పట్టుకుని విచారిండగా గ్రామంలోని బొల్లి రాజు కిరాణం షాపులో మద్యం ఉన్నట్టుగా తెలిపడంతో.. షాపులో తనిఖీ చేసి సుమారు తొవిృది వేల రూపాయల విలువ గల మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్య ద్వారానే సమాజ పురోగతి

డాక్టర్ బన్న అయిలయ్య

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్య సమాజంలో మార్పును తీసుకురావడమే కాకుండా సమాజం పురోగతికి గొప్పగా దోహదపడుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బన్నా అయిలయ్య అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ ప్రాథమిక పాఠశాలలో విద్య ఫౌండేషన్ పదవ వార్షికోత్సవం, ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కవి బిల్ల మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధికారి మధురిమ, సీనియర్ సిటిజన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు, రచయిత్రి గురజాడ శోభ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, ఫౌండేషన్ సలహాదారులు పొట్లపల్లి శ్రీనివాసరావు, గురిజాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి కలకోట్ల నరేందర్, డాక్టర్ అనితారెడ్డి, శరపంజరం మూవీ డైరెక్టర్, హీరో గట్టు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల మహేందర్-సరిత దంపతులు పెళ్లిరోజు సందర్భంగా వారి శరీరదానానికి సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అందచేశారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

తెలంగాణ ప్రజాఫ్రంట్ హనుమకొండ జిల్లా కన్వీనర్ రమాదేవి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 5: ఫాసిజానికి వ్యతిరేఖంగా పోరాడుదామని తెలంగాణ ప్రజాఫ్రంట్ హనుమకొండ జిల్లా కన్వీనర్ బి. రమాదేవి అన్నారు. హనుమకొండలోని తెలంగాణ ప్రజాఫ్రంట్ కార్యాలయంలో శుక్రవారం ఫాసిజాన్ని వ్యతిరేకిద్దాం... ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై జరుపుతున్న అమానుష హత్యాకాండను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ వరంగల్ జిల్లా కన్వీనర్ జనగాం కుమారస్వామి, విరసం బాధ్యులు కుమారస్వామి, రైతు సంఘం నేత యాదగిరి, బీఎస్‌ఐ బాధ్యుడు కొమ్ముల సురేందర్, సీఎంఎస్ నుండి కళ, న్యూడెమోక్రసీ బాధ్యులు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాటం చేసేది సీపీఐ పార్టీ

సీపీఐ రాష్ట్ర నాయకుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

వేలేరు (ధర్మసాగర్) ఏప్రిల్ 5: పేదల కోసం, పేదల హక్కుల కోసం పోరాటం చేసే పార్టీ సీపీఐ అని రాష్ట్ర నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఇతర పార్టీల నాయకులకు ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని, సీపీఐ పార్టీ మాత్రం నిరంతరం ప్రజలతోనే ఉంటుందన్నారు. ఇండ్ల స్థలాల కోసం పేదల కోసం వేలాది మందిని సమీకరించి పోరాటం చేసిన చరిత్ర సీపీఐ దని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థినే గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

మరో నాలుగు నెమళ్లు మృత్యువాత

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మడికొండ, ఏప్రిల్ 5 : కాజీపేట మండలం కొత్తపల్లి (హవేలి) శివారులోని రామప్ప గుట్ట సమీపంలో బుధవారం ఏడు నెమళ్లు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. కాగా, అదే ప్రదేశానికి కొంత దూరంలో మరో నాలుగు నెమళ్లు మృతి చెం ది ఉన్న విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ డిప్యూటీ రేంజర్ ఎదులాపురం శ్రీనివాసన్‌ను తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా నాలుగు నెమళ్లు మృతి చెంది ఉన్నాయన్నారు. ఈ నెమళ్లు కూడా బుధవారమే చనిపోయి ఉండవచ్చని తెలిపారు. నెమళ్ల కళేబరాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి వాటి ఆర్గాన్స్‌ను రీజినల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ రిపోర్టు అందిన తర్వాత నెమళ్ల మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉందని డిప్యూటీ రేంజర్ పేర్కొన్నారు.

పట్టభద్రుల తుది ఓటరు జాబితా అందజేత

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 5: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు శుక్రవారం అందజేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఏనుమాముల మార్కెట్ యార్డు గోడౌన్‌లో ర్యాండమైజేషన్ పూర్తిచేసిన ఈవీఎంల కేటాయింపు సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తుది ఓటర్ జాబితాను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, ఉప తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్ కుమార్, రాజేష్, లక్ష్మణ్, బాబురావు, భిక్షపతి పాల్గొన్నారు.

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఈనెల 7న (ఆదివారం) పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశా ల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10 తరగతుల్లో ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని మూడు మోడల్ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 : విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డిఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ ఫేజ్-1, 2, ఆర్టీసీ కాలనీ ఫేజ్-1, 2, మైత్రినగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా జరగదన్నారు.

వరంగల్ ఎంపీ టికెట్ వంగపల్లికి ఇవ్వాలి

రాంనగర్, ఏప్రిల్ 5 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎస్) రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షులు ఇల్లందుల రాజేష్‌ఖన్నా హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు దాస్యం వినయభాస్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం హనుమకొండలో వినయభాస్కర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన శ్రీనివాస్‌కు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి తొలి అరెస్టును ఎదుర్కొన్నాడని, మాదిగ రిజర్వేషన్‌ల కోసం వీరోచితంగా పోరాటం చేసారని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలిచారని ఆయన తెలిపారు. అందరికి సుపరిచితుడైన శ్రీనివాస్‌కు అవకాశం కల్పిచాలని వినయభాస్కర్‌ను కోరారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మడికొండ, ఏప్రిల్ 5 : మడికొండలో వాల్మీకి మహర్షి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. అలాగే ఆత్మవిశ్వాసం అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బోగి సురేష్, శ్రీకాంత్, నర్ర భాను, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దువ్వ విజయ్, నాయకులు నీలం వేణు, జిట్ట చంటి, పెనుకుల వినయ్, సామ్యేల్, విష్ణు, గౌతమ్, కిరణ్, వినీత్, లడ్డుక్రాంతి పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చెక్ పోస్టులు ఎత్తివేత

వరంగల్ క్రైం, ఏప్రిల్ 5 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల ఎత్తివేశారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు నిఘా పెట్టారు. కాగా, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ప్రస్తుతం వాటి అవసరంలేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం చెక్ పోస్టుల ఎత్తివేసారు. నోటిఫికేషన్ జారీ అయ్యాక చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు.

వాహనాల తనిఖీలో లక్షా88వేలు స్వాధీనం

వరంగల్ క్రై, ఏప్రిల్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సుబేదారి పోలీసులు వాహనాలు తనిఖీ చేసే క్రమంలో ఆధారాలు చూపని రూ.లక్షా 88వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హంటర్‌రోడ్డులోని సీఎస్‌ఆర్ గార్డెన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సీహెచ్.యాదవరెడ్డి అనే వ్యక్తితన వాహనంలో రూ.1లక్ష 88వేలు తీసుకువెలుతున్నాడు. ఈ మొత్తానికి ఆదారాలు చూపకపోవడంతో సీజ్ చేసిన సుబేదారి పోలీసులు ఎన్నికల అధికారికి అప్పగించారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధృవీకరించారు.

బెల్టు షాపులపై దాడి.. రూ.17వేల అక్రమ మద్యం స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్5 : టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం బెల్టుషాపులపై దాడులు చేశారు. అక్రమ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎల్కతుర్తి మండలం బాహుపేటలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కాసగాని రమేశ్ నుంచి రూ.1,0110, హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో వేముల సురేష్ నుంచి రూ.7,480 విలువ కలిగిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు. మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మృత్యువుతో పోరాడి... ఓడింది

- అయిన వారున్నా దిక్కు లేని దానిలా కొట్టుమిట్టాడిన వృద్ధురాలు
- అంత్యక్రియలకూ ముందుకు రాని కుమారులు
- సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఘటన

నేరేడుచర్ల, ఏప్రిల్ 5: అయినవారున్నా ఆ వృద్ధురాలు దిక్కు లేని దానిలా మిగిలింది. మృత్యువుతో పోరాడి చివరికి తనువు చాలించింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌లో శుక్రవారం సాయంత్రం ఈ విషాదం చోటు చేసుకొంది. నేరేడుచర్లకు చెందిన మన్నూరి రామస్వామి, సైదమ్మ(80) దంపతులకు ఇద్దరు కుమారులు. రామస్వామి 30 ఏళ్ల క్రితం మృతి చెందాడు. కుమారులు, మనుమళ్లు సైదమ్మను పట్టించుకోవడం మానేశారు. ఏడాది నుంచి వృద్ధాప్య పింఛనుతో జీవనం సాగిస్తోంది. విద్యానగర్ రామాలయం వద్ద చెట్టు కింద నివాసం ఉండేది. నాలుగు నెలల క్రితం నేరేడుచర్లలోని వృద్ధాశ్రమంలో చేరింది. ఇటీవల ఆశ్రమ నిర్వాహకురాలు సైదమ్మ ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు తీసుకువెళ్లిన చోటనే వదిలేయాలని చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆశ్రమ నిర్వాహకురాలు గురువారం మధ్యాహ్నం తీసుకువచ్చి రామాలయం వద్ద వదిలివెళ్లింది. రాత్రి సమయంలో సైదమ్మకు స్థానికులు ఇడ్లీ తినిపించారు. శుక్రవారం ఉదయానికల్లా ఆమె ఆరోగ్యం క్షీణించింది. 24 గంటల పాటు చెట్టు కిందనే ఉండి ఎండ తీవ్రతకు తట్టుకోలేని స్థితిలో ఉండడంతో స్థానికులు మధ్యాహ్నం 3 గంటల సమయంలో 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి సైదమ్మను అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అప్పటికే శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడంతో ఆక్సిజన్ పెట్టి హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేర్చిన 15 నిమిషాలకు సైదమ్మ


వృద్ధురాలిని 108లోకి ఎక్కిస్తున్న స్థానిక మహిళలు

మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం ఆమె కుమారులకు తెలియజేయగా హుజూర్‌నగర్‌లోనే మున్సిపాలిటీ వారితో దహనం చేయించాలని కోరారు. తమ వద్ద డబ్బులు లేవని అంత్యక్రియలకు నిరాకరించారు. స్థానికులు తీవ్రంగా మందలించి దహన ఖర్చులకు ఆర్థికసాయం అందిస్తామని చెప్పడంతో శనివారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలి మృతదేహం తీసుకువచ్చి అంత్యక్రియలు చేసేందుకు అంగీకరించారు.

కామన్ అడ్మిషన్లకు ఇదే చివరి ఏడాది

- ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం విద్యాసంస్థల్లో ప్రస్తుతం ఉమ్మడి అడ్మిషన్ విధానం అమలు
- ఇంజనీరింగ్ సీట్లలో ఏపీ విద్యార్థులకు 15% కోటా
- వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే కేటాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో ఇప్పటి వరకు అనుసరిస్తున్న కామన్ అడ్మిషన్ విధానం ఈ ఏడాదితో ముగియనుంది. ప్రస్తుతం తెలంగాణలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏపీ విద్యార్థుల కోసం 15శాతం సీట్లను కేటాయిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ఇది అమల్లో ఉండదు. మొత్తం సీట్లను తెలంగాణ విద్యార్థులకే కేటాయిస్తారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్లను ఉమ్మడిగా నిర్వహిస్తున్నారు. స్థానికేతరులకు 15 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. పదేళ్ల పాటు ఈ వెసులుబాటు ఉంటుందని చట్టంలో పేర్కొన్నారు. ఈ ఏడాదితో చట్టానికి 10 సంవత్సరాలు పూర్తి కానున్నాయి. దీంతో, వచ్చే ఏడాది నుంచి ఏ రాష్ట్రానికి చెందిన విద్యా సంస్థల్లో ఆయా రాష్ట్ర విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు.

బీ-కేటగిరి సీట్లు కూడా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే భర్తీ!

ఇంజనీరింగ్ 'బీ' కేటగిరి సీట్ల భర్తీలోనూ మార్పులను తీసుకురావాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి భావిస్తున్నది. ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం.. బీ-కేటగిరి సీట్ల భర్తీని ఆయా కాలేజీల యజమాన్యాలే నిర్వహిస్తున్నాయి. అయితే, వీటిని కూడా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే భర్తీ చేసేలా మార్పులు చేయనున్నారు. కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేసినట్టుగానే బీ కేటగిరి సీట్ల భర్తీకి కూడా అధికారులు ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. తద్వారా ఆయా కాలేజీలు ఇష్టానుసారంగా సీట్లను అమ్ముకునే దందాను నివారించడానికి వీలుంటుంది. పైగా ప్రతిభ గల విద్యార్థులకు మంచి కాలేజీల్లో సీటు లభించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ సీట్ల భర్తీలో ఈ పద్ధతిని పాటిస్తున్నారు.

ఖలిస్థాన్ మాజీ మిలిటెంట్ రత్తన్‌దీప్ సింగ్ హతం

- మోటారు సైకిలుపై వచ్చి కాల్పులు జరిపిన ఇద్దరు వ్యక్తులు



చండీగఢ్, ఏప్రిల్ 5: ఖలిస్థాన్ మాజీ మిలిటెంట్ రత్తన్‌దీప్ సింగ్ (49) ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో హతమయ్యాడు. గురువారం పంజాబ్‌లోని షహీద్ భగత్ సింగ్ నగర్ జిల్లా బాలాచౌర్ సమీపంలోని గర్హీ గ్రామం వద్ద ఉండగా మోటారు సైకిలుపై వచ్చిన ఆ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఛాతీ, పొట్టకు బుల్లెట్లు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అక్కడి ఓ ప్రయివేటు ఆసుపత్రి వద్ద ఓ వ్యక్తిని కలవడానికి మేనల్లుడితో కలిసి కారులో వెళ్లిన ఆయనను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు.

రత్తన్‌దీప్ సింగ్ గతంలో భింద్రన్‌వాలే టైగర్ ఫోర్స్ ఆఫ్ ఖలిస్థాన్ (బీటీఎఫ్‌కే)కు చీఫ్‌గా పనిచేశాడు. హరియాణాలోని కర్నాల్‌కు చెందిన అతడు పాకిస్థాన్ వెళ్లి అక్కడి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించాడు. హుస్సేన్ షేక్ జహీద్ పేరుతో పాసుపోర్టు సంపాదించి ఉగ్రవాద దాడులు చేయడానికి వస్తుండే వాడు. జైలులో పెట్టినా తప్పించుకుని పారిపోయి ఎట్టకేలకు 2014లో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ శివారులో పట్టుబడ్డాడు. 1999లో చండీగఢ్ పాసుపోర్టు కార్యాలయం వద్ద జరిగిన బాంబు పేలుడు, పానిపట్‌లో రైల్వే బ్రిడ్జి వద్ద జరిగిన బాంబు పేలుడు కేసుల్లో ఇతనికి ప్రమేయం ఉంది. 2019లో జైలు శిక్ష పూర్తి చేసుకున్న అతడు కర్నాల్‌లో ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవితం గడుపుతున్నాడు. అతని మీద పెండింగ్ కేసులు ఏవీ లేవు. పోలీసులతో కలిసి అమాయక యువకులను వేధిస్తున్నందువల్లనే కాల్పులు జరిపినట్టు గ్యాంగ్‌స్టర్ గోపి నవన్ సహారియా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు. ఈ పోస్టు నిజానిజాలపై ప్రస్తుత దశలో దర్యాప్తు చేయలేమని జిల్లా ఎస్పీ చెప్పారు.

తుక్కు మాటున నొక్కేశారు!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చెంది 480 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్ర గ్రిడ్‌కు అందించింది. ఇంతటి విలువైన కర్మాగారానికి కాలం చెల్లిందని, కాలుష్యం వెదజల్లుతోందని కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయం మేరకు కూల్చివేతకు 2022లో ఆదేశించారు. దీనికోసం టెండర్లు పిలిచారు. మార్కెట్ ధరల ప్రకారం ప్లాంట్ మెటీరియల్ విలువ రూ.2 వేల కోట్లకు పైనే ఉంటుదని ఇంజనీరింగ్ అధికారుల అంచనా. కానీ, ముంబైకి చెందిన హెచ్‌ఆర్ కంపెనీకి రూ.485 కోట్లకే ప్లాంట్‌ను కట్టబెట్టారు. అప్పటి ప్రభుత్వం, అధికారులు పిలిచిన టెండర్‌లోనే భారీ గోల్‌మాల్ జరిగిందని తెలుస్తోంది. రూ.కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక ప్లాంట్ కూల్చివేత అనంతరం రాగి, తదితర విలువైన సామగ్రిని ముందు, వెనుక భారీ భద్రతతో కంటైనర్‌లో తరలించారు. కూల్చివేత మెటీరియల్‌లో దొరికిన పైప్‌ను పరీక్షకు పంపగా.. అది పంచలోహంతో చేసినదిగా తేలింది. ఇక టన్ను తుక్కును రూ.40 వేలకు అమ్మినట్లు తెలుస్తోంది. టన్ను స్టీల్ ధర నాణ్యత మేరకు రూ.55 వేల నుంచి రూ.70 వేలు పలుకుతోంది. కేటీపీఎస్ ప్లాంట్ తుక్కునే టన్ను రూ.40 వేలకు అమ్మారంటే దాని నాణ్యత స్థాయిని చాటుతోంది. మరోవైపు కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్‌ను 2030 వరకు కూల్చవద్దని కేంద్ర ప్రభుత్వం 2023 జనవరి 20న ఆదేశాలిచ్చింది. ఇలాంటి ఉత్తర్వులు వస్తాయని ఊహించిన జెన్‌కో ఉన్నతాధికారులు రెండ్రోజుల ముందే (2023 జనవరి 18) ప్లాంట్ కూల్చివేత ప్రారంభించారు. టర్బైన్‌లోని కేబుల్స్‌ను కత్తిరించడం దీనిని బలపరుస్తోంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని విద్యుత్తు కార్మికులు, ఇంజనీర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఏసీలూ, ఫర్నీచర్ కూడా తుక్కు కిందనే..

తుక్కు అంటే పనికిరానిది అని భావిస్తాం. కానీ, కేపీపీఎస్‌లో జెన్‌కో అధికారులు మాత్రం ఏసీలు, ఫర్నీచర్‌ను కూడా తుక్కు కిందనే లెక్కగట్టారు. కేటీపీఎస్ 5, 6, 7వ దశకు గానీ, అన్ని కర్మాగారాల లెక్కలు చూసే అకౌంట్స్ కార్యాలయానికి గానీ వాటిని తరలించలేదు. ఓఅండ్ఎంను కూల్చివేయడానికి టెండర్ ఖరారు తర్వాత గుండు సూది కూడా బయటకు రానీయలేదంటే కాంట్రాక్టర్‌తో ఎంతగా కుమ్మక్కయ్యారో తెలుస్తోంది. అయితే, విలువైన ఫర్నీచర్‌ను ముంబై సంస్థ తీసుకొచ్చిన కూలీలకు వంట చెరుకుగా వాడడం గమనార్హం.



మంత్రి దృష్టికి విషయం.. నోట్ ఫైల్ సిద్ధం

కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేతలో హెచ్‌ఆర్ కంపెనీ అక్రమాలపై జెన్‌కో సీఎండీ రజ్వీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆయన ఆరా తీసినట్లు తెలిసింది. తక్షణమే కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేత టెండర్లు, వర్క్ ఆర్డర్, జరిగిన పనులు, తరలించిన తుక్కు, ఇంకా ఉన్న తుక్కుపై ఆరా తీశారు. పూర్తి వివరాలతో నోట్ ఫైల్ తయారు చేసి విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు వివరించేందుకు ఫైల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఫైల్ సిద్ధం చేశారని తెలిసింది.

కేటీపీఎస్‌లో కేజీఎఫ్

అక్కడంతా గోప్యమే.. ప్రాణం పోయినా బయటకు రాదు. మట్టి తొలగించే కూలీలు మొదలు ఇనుము తరలించే కంటైనర్లు, ఎక్స్‌కవేటర్లు, డోజర్లు, పహారా కాసే జవాన్ల వరకు అందరూ ముంబై వారే. కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్‌లో హెచ్‌ఆర్ కంపెనీ సొంత సామ్రాజ్యం ఇది.

ప్లాంట్ ప్రాంతం మొత్తాన్ని ఈ సంస్థ ఆధీనంలోకి తీసుకుంది. కేటీపీఎస్ ఉద్యోగులు, ఎస్పీఎఫ్ జవాన్లను సైతం అనుమతించలేదు. ప్లాంట్ నుంచి ఇటీవల ఓ కూలీ రాగి ముక్కను తీసుకొస్తుండగా హెచ్‌ఆర్ సంస్థ సూపర్‌వైజర్ రాడ్లతో కొట్టాడు. ఆ దెబ్బలకు కూలీ జేబులోని సెల్‌ఫోన్ ముక్కలైంది. ఇక జెన్‌కో సీఈ స్థాయి అధికారి వెళ్లాలన్నా పూర్తి తనిఖీలు తప్పనిసరి. కూల్చివేత పనుల్లో 300 నుంచి 350 మంది కూలీలు పనిచేస్తున్నారు. వారి పరిస్థితి ఏంటి? వేతనాలు, పనిగంటలు, సౌకర్యాల గురించి కనీసం కార్మిక శాఖ అధికారులకూ తెలియదు. దీనిపై కార్మిక సంఘాలు నోరు మెదపడం లేదు. అన్ని సంఘాలకు రాష్ట్ర నాయకత్వం కేటీపీఎస్ నుంచే ఉన్నప్పటికీ.. రూ.వేల కోట్ల దోపిడీ ఆరోపణలపై నిద్ర మత్తు నటిస్తున్నాయి. ప్లాంట్‌ల కూల్చివేతలో దుమ్ము, కాలుష్యంతో పాల్వంచ ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అధిక లోడ్ వాహనాలు ప్రయాణించడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. కాగా, ఓఅండ్ఎం కర్మాగారాన్ని కూల్చివేసి విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. అయినా అక్కడ 12 మంది ఇంజనీర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి జెన్కో యాజమాన్యం వేతనాలు చెల్లిస్తుండడం గమనార్హం.

నిధుల కోసం ఈనెల 20న ప్రత్యేక భేటీ

- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి నిధులు రాబట్టుకునే అంశంపై చర్చించడానికి వీలుగా ఈనెల 20న బోర్డు సమావేశం నిర్వహించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) నిర్ణయించింది. ప్రస్తుతం బోర్డు వద్ద లభ్యత ఉన్న నిధులు ఈనెల(మే1 నాటికి) వేతనాలకే సరిపోతాయి. నిధుల లేమితో కార్యకలాపాలు పూర్తిగా మందగించాయని, రెండు రాష్ట్రాలు అంగీకారం మేరకు నిధులు ఇవ్వాలని బోర్డు కోరుతోంది. మరోవైపు నీటి లెక్కలు తేలాలంటే కచ్చితంగా టెలిమెట్రీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, దీనికోసం తెలుగు రాష్ట్రాలు నిధులు ఇవ్వాలని బోర్డు డిమాండ్ చేస్తోంది. అందులో భాగంగా రెండో దశ టెలిమెట్రీ వ్యవస్థ అమలు కోసం అత్యవసరంగా నిధులు అవసరమని ఇదివరకే ఇరు రాష్ట్రాలకు లేఖ రాసింది. పోతిరెడ్డిపాడు నుంచి శ్రీశైలం కుడి ప్రధాన కాలువ మూడో కిలోమీటరు వద్ద, కేసీ కెనాల్‌తో పాటు నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ, ప్రకాశం బ్యారేజీ వెస్ట్ మెయిన్ కెనాల్, పోలవరం రైట్ కెనాల్ కన్‌ఫ్లూయన్స్ పాలేరు అప్‌స్ట్రీమ్, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఏపీ, తెలంగాణ సరిహద్దు వద్ద టెలిమెట్రీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.6.25 కోట్లతో పరిపాలనపరమైన అనుమతి కూడా ఇచ్చారు. రానున్న నెల నుంచి జీతభత్యాలకు చిల్లి గవ్వ కూడా లేకపోవడం.. బోర్డు కార్యకలాపాలకు నిధుల కొరత వంటి అంశాల నేపథ్యంలో తక్షణమే సింగిల్ ఎజెండాతో సమావేశం నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఈనెల 20న జరిగే సమావేశంలో నిధుల కోసం బోర్డు పట్టుబట్టే అవకాశం ఉంది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోండి: సీపీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం, రానున్న రోజులకు ఆర్డర్లు లేకపోవడంతో 30 వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.వీరయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రూ.270 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి చేనేతలను ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆర్డర్లు లేకపోవడంతో వస్త్ర పరిశ్రమ యజమానులు చేతులెత్తేశారని, పరిశ్రమ స్తంభించడంతో కార్మికులకు పనులు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రచారంలో పాల్గొన్నారంటూ అదనపు పీపీలపై పెట్టిన కేసు కొట్టివేత

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధుల్లో ఉన్న ఇద్దరు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవిత తరఫున ఎన్నికల ప్రచారం చేశారని పేర్కొంటూ నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టేసింది. బోధన్ కోర్టులో అడిషనల్ పీపీలు (టెన్యూర్)గా పనిచేస్తున్న జీ శ్యాంరావు, పీ సమ్మయ్య ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రచారం చేశారనే ఆరోపణలపై వారిని పదవుల్లో నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ విధుల్లో ఉంటూ ఓ పార్టీకి ఎన్నికల ప్రచారం చేశారని పలువురి ఫిర్యాదు మేరకు బోధన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. కేవలం ఎన్నికల్లో ప్రచారం చేశారనే కారణంతో క్రిమినల్ కేసు పెట్టడం చెల్లదని వారు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌లపై పెట్టిన ఐపీసీ 188, ప్రజాప్రాతినిధ్య చట్టం 129 ప్రస్తుత కేసులో పిటిషనర్‌లకు వర్తించవని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల విధుల్లో ఉన్న సంబంధిత ప్రభుత్వ అధికారి ఇలాంటి విషయాలపై ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని తెలిపింది. కానీ ఈ కేసులో ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారని, అది చెల్లదని పేర్కొంది.

2035 నాటికి విద్యార్థుల్లో సగం మంది ఇంజనీర్లే!

- ఇంజనీరింగ్ విద్యకు ప్రాధాన్యమిస్తూ విద్యావిధానంలో మార్పులు
- ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్


ఏఐసీటీఈ చైర్మన్ సీతారామ్‌కు జ్ఞాపికను అందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2035 నాటికి విద్యార్థుల్లో సగం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లుగా బయటకు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ పేర్కొన్నారు. పాఠశాల విద్య పూర్తి చేసుకుంటున్న విద్యార్థుల్లో ప్రస్తుతం 25 శాతం మందే ఇంజనీరింగ్ వైపు ఆసక్తి చూపిస్తున్నారని ఆయన అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూలో "బావి భారతావనికి సాంకేతిక అవకాశాలు" అనే అంశంపై అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) తెలంగాణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సింపోజియంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు ప్రాధాన్యమిస్తూ విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇంజనీరింగ్ విద్యను ప్రాంతీయ భాషలోనే బోధించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, దానివల్ల విద్యార్థులు వారి ఆలోచనను సూటిగా చెప్పగలుగు తారని పేర్కొన్నారు. 2047 నాటికి భారతీయ విద్యార్థులను అత్యంత నైపుణ్యం కలిగిన వారిగా, ఆవిష్కర్తలుగా, వ్యవస్థాపకులుగా, పరిశోధకు లుగా తీర్చిదిద్దడమే ఏఐసీటీఈ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు జాతీయ విద్యా విధానం అమలుతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. వన్ నేషన్ వన్ డేటా ప్రకారం ప్రతివిద్యార్థికి పాఠశాల నుంచి యూనివర్సిటీ విద్య వరకు ప్రత్యేకమైన ఐడీ(అపార్)ని ఇవ్వనున్నట్లు సీతారామ్ చెప్పారు. అనంతరం యూనివర్సిటీ ఆవరణలోని జే-హబ్‌లో ఏఐసీటీఈ నిధులతో ఏర్పాటు చేసిన ఐడియా ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఐడియా ల్యాబ్స్ ఏర్పాటుకు కళాశాలలు ముందుకు వస్తే ఏఐసీటీఈ నుంచి రూ.50 లక్షల ఆర్థిక సాయం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని సీతారామ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.72 లక్షలు టోపీ

- ఆన్‌లైన్ బిజినెస్ యాప్ పేరిట ఉచ్చులోకి
- పెట్టుబడికి రెట్టింపు లాభాలు అంటూ దగా

పటాన్‌చెరు, ఏప్రిల్ 5: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అంటూ ఓ యాప్‌ను ఎర వేశారు. మొదట్లో అందులో పెట్టిన మొత్తానికి రెట్టింపు నగదును వెనక్కి ఇచ్చారు. దీంతో నమ్మకం కుదిరిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భారీగా నగదును పెట్టాడు. అయితే, మోసమే లక్ష్యంగా ఎరవేసిన కేటుగాళ్లు ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.72.9 లక్షలు కుచ్చుటోపీ పెట్టారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపల్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత ఏడాది డిసెంబరు 28న ఓ మెయిల్ వచ్చింది. ఆన్‌లైన్ బిజినెస్ చేస్తే భారీగా లాభాలు వస్తాయన్నది అందులోని సారాంశం. అది నమ్మిన ఆయన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. తొలుత చిన్నమొత్తాల్లో పెట్టుబడి పెట్టిన ఆ ఉద్యోగికి రెట్టింపు లాభాలు వచ్చాయి. ప్రారంభంలో లాభాలు చూసిన ఆయన.. స్నేహితులు, బంధువుల వద్ద అప్పు చేసి మరీ పెట్టుబడి పెట్టారు. సుమారు రూ.72.9 లక్షలు పెట్టుబడిగా పెట్టగా.. లాభాలు కూడా వచ్చినట్లు యాప్ ద్వారా సైబర్ కేటుగాళ్లు నమ్మబలికారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ అంటూ ఏవేవో సాకులు చెబుతూ అకౌంట్‌లో నగదును వేయకుండా మాయమాటలు చెప్పి తప్పించుకోవడం ప్రారంభించారు. కొద్ది రోజులుగా అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో బాధితుడు అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సౌదీ రోడ్డు ప్రమాదంలో మామా అల్లుళ్ల మృతి

- కూతురు, ఆమె పిల్లలకు తీవ్ర గాయాలు
- గుంటూరు నుంచి వచ్చిన మామకు స్వాగతం పలికి ఇంటికి తీసుకెళ్తున్నంతలోనే ఘోరం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియాలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నర్రవాడకు చెందిన ఒక ప్రవాసీ కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. అదే కుటుంబానికి చెందిన మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరారు. మృతులు మామా అల్లుళ్లు కాగా, మామ సెలవుల్లో తన కూతురి వద్ద గడపడానికి ప్రత్యేకించి ఆంధ్రా నుంచి సౌదీలో అడుగిడిన కొద్దిసేపటికే ఈ ఘోరం జరిగింది. నర్రవాడకు చెందిన భవనాసి సత్యబాబు కొన్నాళ్లుగా సౌదీలోని జుబేల్ పారిశ్రామిక నగరంలో పనిచేస్తూ కుటుంబంతో అక్కడే ఉంటున్నారు. గుంటూరు రత్నగిరినగర్‌కు చెందిన సత్యబాబు మామ.. అన్న వెంకట రామరావు తన అల్లుడు, కూతురు కీర్తి, ఇద్దరు మనవళ్లతో గడపడానికి గురువారం హైదరాబాద్ నుంచి బయలుదేరి సౌదీకి విమానంలో వచ్చారు. ఆయనకు ఇక్కడి దమ్మాంలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కూతురు, అల్లుడు, ఇద్దరు మనవలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతా కలిసి కారులో ఆనందంగా జుబేల్‌కు తిరిగి వెళ్తుండగా భారీ వాహనం ఒకటి ఢీకొట్టడంతో మామా అల్లుళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన కీర్తిని, పిల్లలను ఆస్పత్రికి తరలించారు. కాగా, గల్ఫ్‌లో రంజాన్ పండుగ సెలవులు వారం రోజుల వరకు ఉంటాయి, మరో పది, పన్నెండు రోజుల వరకు మృతదేహాలను స్వదేశానికి పంపించడం కుదరదని ఆ కుటుంబానికి సహకరిస్తున్న తెలుగు ప్రవాసీ సంఘం (సాటా) ప్రతినిధులు ముజ్జమ్మిల్ శేఖ్, తారక్, పవన్ తెలిపారు.

కబ్జాల పై చర్యలేవీ?

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు వస్తున్నాయి. వరంగల్‌లో కాకతీయ యూనివర్సిటీని 1976లో ఏర్పాటు చేశారు. అప్పుడు వర్సిటీ కోసం కుమారపల్లిలో 188.28ఎకరాలు, లష్కర్ సింగారంలో 309.20 ఎకరాలు, పలివేల్పుల శివారులో 175.14ఎకరాల చొప్పున 673.12 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే, ప్రధాన రహదారి వెంట మాత్రమే ప్రహరీ నిర్మించారు. వెనుక భాగంలో గోడ లేకపోవటంతో పలివేల్పుల, డబ్బాల ఏరియా, ముచ్చర్ల రోడ్డు వైపు ఉన్న భూముల్లో చాలా వరకు వర్సిటీ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, రౌడీషీటర్లు, పోలీసు అధికారులు దొరికినంత కబ్జాలు చేసుకున్నారు. సర్వే నంబరుకు బై నంబర్లు, వేరే అదనపు నంబర్లు వేసుకుని రికార్డుల్లో మార్పు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 2021లో అప్పటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(డీజీపీఎస్) ద్వారా వర్సిటీ భూములను సర్వే చేయించారు. అయితే 622.2 ఎకరాల భూములే లెక్కలోకి వస్తున్నాయి. సుమారు 51 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించారు.


కేయూ క్యాంపస్‌లోని 229 సర్వే నంబరులో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నట్లుగా చేసిన మార్కింగ్

ఇందులో 229, 234, 412, 413, 414 సర్వే నంబర్లతో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో భూములు కబ్జా అయినట్టు తేలింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.3 కోట్లకుపైగా ధర పలుకుతోంది. రూ.150 కోట్లకు పైగా విలువైన భూములు మాయమయ్యాయి.

అంతా తెలిసినా.. చర్యలు శూన్యం..

వర్సిటీలో కబ్జాల పర్వం కొనసాగుతున్నా.. వర్సిటీ అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. 2021లో డీజీపీఎస్ ద్వారా సర్వే చేసి 622.20ఎకరాల వర్సిటీ భూములు ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. అందులోనూ కొంత మేర భూములు కబ్జాకు గురైనట్లు తేలింది. కేయూ ఉద్యోగి అశోక్‌తో పాటు మరో ఇద్దరు, కొంతమంది పోలీసు అధికారులు, రౌడీషీటర్లు, రాజకీయ నాయకులు కలిసి మొత్తం 19 మంది అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. 2023లో కలెక్టర్ ప్రత్యేక సర్వే చేయించగా ఆ నివేదికలో కూడా కేయూ ఉద్యోగి అశోక్‌తో పాటు మరో ఇద్దరి పేర్లను ప్రస్తావించారు. కేయూ వీసీకి వీరు సన్నిహితంగా ఉండటం వల్లే వారిపై చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలున్నాయి. 214 సర్వే నంబరులోని ఎకరం 36 గుంటల భూమి కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆ భూమిని దక్కించుకునేందుకు వర్సిటీ అధికారులు న్యాయ పోరాటం చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2021 నుంచి వర్సిటీ భూములపై స్పష్టత రావటంతో పాటు కబ్జాదారుల పేర్లు బయటకు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కబ్జాలపై కమిటీ నివేదిక ఎక్కడ..?

భూముల కబ్జాలపై విద్యార్థులు, ప్రొఫెసర్లు ఆందోళనకు దిగడంతో వీసీ టి.రమేశ్ స్పందించి.. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు కన్వీనర్‌గా విచారణ కమిటీని నియమించారు. అయితే అశోక్‌బాబుపైనే కబ్జాల ఆరోపణలు రావటంతో 2022 అక్టోబరులో ప్రొఫెసర్ చంద్రమౌళి కన్వీనర్‌గా మరో కమిటీని నియమించారు. ఈ కమిటీ కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ సర్వే ఆధారంగా 622.2 ఎకరాల్లో భూమి ఎంత కబ్జా అయిందో.. ఎవరెవరు ఎంత భూమిని కబ్జా చేశారో గుర్తించింది. 2023 నవంబరులోనే కేయూ పాలక మండలి చైర్మన్, వీసీ రమేశ్‌బాబుకు నివేదిక ఇచ్చింది. కమిటీ నివేదికలో ఏముందో పాలకమండలిలో పెట్టి చర్చించిన తర్వాత ఆమోదించాల్సి ఉంది. అయితే, ఐదు నెలలైనా స్పందన లేకపోవడంతో.. నివేదికను వీసీ తొక్కి పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టిసారించి కబ్జాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని ప్రొఫెసర్లు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.


పాక్ టెర్రరిస్టులపై రా గురి!

- వారి దేశంలోనే వారిపై స్పాట్..
- 2020 నుంచి 20 మంది హతం
- వెల్లడించిన గార్డియన్ కథనం
- ఆరోపణలను ఖండించిన భారత్



లండన్, ఏప్రిల్ 5: మోదీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశాల్లో ముఖ్యంగా పాకిస్థాన్‌లో భారత వ్యతిరేకులుగా భావిస్తున్న వారిని హతమార్చే కొత్త ధోరణి మొదలైందని బ్రిటన్‌కు చెందిన గార్డియన్ పత్రిక వెల్లడించింది. 2020 నుంచి 2023 వరకు దాదాపు 20 మంది ఈ విధంగా ప్రాణాలు కోల్పోయారని, ఈ హత్యలు భారత గూఢచార సంస్థ 'రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్' (రా) పర్యవేక్షణలో జరిగాయని ఆరోపించింది. ఈ మేరకు భారత్, పాకిస్థాన్ నిఘా, గూఢచార సంస్థల అధికారులతో గార్డియన్ ప్రతినిధి మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలిపింది. రా ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. కాగా, ఇటువంటి అనధికారిక ఆపరేషన్ల గురించి గతంలో రా వర్గాలు స్పందించేవి కావని, కానీ, ఈసారి మాత్రం రా అధికారులు తమ ప్రతినిధితో వివరంగా మాట్లాడటం గమనార్హమని గార్డియన్ పేర్కొంది. ఈ మేరకు ఇద్దరు రా అధికారులను ఉటంకిస్తూ.. 2019లో జరిగిన పుల్వామా దాడి అనంతరం రా వ్యూహం మారిందని, భారత వ్యతిరేక శక్తులు భారత్‌లో దాడికి దిగకముందే వారిని గుర్తించి నిర్మూలించటం అనే కొత్త పంథాను ఎంచుకున్నారని తెలిపింది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్, రష్యా గూఢచార సంస్థ కేజీబీల నుంచి ఈ మేరకు స్ఫూర్తి తీసుకున్నామని, ఇటువంటి ఆపరేషన్లకు ప్రభుత్వంలో అత్యున్నత స్థాయి ఆమోదం తప్పనిసరి అని సదరు అధికారులు చెప్పినట్లు ఈ కథనం వెల్లడించింది. 2018లో సౌదీఅరేబియా ప్రభుత్వ విమర్శకుడు, జర్నలిస్టు జమాల్ ఖషోగ్గీ హత్య కూడా తమను ఆలోచింపజేసిందని ఆ అధికారులు తెలిపారు. 'హత్య జరిగిన కొన్ని నెలల తర్వాత ప్రధాని కార్యాలయంలో రా అత్యున్నతస్థాయి అధికారులు సమావేశమయ్యారు. సౌదీలు ఇటువంటి పని చేసినప్పుడు మనం ఎందుకు చేయకూడదని ఓ అధికారి ప్రశ్నించారు' అని వెల్లడించారు. మరోవైపు, గార్డియన్ ప్రతినిధి పాకిస్థాన్ గూఢచర్య, నిఘా సంస్థలతో కూడా మాట్లాడారు. 2020 నుంచీ తమ దేశంలో ఈ తరహా హత్యలు జరుగుతున్నాయని, 2023లో వీటి సంఖ్య బాగా పెరిగిందని, ఆ ఒక్క ఏడాదిలోనే దాదాపు 15 మంది హత్యకు గురయ్యారని పాక్ వర్గాలు తెలిపాయి. అన్నీ కూడా గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో సంభవించిన మరణాలేనని పేర్కొన్నారు. యూఏఈ కేంద్రంగా రా అధికారులు స్లీపర్ సెల్స్‌ను ఏర్పాటు చేశారని, పాకిస్థాన్‌లోని నిరుపేద యువకులను చేరదీసి పెద్ద ఎత్తున డబ్బులను ఎరజూపి ఈ హత్యలకు పురమాయిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ హత్యల పరంపర ఈ ఏడాది నుంచి నిలిచిపోయింది. కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య, అమెరికాలో మరో ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ హత్యకు కుట్ర నేపథ్యంలో అటు కెనడా, ఇటు అమెరికా ప్రభుత్వాలు భారత్ ప్రమేయంపై బహిరంగంగా ఆరోపణలు చేశాయి. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్‌లో లక్షిత హత్యలు నిలిపివేయాలని ఢిల్లీ నుంచి ఆదేశాలు వచ్చాయని రా అధికారి ఒకరు వెల్లడించినట్లు గార్డియన్ పేర్కొంది. అయితే, ఈ హత్యల్లో తమ ప్రమేయం లేదని, ఇది భారత వ్యతిరేక దుష్ప్రచారమని భారత విదేశాంగశాఖ పేర్కొన్నట్లుగా గార్డియన్ తెలిపింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	41.3	27.5
ఆదిలాబాద్	41.8	24.5
రామగుండం	42.1	25.4
ఖమ్మం	42.0	25.0
నల్లగొండ	41.0	24.8
హైదరాబాద్	40.0	27.0

ఉగ్రవాదులను హతమార్చేందుకు పాకిస్థాన్ వెళ్తాం

- పరారైన వారిని వదలం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ఉగ్రవాదులు సరిహద్దులు దాటి పరారైనా వదలబోమని, పాకిస్థాన్ వెళ్లి వారిని హతమారుస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఇక్కడ ఉగ్రవాద చర్యలు చేపట్టి అక్కడికి వెళ్లి దాక్కుంటామంటే ఊరుకోబోమని అన్నారు. 2020 నుంచి భారత ప్రభుత్వం పాకిస్థాన్ వెళ్లి ఆ భూభాగంలో 20 మంది ఉగ్రవాదులను హత్య చేయించిందంటూ బ్రిటన్ పత్రిక ఒకటి గురువారం కథనాన్ని ప్రచురించిన నేపథ్యంలో ఆయన చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకొంది. బ్రిటన్ పత్రిక కథనంపై స్పందించాలని ఓ న్యూస్ ఛానెల్ అడిగినప్పుడు ఆయన మాట్లాడుతూ ఈ సమాధానం ఇచ్చారు.

మదర్సా బోర్డు లౌకికవాదాన్ని ప్రభావితం చేయదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: యూపీ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్-2004 రాజ్యాంగ విరుద్ధమని, లౌకికవాద సూత్రాన్ని ఉల్లంఘిస్తుందని పేర్కొంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర స్టే విధించింది. మదర్సా విద్యా చట్టం-2004లోని నిబంధనలను అలహాబాద్ హైకోర్టు తప్పుగా అర్థం చేసుకుందని, బోర్డు ఏర్పాటు లౌకికవాదాన్ని ప్రభావితం చేయదని పేర్కొంది. మదర్సా విద్యా చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ప్రస్తుతం మదర్సాల్లో చదువుతున్న విద్యార్థులను సాధారణ విద్యా వ్యవస్థలోకి మార్చాలని గతనెల 22న అలహాబాద్ హైకోర్టు యూపీ ప్రభుత్వాన్ని కోరింది.

ఎల్గార్ పరిషద్ కేసులో షోమా కాంతి సేన్‌కు బెయిల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్గార్ పరిషద్ కేసులో ప్రముఖ మహిళా హక్కుల ఉద్యమకారిణి, ఇంగ్లిష్ సాహిత్య ప్రొఫెసర్ షోమా కాంతి సేన్‌కు శుక్రవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసింది. ఆమెకు మావోయిస్టులతో సంబంధాలున్నాయని, మహారాష్ట్రలోని కోరేగాం-భీమా వద్ద ఎల్గార్ పరిషద్ నిర్వహించిన సభలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆరోపిస్తూ 2018 జూన్‌లో ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఇంతకాల జైలులో ఉన్న ఆమెకు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసియ్ ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. తమకు ఆమె కస్టడీ అవసరం ఇంకాలేదని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది.

పదవీ విరమణ వెంటనే రాజకీయాల్లోకి వద్దు

- మాజీ ఎంపీ హర్షకుమార్ 'పిల్'..స్వీకరణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన వెంటనే మాజీ న్యాయమూర్తులు, ప్రభుత్వోద్యోగులు రాజకీయాల్లోకి ప్రవేశించకుండా కొంతకాలం నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించడానికి శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. పదవీ విరమణ చేసిన వెంటనే రాజకీయాల్లో చేరకుండా కొంతకాలంపాటు 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'ను పాటించాలంటూ 2012లో ఎన్నికల కమిషన్ చేసిన సిఫార్సును ఇంతవరకు అమలుచేయడం లేదని పేర్కొంటూ కాంగ్రెస్ మాజీ ఎంపీ హర్షకుమార్ ఈ పిల్‌ను దాఖలు చేశారు.

బర్త్ రిజిస్టర్‌లో తల్లిదండ్రుల మతం వేర్వేరుగా నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: పిల్లల జననాన్ని రిజిస్టర్ చేసే సమయంలో తల్లిదండ్రుల మతం వివరాలు విడివిడిగా నమోదు చేస్తారు. బర్త్ రిజిస్టర్‌లో ఇంతవరకు 'కుటుంబ మతం' అన్న వివరాన్ని మాత్రమే నమోదు చేస్తుండగా, ఇకపై 'తల్లి మతం', 'తండ్రి మతం' వేర్వేరుగా రాస్తారు. కేంద్ర హోం శాఖ రూపొందించిన మోడల్ రూల్స్‌లో ఈ విషయాన్ని పొందుపరిచింది. ఈ ప్రతిపాదన ప్రకారం 'ఫారం నంబర్-1 బర్త్ రిపోర్ట్'లో 'మతం వివరాలు'అన్న కాలం ఉంటుంది. ఇందులో 'తండ్రి మతం', 'తల్లి మతం' అన్న వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. దత్తత సందర్భాల్లోనూ తల్లిదండ్రుల మతాన్ని విడివిడిగా రాయాల్సి ఉంటుంది.

బీజేపీ కార్యకర్తను విచారించిన ఎన్ఐఏ

- బెంగళూరు పేలుళ్ల కేసులో సాక్షిగా నోటీసులు

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల కేసుకు సంబంధించి శివమొగ్గ జిల్లా తీర్థహళ్లికి చెందిన బీజేపీ కార్యకర్త సాయిప్రసాద్‌ను ఎన్ఐఏ అధికారులు సాక్షిగా పరిగణించారు. సెకెండ్ హ్యాండ్ మొబైళ్ల విక్రయించే సాయిప్రసాద్‌కు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ముజామిల్‌కు అతను మొబైల్ విక్రయించాడు. మరో నిందితుడు ముసావిర్‌కు సిమ్‌కార్డు ఇచ్చాడు. ముసావిర్ ఉపయోగించిన మొబైల్‌ను గుర్తించిన ఎన్ఐఏ అధికారులు, సాయిప్రసాద్‌ను సాక్షిగా పరిగణించారు

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేర్పులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులుచేర్పులు చేశారు. అయోధ్యలో బాబ్రీ కట్టడం కూల్చివేత, గుజరాత్ అల్లర్లు, హిందూత్వ అంశాల్లో సవరణలు చేశారు. ఈ విషయమై ఎన్‌సీఈఆర్‌టీ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. అధికారులు మాత్రం ఇది సాధారణంగా పుస్తకాల నవీకరణలో భాగంగా జరిగే ప్రక్రియేనని పేర్కొన్నారు. ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన పాఠ్యాంశాల ముసాయిదా కమిటీ సిద్ధం చేసిన మార్పులను ఓ డాక్యుమెంట్‌లో వివరించారు. దాని ప్రకారం.. రామజన్మభూమి ఉద్యమాన్ని 'రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల ప్రకారం' అని మార్చారు. గతంలో 11వ తరగతి పాఠ్యపుస్తకంలో చాప్టర్ 8లో సెక్యులరిజం గురించి ప్రస్తావిస్తూ.. "2002లో గుజరాత్‌లోని గోద్రా అల్లర్ల అనంతరం 1000 మందికి పైగా, ముఖ్యంగా ముస్లింలను ఊచకోత కోశారు" అని ఉండేది. ప్రస్తుతం దాన్ని "2002లో గుజరాత్‌లోని గోద్రా అల్లర్ల అనంతరం 1000 మందికిపైగా చనిపోయారు" అని మార్చారు. కశ్మీర్ అంశంపైనా మార్పులు చేశారు.

పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా.. ఈబీసీలకు 10 శాతం

- 25 గ్యారెంటీలతో 5 న్యాయాల అమలు
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేత
- కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ పత్రం' విడుదల



న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే గత పదేళ్ల అన్యాయ కాలాన్ని సరిదిద్దే విధంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మోదీ హయాంలో పదేళ్లుగా కొనసాగుతున్న ఏక వ్యక్తి, ఏక పార్టీ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి, దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం కల్పించడం, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పునరుద్ధరిస్తామని తెలిపింది. ఈ మేరకు సమాజంలోని అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ శుక్రవారం 'న్యాయ పత్రం' పేరుతో 45 పేజీల ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మేనిఫెస్టో కమిటీ చైర్‌పర్సన్ చిదంబరం, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ విలేకరుల సమక్షంలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. 'పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ' కింద 25 గ్యారంటీలను మేనిఫెస్టోలో ప్రకటించింది. 2025 నుంచి చేపట్టే కేంద్రప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు 50% రిజర్వేషన్, 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ, విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనకబడిన అన్ని కులాల వారికి (ఈబీసీలకు) 10% రిజర్వేషన్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ప్రస్తుతం ఉన్న 50% పరిమితిని తొలగించేలా రాజ్యాంగ సవరణ, కులాల వారీగా జనగణన వంటి కీలక హామీలను న్యాయపత్రంలో కాంగ్రెస్ ప్రకటించింది. డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన 25 ఏళ్ల లోపు యువతలో ప్రతీ ఒక్కరికీ ఏడాదిపాటు అప్రెంటిషిప్ (ఉద్యోగ శిక్షణ) హక్కును కల్పించటంతోపాటు ఆ సమయంలో రూ.లక్ష చెల్లిస్తామని కీలక హామీని ఇచ్చింది. రైతులు దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్న పంటలకు కనీస మద్దతు ధరకు (ఎమ్మెస్పీకి) చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించడంతోపాటు వ్యవసాయ వ్యయాల కమిషన్‌ను చట్టబద్ధమైన సంస్థగా ప్రకటిస్తామని తెలిపింది. ఉపాధి హామీ పథకం కింద రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచుతామని వెల్లడించింది. మహాలక్ష్మి పథకం కింద పేద కుటుంబాల మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఏపీకి ప్రత్యేకహోదాను కల్పిస్తామని ప్రకటించింది.

రవీంద్రుడు కలలుగన్న సమాజమా ఇది?

కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో గత పదేళ్ల మోదీ హయాంలో ధ్వంసమైన ప్రజాస్వామిక విలువలను, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను సవివరంగా ప్రస్తావించింది. 2014కు ముందుకంటే మీ జీవితం ఇప్పుడు మెరుగ్గా ఉందా? రవీంద్రుడు కలలు కన్న భయం లేని సమాజంలో జీవిస్తున్నారా? అని దేశ ప్రజానీకాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. గత పదేళ్ల అన్యాయ కాలం నుంచి ప్రజలు విముక్తి పొందేందుకు 2024 సార్వత్రిక ఎన్నికలు ఒక అవకాశమని, మతం, భాష, కులం తదితర అంశాలకు అతీతంగా ఆలోచించి ప్రజలందరి కోసం పనిచేసే ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడేందుకు తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిర్భయంగా జీవించే పరిస్థితులు కల్పిస్తామని.. వాక్‌స్వాతంత్ర్యం, మీడియాకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుందని తెలిపింది.

మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు

- పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు. వ్యవసాయ పరికరాలు, యంత్రాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు. రైల్వే ప్రైవేటీకరణ నిలిపివేత.
- అగ్నివీర్ పథకం రద్దు. ఇంతకుముందులాగా పూర్తికాలం పాటు సైనికుల నియామకం.
- పెద్దనోట్ల రద్దు, పెగాసస్, రాఫెల్, ఎన్నికల బాండ్లు తదితర వివాదాస్పద నిర్ణయాలు, ఒప్పందాలు, అవినీతిపై దర్యాప్తు.
- విద్యాసంస్థల్లో కుల వివక్ష లేకుండా చూసేందుకు రోహిత్ వేముల చట్టం.
- ఏపీకి ప్రత్యేక హోదా. జమ్ము కశ్మీర్‌కు, పుదుచ్చేరిలకు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా.
- రాజస్థాన్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన తరహాలో ఆరోగ్య సంరక్షణకు రూ.25 లక్షల మేర నగదు రహిత బీమా.
- రెగ్యులర్ ప్రభుత్వోద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతి నియామకాల రద్దు.
- ఉన్నత విద్య చదివే, పీహెచ్‌డీ చేసే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ రెట్టింపు. క్రీడల్లో మంచి ఫలితాలు సాధించే 21 ఏళ్ల లోపు విద్యార్థులకు నెలకు రూ.10 వేలు.
- జమిలి ఎన్నికల ప్రతిపాదనను తిరస్కరిస్తాం.
- ఈవీఎంలతో వీవీపాట్ స్లిప్‌ల లెక్కింపు జరిగేలా చర్యలు. ఎంపీ, ఎమ్మెల్యే ఫిరాయిస్తే వెంటనే చట్టసభ సభ్యత్వం రద్దయ్యేలా పదో షెడ్యూలులో సవరణ.
- పోలీసులు, దర్యాప్తు, నిఘా సంస్థలు నిర్దేశిత చట్టాలకు అనుగుణంగా పని చేసేలా చర్యలు. ఆయా సంస్థలు పార్లమెంటు పర్యవేక్షణలో పని చేసేలా విధానపరమైన నిర్ణయం. సమగ్రంగా జైళ్ల సంస్కరణల అమలు.

మాది సైద్ధాంతిక పోరాటం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: త్వరలో జరగబోయే ఎన్నికలు సైద్ధాంతిక శక్తుల మధ్య పోరాటం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వినాశకారులు, వాటిని కాపాడే శక్తుల మధ్య సమరంలో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా మేనిఫెస్టోను తీసుకొచ్చామని తెలిపారు. వ్యాపారవేత్త అదానీకి దేశాన్ని ధారాదత్తం చేసిన ప్రధాని మోదీ.. ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలను అడ్డుపెట్టుకుని రాజకీయార్థిక గుత్తాధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలతో పాటు ఎన్నికల సంఘాన్ని కూడా బీజేపీ నియంత్రిస్తోందని రాహుల్ ఆరోపించారు. "ఇదొక ఫిక్సింగ్ జరిగిన క్రికెట్ మ్యాచ్. సోషల్ మీడియానూ ఫిక్సింగ్ చేశారు" అని వ్యాఖ్యానించారు. 2004లో దేశం వెలిగిపోతోంది అంటూ ఎన్డీఏ ప్రచారం చేసిందని, కానీ యూపీఏ గెలిచిందని.. ఇప్పుడూ అదే ఫలితం పునరావృతం కానుందని రాహుల్ జోస్యం చెప్పారు. ఇండియా కూటమిలో ప్రధాని ఎవరనేది ఎన్నికల తర్వాతే నిర్ణయిస్తామని చెప్పారు. కాగా, ప్రతి ఒక్కరూ తమ పార్టీ మేనిఫెస్టోను పరిశీలనగా చూడాలని ఖర్గే కోరారు. అందులో వారికి భారతదేశం అద్భుత రూపం కనిపిస్తుందని పేర్కొన్నారు.

భారత ఎన్నికల్లో చైనా 'ఏఐ' జోక్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: అమెరికా అధ్యక్ష పదవికి 2016, 2020లో జరిగిన ఎన్నికల్లో.. రష్యా జోక్యం చేసుకుందని, ట్రంప్‌ను అధ్యక్షుడిగా చేసేందుకు ప్రయత్నించిందని ఆరోపణలు వచ్చాయి గుర్తుందా? ఇప్పుడు అదే తరహాలో.. మన దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను కృత్రిమమేధతో (ఏఐ) ప్రభావితం చేయడానికి చైనా జోక్యం చేసుకునే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఓ నివేదికలో హెచ్చరించింది. ఏఐ ద్వారా సృష్టించిన కంటెంట్‌ను.. చైనా సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసే అవకాశ ఉందని పేర్కొంది. అయితే, అలాంటి కంటెంట్ ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని.. అయినప్పటికీ చైనా తన ఈ ప్రయత్నాలను కొనసాగిస్తుందని, భవిష్యత్తులో వాటి ప్రభావం ఉంటుందని అభిప్రాయపడింది. జనవరిలో తైవాన్ అధ్యక్ష ఎన్నికల్లోనూ చైనా ఇలాగే జోక్యం చేసినట్టు అందులో వెల్లడించింది.

అమెరికాలో భూకంపం

న్యూయార్క్, ఏప్రిల్ 5: అమెరికాలోని అత్యంత జనసాంద్రత ఉండే న్యూయార్క్ నగరంలో శుక్రవారం భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత 4.8గా నమోదైంది. దాదాపు 4.2 కోట్ల మంది ప్రజలు భూకంప ప్రభావానికి లోనయ్యారు. అమెరికా తూర్పు తీరంలో గడిచిన వందేళ్లలో ఈ స్థాయిలో భూకంపం సంభవించడం ఇదే తొలిసారి. భూకంపం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లుగా ఎలాంటి సమాచారం రాలేదని ఫైర్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో గాజాలోని చిన్నారులు, మహిళల పరిస్థితులపై భద్రతా మండలి సమావేశాన్ని నిర్వహించారు.. అదే సమయంలో భూ ప్రకంపనలు రావడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

'మెయిన్ కోర్స్' ముందుంది

గత పదేళ్లలో అభివృద్ధిపై ఆకలి మాత్రమే పుట్టించాం

- అవినీతిపై పోరాటం చేస్తే తప్పా
- పదేళ్లలో లక్ష కోట్లు స్వాధీనం
- రాజస్థాన్‌లో మోదీ వ్యాఖ్యలు



జైపూర్, ఏప్రిల్ 5: గడిచిన పదేళ్ల పాలనలో అభివృద్ధిపై ఆకలి మాత్రమే పుట్టించామని, మెయిన్ కోర్స్ ముందుందని ప్రధాని మోదీ తెలిపారు. భారత సైన్యాన్ని అవమానించడం, ప్రజల్లో విభజన తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ పార్టీ విపక్షానికే పరిమితమైందని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లో మూడు రోజుల పాటు పర్యటిస్తున్న ప్రధాని రెండో రోజైన శుక్రవారం చురు జిల్లాలో బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశం నవీన భారతంగా ఆవిర్భవించిందన్నారు. పాకిస్థాన్‌లోని శత్రుస్థావరాలపై విరుచుకుపడడమే దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. "ఈ రోజు శత్రువులకు కూడా తెలుసు.. ఇక్కడున్నది మోదీ అని, ఇది నవీన భారతదేశమని" అని ప్రధాని తెలిపారు. "ఇప్పటి వరకు ఏం జరిగిందనేది పెద్ద విషయం కాదు. ఇప్పటి వరకు ఏం జరిగిందనేది కేవలం ట్రైలర్ మాత్రమే. మోదీ ఇప్పటి వరకు చేసింది కేవలం ఆకలి మాత్రమే పుట్టించింది. మెయిన్ కోర్స్ ఇక ప్రారంభంకానుంది" అని మోదీ వివరించారు. చేయాల్సింది చాలా ఉందని, ఎన్నో కలలు ఉన్నాయని, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాల్సి ఉందని చెప్పారు. "ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా కాలంలో మన పని అయిపోయిందని ప్రపంచం మొత్తం భావించింది. కానీ, మనం భారతీయులం. ప్రపంచంలోనే అతిపెద్ద ఐదో ఆర్థిక వ్యవస్థగా నిలబడ్డాం. ప్రపంచం మొత్తం విపత్తులో మునిగిపోయింది. ఆ సమయంలో నేను కూడా చేతులు ముడుచుకుని కూర్చోవచ్చు. ప్రజలు కూడా దీనిని అంగీకరిస్తారు. కానీ, మోదీ అలా చేయలేదు. కరోనా వ్యాక్సిన్‌ను రూపొందించి.. ప్రజలను కాపాడుకున్నాం. ప్రపంచాన్ని సైతం కాపాడాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "ఇతర పార్టీలు ఘోషణా పత్రాలు(ఎన్నికల హామీలు) మాత్రమే ఇస్తాయి. కానీ, బీజేపీ సంకల్ప పత్రాన్ని తీసుకు వస్తుంది" అని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోపై పరోక్షంగా వ్యాఖ్యానించారు.

అవినీతిని అడ్డుకుంటే తప్పేంటి?

గడిచిన పదేళ్ల కాలంలో ఈడీ ఒక్కటే రూ.లక్ష కోట్లకుపైగా అవినీతి సొమ్మును స్వాధీనం చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. అవినీతిపై ఇలాంటి చర్యలు తీసుకుంటే తప్పేంటని ఆయన ప్రజలను ప్రశ్నించారు. "నాపై విపక్ష పార్టీలు ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా వాటిలో పస లేదు. నేను భయపడేది లేదు" అని మోదీ తేల్చిచెప్పారు.

బీజేపీలో చేరిన సుమలత

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి, మండ్య లోక్‌సభ సభ్యురాలు సుమలత కమలదళంలో చేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక రాష్ట్రం మండ్య నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఆమె విజయం సాధించారు. ఏడాదిగా బీజేపీకి మద్దతు ఇస్తూ వస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్‌ను ఆశించారు. జేడీఎస్‌తో పొత్తు కారణంగా మండ్య టిక్కెట్ లభించలేదు. ఒకానొకదశలో ఆమె మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. రెండు రోజుల క్రితం బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించిన సుమలత, శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. నరేంద్రమోదీని మరోసారి ప్రధానిగా చూసేందుకు శాయశక్తులా పనిచేస్తానని సుమలత ప్రకటించారు. గత ఎన్నికల్లో మాజీ సీఎం కుమార స్వామి తనయుడు నిఖిల్‌ను ఆమె మండ్యలో ఓడించారు.

ఇమామ్‌తో బీజేపీ ఢీ

రాంపూర్‌లో ఆసక్తికరంగా లోక్‌సభ రాజకీయం.. జైలు నుంచే కీలక నేత ఆజంఖాన్ చక్రం

- ఢిల్లీ జామా మసీదు ఇమాంను బరిలో దింపిన ఎస్పీ.. పార్టీలో వర్గ పోరు




రాంపూర్... ఈ పేరు వినగానే రాజకీయ ఆసక్తి ఉన్న తెలుగు వారందరికీ గుర్తొచ్చేపేరు జయప్రద. రెండుసార్లు (2004, 2009) ఆమె ఆ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తరఫున పోటీ చేసి గెలిచి, పార్లమెంటులో అడుగుపెట్టారు. మోదీ ప్రభంజనంలో 2014లో ఆ సీటు బీజేపీ గెలిచినప్పటికీ.. 2019లో మళ్లీ ఎస్పీ తరఫున ఆజంఖాన్ పోటీ చేసి గెలిచారు. అయితే.. విద్వేషపూరిత వ్యాఖ్యల కేసులో ఆయన జైలుపాలయ్యారు! దాంతో, ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ ఢిల్లీ జుమా మసీదు ఇమామ్ మొహిబుల్లా నద్వీని బరిలోకి దించింది. ఆయనతో బీజేపీ సిటింగ్ ఎంపీ ఘన్‌శ్యాం సింగ్ లోధీ ఢీకొంటున్నారు. దీంతో, ఇక్కడ ఆసక్తికర పోరు నెలకొంది. తొలుత కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న రాంపూర్ లోక్‌సభ నియోజక వర్గం కొంత కాలంగా సమాజ్‌వాదీ పార్టీ గుప్పిట్లో ఉంది. అందుకు కారణం ఆ పార్టీ నేత ఆజంఖాన్. ఆ నియోజకవర్గ ప్రాంతమంతా నాలుగు దశాబ్దాలుగా ఆయన కంచుకోట. రాంపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆయన ఏకంగా 10సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. లోక్‌సభ స్థానం నుంచి 2019లో ఒకసారి ఎన్నికయ్యారు. అయితే, ఆ తర్వాత ఆయన జైలుకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ సీటుకు 2022లో జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ తరఫున ఘన్‌శ్యాం లోధీ గెలిచారు. అయినా.. ముస్లింలు అధికంగా ఉండే నియోజకవర్గం కావడంతో ఆజం ఖాన్ పట్టు అలాగే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే, ఈసారి ఇక్కడ ఎస్పీ టికెట్ ఎవరికి ఇవ్వాలనే అంశంపై ఆ పార్టీలో సందిగ్ధం నెలకొంది. తన అనుచరులను అక్కణ్నుంచీ రంగంలోకి దింపాలని లేదా స్వయంగా అఖిలేశ్ యాదవే అక్కణ్నుంచీ పోటీ చేయాలని ఆజంఖాన్ ప్రతిపాదించారు. కానీ, అందుకు అఖిలేశ్ ఒప్పుకోలేదు. అయినా ఆజంఖాన్ తన పట్టు వీడకపోవడంతో.. ఆయన ఖైదీగా ఉన్న సీతాపూర్ జైలుకు వెళ్లి మరీ కలిసి దీనిపై చర్చించారు. కానీ, ఆజంఖాన్ అనుచరులకు టికెట్ ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో ఆజంఖాన్ వర్గం ఆయన పేరుతో ఒక లేఖ విడుదల చేసింది. రాంపూర్ నుంచి పోటీ చేయడానికి అఖిలేశ్ తిరస్కరించినందున తాము ఈ ఎన్నికలను బహిష్కరించే ఆలోచనలో ఉన్నట్టు అందులో వెల్లడించింది. అఖిలేశ్ వారిని పట్టించుకోకుండా.. ఢిల్లీలోని సుప్రసిద్ధ జామా మసీదులో ఇమామ్‌గా ఉన్న మొహిబుల్లా నద్వీని రాంపూర్ బరిలోకి దించారు. ఆగమేఘాలపై ఆయన్ను ప్రత్యేక విమానంలో రప్పించి నామినేషన్ వేయించారు. దీంతో ఆజంఖాన్ అనుంగు అనుచరుడు.. ఆయనకు జైలు శిక్ష పడడం వల్ల రాంపూర్ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయిన అసీం రాజా కూడా నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు.. సమాజ్‌వాదీ పార్టీకే చెందిన సీనియర్ నేత అబ్దుల్ సలాం కూడా నామినేషన్ వేశారు.

నామినేషన్ వేసినా..

రాంపూర్ నియోజకవర్గానికి అసీం రాజా, అబ్దుల్ సలాం, మొరాదాబాద్‌కు ఎస్టీ హసన్ వేసిన నామినేషన్లను రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించారు. పార్టీ నుంచి ఏ, బీ ఫారాలు లేనందుకు అసీం, అబ్దుల్ నామినేషన్లను తిరస్కరించగా.. మొరాదాబాద్‌లో తమ అభ్యర్థి రుచి వీరాయేనంటూ సమాజ్‌వాదీ పార్టీ అధికారికంగా జిల్లా అధికారులకు లేఖ రాయడంతో ఏ, బీ ఫారాలున్నా హసన్ నామినేషన్‌ను తిరస్కరించారు. కాగా, ముస్లింల జనాభా ఎక్కువగా ఉండే రాంపూర్ తొలి నుంచీ కాంగ్రెస్ కంచుకోట. 1952 నుంచి 1971 దాకా కాంగ్రెస్ పార్టీ అక్కడ వరుస విజయాలు సాధించింది. 1977లో తొలిసారి అక్కడ కాంగ్రెసేతర నేత.. జనతా పార్టీకి చెందిన రాజేంద్రకుమార్ శర్మ గెలుపొందారు. ఆ తర్వాత 1980 నుంచి 1989 దాకా ఈ నియోజక వర్గం కాంగ్రెస్ చేతిలో ఉంది. 1991, 1998, 2014 ఎన్నికల్లో.. 2022 ఉప ఎన్నికలో బీజేపీ గెలుపొందింది. 2004 నుంచి 2014 దాకా ఈ నియోజకవర్గ ఎంపీగా జయప్రద (సమాజ్‌వాదీ) ఉన్నారు. 2019లో ఆజంఖాన్ గెలిచినా.. ఆయనకు జైలు శిక్ష పడడంతో 2022లో ఉప ఎన్నిక వచ్చింది. అందులో బీజేపీ గెలిచింది. అప్పట్లో 42 వేల ఓట్ల తేడాతోనే బీజేపీ అభ్యర్థి లోధీ గెలిచారు. - సెంట్రల్ డెస్క్

భూగర్భంలో మహాసముద్రం

- భూ ఉపరితలానికి 700 కిలోమీటర్లలో లోతులో అనంత జలరాశి



న్యూయార్క్, ఏప్రిల్ 5: భూమిపైన ఉన్న సప్త సముద్రాల గురించే మనకు తెలుసు! కానీ.. భూమి అడుగున 700 కిలోమీటర్ల లోతులో ఓ మహాసముద్రం ఉందనే విషయం తెలుసా? అమెరికాలోని ఇలినాయ్ రాష్ట్రానికి చెందిన నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞులు ఈ సంచలన విషయాన్ని వెల్లడించారు. భూమి రహస్యాలను తెలుసుకునే పరిశోధనలో భాగంగా వారు అమెరికావ్యాప్తంగా 2000 సెస్మోగ్రాఫ్‌లను (భూకంప తీవ్రతను కొలిచే పరికరాలు) ఏర్పాటు చేశారు. మనకు తెలియకుండా భూమి లోతుల్లో వచ్చే సూక్ష్మ భూప్రకంపనలను ఆ సెస్మోగ్రాఫ్‌లు నమోదు చేశాయి. అయితే.. ఆ భూకంప తరంగాలు భూమిలోని కొన్ని నిర్ణీత ప్రాంతాలకు వచ్చేసరికి వాటి వేగం మందగించడాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించారు. అవి అలా మందగించాయంటే అర్థం ఆ ప్రాంతంలో నీరు ఉందని అర్థం. భూమి పొరలను శాస్త్రజ్ఞులు క్రస్ట్ (భూపటలం), మ్యాంటిల్ (భూప్రావారం), కోర్ (భూకేంద్ర మండలం).. అని మూడు భాగాలుగా విభజించిన సంగతి తెలిసిందే. వాటిలో భూపటలం భూమి ఉపరితలం నుంచి 40 కిలోమీటర్ల దాకా వ్యాపించి ఉంటుంది. అక్కణ్నుంచి కిందికి 2,865 కిలోమీటర్ల దాకా వ్యాపించి ఉండేది మ్యాంటిల్. అదుగో.. ఆ పొరలోనే రింగ్‌వుడైట్ అనే నీలిరంగు రాతిలో ఈ బ్రహ్మాండమైన జలరాశి తొణికిసలాడుతోందని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన జియోఫిజిసిస్ట్ స్టీవెన్ జాకబ్‌సెన్ తెలిపారు. దాని పరిమాణం భూమ్మీద ఉన్న మహాసముద్రాల కన్నా మూడు రెట్లు అని ఆయన వివరించారు. నీరు భూ ఉపరితలంపైనే ఉన్నదని.. అసలు భూమిపైకి నీరు తోకచుక్కల ద్వారానే వచ్చిందని శాస్త్రజ్ఞులు చాలాకాలంగా భావిస్తున్నారు. కానీ, ఈ తాజా పరిశోధన ఫలితం ఆ భావనను మార్చేసింది. భూప్రావారంలోనే నీరు ఉన్నదని.. అది పగుళ్లు, బీటల ద్వారా పైభాగానికి వచ్చి ఉంటుందని జాకబ్‌సెన్ బృందం విశ్లేషించింది.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	మోహిత్ శర్మ (గుజరాత్)
203 పరుగులు	7 వికెట్లు






సాత్విక్ జోడీకి రాష్ట్రపతి అభినందనలు

హైదరాబాద్: అంతర్జాతీయస్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తున్న బ్యాడ్మింటన్ స్టార్లు సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్, ముంబై కుర్రాడైన చిరాగ్ శెట్టి తమ కుటుంబసభ్యులతో కలిసి రాష్ట్రపతిని గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా షట్లర్లను ప్రత్యేకంగా అభినందించిన రాష్ట్రపతి.. వారి కుటుంబసభ్యులతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు.

మరిన్ని మ్యాచ్‌లకు కుల్దీప్ దూరం!

ముంబై: ఢిల్లీ క్యాపిటల్స్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ గజ్జల్లో నొప్పి కారణంగా విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 29 ఏళ్ల కుల్దీప్..రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ తర్వాతి నుంచి ఈ నొప్పితో బాధపడుతున్నాడు. దాంతో తదుపరి రెండు మ్యాచ్‌లకూ యాదవ్ దూరమయ్యాడు. నొప్పి నుంచి కోలుకొని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు కుల్దీప్‌కు చాలా సమయం పట్టేలా ఉందని ఐపీఎల్ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి.

మ్యాచ్‌లకు ఎంత వాడుతున్నారు?

» చిన్నస్వామిలో నీటి సరఫరాపై ఎన్జీటీ దృష్టి

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ప్రస్తుతం తీవ్ర నీటి ఎద్దడి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం నీటి సరఫరాపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) దృష్టి సారించింది. వీటి కోసం ఎంత నీరు వినియోగిస్తున్నారనే విషయం తమకు తెలపాలని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ)తో పాటు సంబంధిత శాఖలను ఆదేశించింది. ఇందుకు మే 2 వరకు గడువు విధించింది. తాము ఆ నోటీసులను చదివామని, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగానే నడుచుకుంటున్నట్టు కేఎస్‌సీఏ సీఈవో సుబేందు ఘోష్ తెలిపాడు. ఇప్పటికే ఇక్కడ మూడు మ్యాచ్‌లు జరగ్గా.. ప్రతీ మ్యాచ్‌కు 75వేల లీటర్ల మంచి నీటిని వాడినట్టు ఆరోపణలు రావడంతో ఎన్జీటీ సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది.

తొలి రౌండ్‌లో అందరికీ డ్రా

క్యాండిడేట్స్ చెస్

టొరొంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో తొలి రౌండ్‌ను భారత ఆటగాళ్లంతా డ్రా చేసుకున్నారు. అలాగే మహిళల కేటగిరీలో పరస్పరం తలపడిన కోనేరు హంపి-వైశాలి కూడా చెరో అర పాయింటుతో సరిపెట్టారు. ఫ్రాన్స్‌కు చెందిన ఫిరౌజా అలీరెజాతో నల్లపావులతో రుయ్ లోపెజ్ ఓపెనింగ్‌తో తలపడిన గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 39 ఎత్తుల్లో డ్రాగా ముగించాడు. ఇక..గుకేష్-విదిత్ గుజ్‌రాతీ మధ్య తొలి రౌండ్ 21 ఎత్తుల్లో ఫలితం తేలకుండా ముగిసింది. మహిళల్లో కోనేరు హంపిని 41 ఎత్తుల్లో వైశాలి నిలువరించింది.

నాడు వద్దనుకున్నోడే.. నేడు కీలకమయ్యాడు!



న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరు 19న జరిగిన ఐపీఎల్ వేలంలో ఛత్తీస్‌గఢ్ క్రికెటర్ శశాంక్ సింగ్‌ను పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసిన సందర్భంలో పెద్ద గందరగోళం ఏర్పడింది. శశాంక్ పేరుతో ఇద్దరు వేలంలో నిలిచారు. శశాంక్‌ను పీబీకేఎస్ సొంతం చేసుకున్నట్టు ఆక్షనీర్ మల్లికా సాగర్ ప్రకటించింది. కానీ తాము కొనుగోలు చేసింది ఈ శశాంక్‌ను కాదని మరో శశాంక్‌నని ఫ్రాంచైజీ యజమానురాలు ప్రీతి జింతా, నెస్ వాడియా..ఆక్షనీర్ మల్లికా సాగర్‌తో వాదించారు. వారి వాదనను మల్లిక తోసిపుచ్చడంతో ప్రీతి, వాడియా నిరాశ చెందినట్టు కనిపించారు. ఇక..అన్‌క్యాప్డ్ ఆటగాడు శశాంక్‌ను తీసుకోవడం అస్సలు ఇష్టం లేదంటూ ఫ్రాంచైజీ ఓనర్లను ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. ఇక సీన్ కట్ చేస్తే..అదే శశాంక్ సింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగి గుజరాత్‌పై పంజాబ్‌కు నమ్మశక్యంకాని విజయం అందించాడు. ఈ నేపథ్యంలో ప్రీతి జింటా శశాంక్‌పై ప్రశంసల జల్లు కురిపించింది. 'శశాంక్ మా జట్టుకు చాలా స్పెషల్. అతని పాజిటివ్ దృక్పథం, అంతులేని ఆత్మవిశ్వాసం ఎంతో నచ్చుతుంది. తనపై వచ్చిన వ్యాఖ్యలను, జోక్‌లను అతడు క్రీడా స్ఫూర్తితో తీసుకున్నాడు' అని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా శశాంక్‌తో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

ఉప్పల్‌లో తగ్గేదేలె..

నేటి మ్యాచ్
రాజస్థాన్ x బెంగళూరు
రా.7.30 నుంచి

రాణించిన బౌలర్లు ● అదరగొట్టిన అభిషేక్, మార్‌క్రమ్ ● చెన్నైపై సన్‌రైజర్స్ విజయం


మార్‌క్రమ్ (36 బంతుల్లో 50)

అభిషేక్ (12 బంతుల్లో 37)

హైదరాబాద్: క్రితం మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఉప్పల్‌లో పరుగుల సునామీ సృష్టించగా.. ఈసారి బౌలర్లు మెరిశారు. సమష్టి రాణింపుతో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ (12 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 37) మెరుపు ఆరంభం ఇవ్వగా.. మధ్య ఓవర్లలో మార్‌క్రమ్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) చెలరేగాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 165 పరుగులు చేసింది. శివమ్ దూబే (24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45), రహానె (30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 35), జడేజా (23 బంతుల్లో 4 ఫోర్లతో 31 నాటౌట్) పర్వాలేదనిపించారు. ఆ తర్వాత ఛేదనలో హైదరాబాద్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 166 పరుగులు చేసి గెలిచింది. ట్రావిస్ హెడ్ (31) రాణించాడు. మొయిన్ అలీకి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

మెరుపు వేగంతో..: ఓ మాదిరి ఛేదన కోసం బరిలోకి దిగిన హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్‌గేర్‌లో తీసుకెళ్లాడు. అటు తమ కీలక పేసర్లు ముస్తాఫిజుర్, పథిరన లేకుండానే బరిలోకి దిగిన చెన్నై బౌలింగ్ బలహీనంగా కనిపించింది. దీంతో పవర్‌ప్లేలో 78 పరుగులతో ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్ ఫలితాన్ని శాసించింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ హెడ్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో మొయిన్ అలీ అందుకోలేకపోయాడు. ఇక రెండో ఓవర్‌లో శివాలెత్తిన అభిషేక్ 4,6,6,6,4తో 27 పరుగులతో అదరగొట్టాడు. అయితే మూడో ఓవర్‌లో అతడిని చాహర్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. హెడ్, మార్‌క్రమ్ పోటాపోటీ బౌండరీలతో కదం తొక్కారు. పవర్‌ప్లే అయ్యాక స్పిన్నర్లు ప్రభావం చూపడంతో పరుగుల వేగం కాస్త తగ్గింది. పదో ఓవర్‌లో హెడ్‌ను జడేజా అవుట్ చేసి రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. 11-15 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాకపోవడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. ఫిఫ్టీ పూర్తి చేసిన మార్‌క్రమ్‌ను, షాబాజ్ (18)ను మొయిన్ అలీ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. ఈ స్థితిలో గెలుపు సమీకరణం 26 బంతుల్లో 25 రన్స్‌కి మారింది. కానీ క్లాసెన్ (10 నాటౌట్), తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ (14 నాటౌట్) చెరో ఫోర్‌తో తేలిక చేశారు. అలాగే 19వ ఓవర్ తొలి బంతికే చక్కటి సిక్సర్‌తో నితీశ్ మ్యాచ్‌ను ముగించాడు.

సీఎస్‌కే తడ'బ్యాటు': టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఆట నిదానంగా సాగింది. క్రితం మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదైన పిచ్ కాకుండా.. ఈ మ్యాచ్ ఇతర పిచ్‌పై సాగింది. ఈ స్లో పిచ్‌పై బ్యాటర్లు పరుగుల కోసం ఇబ్బందిపడ్డారు. శివమ్ దూబే ఒక్కడే స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. తొలి ఓవర్‌నే స్పిన్నర్ అభిషేక్‌తో వేయించగా.. పేసర్ భువనేశ్వర్ ఈసారి లైన్ అండ్ లెంగ్త్ బాల్స్‌తో కట్టడి చేశాడు. దీంతో ఓపెనర్ రచిన్ రవీంద్ర (12) నాలుగో ఓవర్‌లోనే భువీకి చిక్కాడు. అయితే ఐదో ఓవర్‌లో రహానె సిక్సర్.. ఆరో ఓవర్‌లో రుతురాజ్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు స్కోరు 48కి చేరింది. ఇక షాబాజ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు వెళ్లిన రుతురాజ్ లాంగాన్‌లో క్యాచ్ ఇచ్చాడు. శివమ్ దూబే మాత్రం అదే ఓవర్‌లో 6,4తో జోరు చూపాడు. అలాగే స్పిన్నర్ మార్కండే ఓవర్‌లోనూ 4,6తో 15 రన్స్ రాబట్టాడు. కానీ మధ్య ఓవర్లలో పేసర్లు కమిన్స్, ఉనాద్కట్ పరుగులను కట్టడి చేశారు. రహానె హిట్టింగ్ చేయలేకపోయాడు. అటు నటరాజన్‌ను లక్ష్యంగా చేసుకుని దూబే రెండు వరుస సిక్సర్లు బాది 12వ ఓవర్‌లో స్కోరును వంద దాటించాడు. ఈ జోరు ఎక్కువసేపు కొనసాగకుండా దూబేను కమిన్స్ వెనక్కిపంపగా, తర్వాతి ఓవర్‌లోనే రహానెను ఉనాద్కట్ అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక జడేజా-మిచెల్ క్రీజులో ఉన్నా తక్కువ ఎత్తులో వచ్చిన బంతులను ఆడేందుకు వీరు ఇబ్బందిపడ్డారు. దీంతో 14-17 ఓవర్ల మధ్య రెండు ఫోర్లు మాత్రమే వచ్చాయి. 18వ ఓవర్‌లో చెరో ఫోర్‌తో 13 రన్స్ రాగా.. ఇక చివరి రెండు ఓవర్లలోనూ జట్టు పరుగులు రాబట్టలేకపోయింది. ఆఖరి ఓవర్‌లో మూడో బంతికి డారిల్ మిచెల్ (13) వెనుదిరగగా.. ఉప్పల్‌లో అభిమానుల జోష్ మధ్య ధోనీ (1 నాటౌట్) మూడు బంతుల కోసం బరిలోకి దిగాడు. కానీ పేసర్ నటరాజన్ స్లో బంతులకు ధోనీ భారీ షాట్లు ఆడలేకపోయాడు. ఆఖరి బంతిని జడేజా ఫోర్‌గా మలచడంతో ఏడు పరుగులు లభించాయి.

స్కోరుబోర్డు

చెన్నై: రచిన్ (సి) మార్‌క్రమ్ (బి) భువనేశ్వర్ 12, రుతురాజ్ (సి) సమద్ (బి) షాబాజ్ 26, రహానె (సి) మార్కండే (బి) ఉనాద్కట్ 35, దూబే (సి) భువనేశ్వర్ (బి) కమిన్స్ 45, జడేజా (నాటౌట్) 31, మిచెల్ (సి) సమద్ (బి) నటరాజన్ 13, ధోనీ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 165/5; వికెట్ల పతనం:** 1/25, 2/54, 3/119, 4/127, 5/160; **బౌలింగ్:** అభిషేక్ 1-0-7-0, భువనేశ్వర్ 4-0-28-1, నటరాజన్ 4-0-39-1, కమిన్స్ 4-0-29-1, మయాంక్ మార్కండే 2-0-21-0, షాబాజ్ అహ్మద్ 1-0-11-1, ఉనాద్కట్ 4-0-29-1

హైదరాబాద్: హెడ్ (సి) రచిన్ (బి) తీక్షణ 31, అభిషేక్ (సి) జడేజా (బి) దీపక్ 37, మార్‌క్రమ్ (ఎల్బీ) మొయిన్ 50, షాబాజ్ (ఎల్బీ) మొయిన్ 18, క్లాసెన్ (నాటౌట్) 10, నితీశ్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.1 ఓవర్లలో 166/4; వికెట్ల పతనం:** 1/46, 2/106, 3/132, 4/141; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3.1-0-32-1, ముకేశ్ చౌదరి 1-0-27-0, తీక్షణ 4-0-27-1, తుషార్ 2-0-20-0, జడేజా 4-0-30-0, మొయిన్ అలీ 3-0-23-2, రచిన్ 1-0-3-0.


సీఎం రేవంత్ రెడ్డితో సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	3	3	0	0	6	2.518
రాజస్థాన్	3	3	0	0	6	1.249
చెన్నై	4	2	2	0	4	0.517
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	4	2	2	0	4	-0.580
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్


ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా శుక్రవారం గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశాడు.

సెమీస్‌లో బాలాజీ జోడీ

హూస్టన్ (యూఎస్): భారత టెన్నిస్ ఆటగాడు శ్రీరామ్ బాలాజీ ఏటీపీ హూస్టన్ ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. జర్మనీకి చెందిన ఆంద్రీ బెగెమాన్‌తో కలిసి డబుల్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్స్‌లో బాలాజీ జంట 6-0, 6-3తో భారత్‌కే చెందిన అర్జున్/జీవన్ జోడీని చిత్తుచేసింది. ఇక, మొరాకోలో జరిగిన ఏటీపీ మరకెచ్ ఓపెన్ సెమీస్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ/అల్బానో (ఫ్రాన్స్) జోడీ 5-7, 6-3, 7-10తో ఆస్ట్రియా జంట లుకాస్/అలెగ్జాండర్ చేతిలో పోరాడి ఓడింది.

బిజినెస్



బిగ్ సీ ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ ఉగాది పండగ సందర్భంగా వినియోగదారులకు వినూత్న ఆఫర్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉగాది పండగను పురస్కరించుకుని మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్స్ కొనుగోలుపై ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించినట్లు బిగ్ సీ సీఎండీ యం బాలు చౌదరి వెల్లడించారు. ఈ ఉత్పత్తుల కొనుగోలుపై 7.5% వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తో పాటు ఒక ఏడాది మొబైల్ ప్రొటెక్షన్ చెల్లింపుతో రెండో ఏడాది రూ.8,000 వరకు మొబైల్ ప్రొటెక్షన్‌ను అదనంగా పొందవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతిను కూడా అందించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ వాయిదా పద్ధతిలో మొబైల్స్, స్మార్ట్ టీవీ కొనుగోలు చేయవచ్చన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51% వరకు డిస్కౌంట్‌తో పాటు బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసే కొనుగోలుపై రూ.4,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను ప్రకటించటం బిగ్ సీ ఆనవాయితీ అని ఈ సందర్భంగా బాలు చౌదరి తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,980 ▼	64,150 ▼	85,000 ▼
ముంబై	69,882 ▼	64,012 ▼	79,096 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ



హైదరాబాద్	375	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	154	విజయవాడ	150
వరంగల్	154	గుంటూరు	150
కరీంనగర్	154	ఒంగోలు	150
మహబూబ్‌నగర్	154	చిత్తూరు	145
కర్నూలు	154	నెల్లూరు	145
విశాఖపట్నం	129	అనంతపురం	150
గోదావరి	150		

ఏడోసారీ అవే రేట్లు

రెపో రేటు మళ్లీ యథాతథం

2024-25 వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాల్లోనూ మార్పులేదు..

ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ

ముంబై: ఈ నెల 1 నుంచి ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25)లో నిర్వహించిన తొలి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. బ్యాంక్ రుణాలకు ప్రామాణికమైన కీలక వడ్డీ (రెపో) రేటును వరుసగా ఏడోసారీ యథాతథంగా కొనసాగించింది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేట్లు, ఈఎంఐలు మరికొంత కాలం స్థిరంగా కొనసాగనున్నాయి. "స్థూల ఆర్థికాంశాలు, పరిణామాలతో పాటు భవిష్యత్ ముఖచిత్రాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం 6.50 శాతంగా ఉన్న రెపో రేటును యథాతథంగా కొనసాగించాలని మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయించింది. ఎంపీసీలోని ఆరుగురు సభ్యుల్లో ఈ నిర్ణయానికి మద్దతుగా ఐదుగురు ఓటేయగా.. ఒకరు విబేధించారు. ఆర్థిక వృద్ధికి మద్దతిస్తూనే లక్ష్యానికి అనుగుణంగా ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు వడ్డీ రేట్లపై సర్దుబాటు ధోరణిని క్రమంగా ఉపసంహరించుకోవడంపై ఎంపీసీ దృష్టి కొనసాగించనుంద"ని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గతంలో ప్రకటించిన 7 శాతం వృద్ధి రేటు, 4.5 శాతం ద్రవ్యోల్బణం అంచనాలనూ ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించింది. ద్రవ్యల్బణం, వృద్ధికి సంబంధించి దాస్ ఏమన్నారంటే..

➡ ఈసారి సాధారణ వర్షపాతం నమోదుకానుందన్న అంచనాల నేపథ్యంలో ద్రవ్యోల్బణం అంచనాను యథాతథంగా కొనసాగిస్తున్నాం. ఈ మధ్య ప్రభుత్వం వంటగ్యాస్‌తోపాటు పెట్రోల్, డీజిల్ ధరలను స్వల్పంగా తగ్గించడం ధరల సూచీ దిగివచ్చేందుకు దోహదపడనుంది. అయితే, గడిచిన కొన్ని రోజుల్లో అంతర్జాతీయ గణనీయంగా పెరిగిన ముడి చమురు ధరల తీరుతెన్నును నిశితంగా గమనించాల్సి ఉంది.

➡ ఆహార ధరల్లో అస్థిరతలు ముున్ముందు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపనున్నాయి. ఈ ఏప్రిల్-జూన్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే అధికంగా నమోదు కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పప్పు దినుసుల గిరాకీ-సరఫరా పరిస్థితితో పాటు ఈసారి వడగాలులు అధికంగా ఉండనున్న కారణంగా కూరగాయల ఉత్పత్తిని నిశితంగా గమనించాల్సి ఉంది.

➡ వరుసగా నాలుగో ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు 7 శాతం, అంతకు పైగా వృద్ధి నమోదు కానుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో వృద్ధి రేటు 7.6 శాతంగా ఉండనుందని అంచనా.

812 టన్నులకు బంగారం నిల్వలు

విదేశీ మారక (ఫారెక్స్) నిల్వల విస్తరణ వ్యూహంలో భాగంగా బంగారం నిల్వలను పెంచుతున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అధికారిక డేటా ప్రకారం.. ఈ మార్చి నాటికి ఫారెక్స్ నిల్వల్లోని బంగారం విలువ 5,148.7 కోట్ల డాలర్లకు చేరుకుంది. 2023 మార్చి నాటితో పోలిస్తే మరో 628.7 కోట్ల డాలర్ల మేర పెరిగింది. ఈ జనవరిలో ఆర్‌బీఐ 8.7 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గడిచిన రెండేళ్లలో ఇదే అత్యధిక కొనుగోలు. ఈ జనవరి చివరినాటికి ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 812.3 టన్నులకు పెరిగాయి.

ప్రభుత్వ బాండ్ల కొనుగోలుకు మొబైల్ యాప్

రిటైల్ మదుపరులు ప్రభుత్వ సెక్యూరిటీస్(జీ-సెక్) లేదా ప్రభుత్వ బాండ్ల క్రయ, విక్రయాలు జరిపేందుకు వీలుగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. వ్యక్తిగత ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ వద్ద గిల్ట్ అకౌంట్ల నిర్వహణ, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా 2021 నవంబరులో ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను ప్రారంభించింది.



యూపీఐ ద్వారా ఏటీఎంలో నగదు జమ

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చెల్లింపులు మన దైనందిక జీవితంలో భాగంగా మారిపోయాయి. అయితే, మనం చాలావరకు ఏదైనా షాపులో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు జరిపేందుకు లేదా ఎవరికైనా నగదు బదిలీ చేసేందుకు యూపీఐ సేవలను వినియోగించుకుంటున్నాం. గడిచిన కొన్నేళ్లలో యూపీఐ సేవల పరిధి విస్తృతమవుతూ వచ్చింది. ఇప్పుడు చెల్లింపులే కాదు.. యూపీఐ ద్వారా ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇక యూపీఐ యాప్ ద్వారా ఏటీఎం లేదా బ్యాంక్‌ల క్యాష్ డిపాజిట్ మెషీన్ (సీడీఎం)లో నగదు జమ చేసే వసతి కూడా అందుబాటులోకి రాబోతోంది. ప్రస్తుతం డెబిట్ కార్డు ద్వారా మాత్రమే ఏటీఎంలో నగదు డిపాజిట్ చేసే అవకాశం ఉంది. త్వరలో యూపీఐ ద్వారానూ క్యాష్ డిపాజిట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేబోతున్నట్లు ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటనలో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. అంటే, ఏటీఎంలో నగదు చేయడానికి డెబిట్ కార్డు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. యూపీఐ ద్వారా క్యాష్ డిపాజిట్ ప్రక్రియ కూడా నగదు ఉపసంహరణ తరహాలోనే ఉండనుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ వసతికి సంబంధించిన మార్గదర్శకాలను ఆర్‌బీఐ త్వరలోనే విడుదల చేయనుంది.

యూపీఐ సేవల పరిధిని మరింత విస్తృతం చేసేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. డిజిటల్ వాలెట్ వంటి ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్ల (పీపీఐ)ను సైతం థర్డ్ పార్టీ యూపీఐ యాప్‌లతో అనుసంధానించి చెల్లింపులు జరిపే వెసులుబాటు కల్పించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం బ్యాంక్ అకౌంట్ల నుంచి యూపీఐ చెల్లింపులు జరిపేందుకు యూజర్లు తమ బ్యాంక్ అకౌంట్‌ను బ్యాంక్ యూపీఐ యాప్ లేదా పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్‌లతో అనుసంధానించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పీపీఐలకు మాత్రం ఇందుకు అనుమతి లేదు. ప్రస్తుతం పీపీఐ జారీదారు అప్లికేషన్ ద్వారానే యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలుంటుంది. ఇకపై పీపీఐలను ఏదైనా థర్డ్‌పార్టీ యూపీఐ యాప్‌నకు కూడా లింక్ చేసే సౌలభ్యం లభించనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

అవకాశాలు అందిపుచ్చుకోండి

ఐఎస్‌బీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో సెబీ చీఫ్ మాధవి



హైదరాబాద్: నేటి డిజిటల్ ప్రపంచంలో అందివస్తున్న అద్భుత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) విద్యార్థులను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ కోరారు. శుక్రవారం ఐఎస్‌బీ హైదరాబాద్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ), ది ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం), ది ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఈఎఫ్‌పీఎం) కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేటి డిజిటల్ ప్రపంచంలో కాలం వేగంగా మారిపోతుంటే, ప్రపంచం కుదించుకుపోతూ అద్భుత అవకాశాలు కల్పిస్తోందన్నారు. కెరీర్ పరంగా ఉన్న అవకాశాలను జాగ్రత్తగా ఎంచుకోవాలని కోరారు. ఉద్యోగం-వ్యక్తిగత జీవితం మధ్య సమన్వయం పాటిస్తూనే ప్రభుత్వ-కార్పొరేట్ పాత్రలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. జీవిత లక్ష్యాల కోసం పని చేస్తూనే, తమ ఆప్తులతో సంబంధాలు కొనసాగేలా చూసుకోవాలని కోరారు. వ్యక్తిగత ఆసక్తుల కోసమూ కొంత సమయం కేటాయించుకోవాలని ఐఎస్‌బీ విద్యార్థులను కోరారు. వ్యక్తిత్వం, సామర్థ్యాల ఆధారంగా విజయాలు సాధించేందుకు కృషి చేయాలని ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ బోర్డు చైర్‌పర్సన్ హరీశ్ మన్వానీ విద్యార్థులకు సూచించారు.

విద్యుత్ వాహనాల ఫైనాన్స్‌కు కొత్త కంపెనీ ఈవీ ఫిన్

హైదరాబాద్: నాన్ బ్యాంకింగ్ రంగంలోని గ్రీవ్స్ ఫైనాన్స్ లిమిటెడ్ విద్యుత్ వాహనాలకు రుణాలందించేందుకు "ఈవీ ఫిన్" పేరిట ప్రత్యేక విభాగాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. దేశంలో విద్యుత్ వాహన రుణాల కోసం ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు కావడం ఇదే ప్రథమం. ఈ విభాగం కస్టమర్ల ప్రాధాన్యతలు, అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ఫైనాన్సింగ్ సొల్యూషన్లు అందిస్తుందని కంపెనీ ప్రకటించింది. వీటిలో తక్కువ వడ్డీ రేట్లకే రుణాలిచ్చే జిప్.ఫిన్‌తో పాటు స్మార్ట్.ఫిన్, ఎకో.ఫిన్ వంటి వంటి ఇతర సొల్యూషన్లు కూడా ఉన్నాయి.

హైదరాబాద్‌లో మివీ కొత్త ప్లాంట్

హైదరాబాద్: ఆడియో పరికరాల తయారీలో ఉన్న దేశీయ కంపెనీ మివీ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ వద్ద ఏడు ఎకరాల్లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రం కూడా ఉండే ఈ ప్లాంట్ ద్వారా 2,000 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని కంపెనీ సహ వ్యవస్థాపకురాలు, సీఎంఓ దేవభక్తుని మిథుల చెప్పారు. ఈ ప్లాంట్ అభివృద్ధి, విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లలో రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. తాము తయారు చేసే ఇయర్‌ఫోన్లు, సౌండ్‌బార్స్, స్పీకర్లు, గేమింగ్ యాక్సెసరీస్ వంటి ఆడియో పరికరాలకు అవసరమైన బ్యాటరీలు, డ్రైవర్లు, పీసీబీఏల వంటి విడి భాగాల్లో 80 శాతం వరకు ఇదే ప్లాంట్‌లో తయారు చేసుకోనున్నట్లు మిథుల తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం శంషాబాద్‌లో అద్దె భవనాల్లో నడుస్తున్న ప్లాంట్‌తో పాటు 1,000 మందికిపైగా సిబ్బందిని కంపెనీ ఈ కొత్త ప్లాంట్‌కు తరలించనుంది. శుక్రవారం నాడిక్కడ ఈ ప్లాంట్‌కు తెలంగాణ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ శంకుస్థాపన చేశారు.

సెన్సెక్స్ మరింత పైకి

ఊపిరి పోసిన ఆర్‌బీఐ పాలసీ

ముంబై: నూతన ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ద్వైమాసిక పరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును యథాతథంగా కొనసాగించడం ఈక్విటీ మార్కెట్‌కు ఊపిరి పోసింది. ప్రపంచ మార్కెట్లు ప్రతికూలంగా ట్రేడవుతున్నప్పటికీ దేశీయ మార్కెట్ పాజిటివ్‌గా నిలిచింది. సెన్సెక్స్ స్వల్ప లాభంతో మరో కొత్త రికార్డును నెలకొల్పింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 74,361.11 పాయింట్ల గరిష్ఠ స్థాయి, 73,946.92 పాయింట్ల కనిష్ఠ స్థాయి మధ్యన కదలాడి చివరికి 20.59 పాయింట్ల లాభంతో 74,248.22 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 0.95 పాయింట్ల నామమాత్రపు నష్టంతో 22,513.70 వద్ద ముగిసింది.

లాభాల్లో బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ షేర్లు: సెన్సెక్స్ షేర్లలో కోటక్ బ్యాంక్ 2.09 శాతం లాభంతో అగ్రగామిగా నిలిచింది. ఈ షేరు రూ.1785.25 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల్లో ముగియగా బ్యాంక్ ఆఫ్ బరోడా మాత్రం 0.24 శాతం నష్టాలతో క్లోజైంది. బీఎస్ఈ బ్యాంకెక్స్ 451.11 పాయింట్ల లాభంతో 54,590.61 వద్ద ముగిసింది. లాభపడిన ఎన్‌బీఎఫ్‌సీ షేర్లలో ఎస్‌బీఐ కార్డ్ అండ్ పేమెంట్ సర్వీసెస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బజాజ్ ఫిన్‌సర్వ్ ఉన్నాయి. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ 0.14 శాతం లాభపడి రూ.645 వద్ద స్థిరపడింది.

అదేబాటలో రియల్టీ షేర్లు: ఈ విభాగంలో గోద్రెజ్ ప్రాపర్టీస్, మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్స్, మాక్రోటెక్ డెవలపర్స్, డీఎల్ఎఫ్, ఒబెరాయ్ రియల్టీ, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లాభపడ్డాయి. బీఎస్ఈ రియల్టీ ఇండెక్స్ 108.24 పాయింట్లు లాభపడి 7,392.99 వద్ద ముగిసింది.

రైతులకు ఎక్కడ కష్టం వచ్చినా..

గద్ద లెక్క వాలుతా!

సమస్యల పరిష్కారానికి సర్కారు మెడలు వంచుతా..

- ఇది అసమర్థ, అవివేక, అర్థక, చవట ప్రభుత్వం : కేసీఆర్
- కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఎండిన పంటల పరిశీలన


కరీంనగర్ జిల్లా వెదిరలో వరి గొలుసులతో మాజీ సీఎం కేసీఆర్‌కు విన్నవిస్తున్న రైతులు

కరీంనగర్, సిరిసిల్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "ప్రస్తుత ప్రభుత్వ తెలివితక్కువ, అసమర్థ, అవివేక, అర్భక, చవట విధానాల దరిద్రం వల్లనే నాశనానికి వచ్చింది. 2014కు ముందు తెలంగాణలో ఏ గోస, ఏ బాధ, ఏడ్పు పడ్డామో అవి మళ్లీ వచ్చాయి. కాలిపోయిన మోటార్లు, నీళ్ల ట్యాంకర్లు, ఎండిపోయిన పంటలు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, నీళ్ల కోసం ఎదురు చూపుల సీన్లు పునరావృతమయ్యాయి. ఇది ప్రకృతి విపత్తు కాదు. ప్రభుత్వం సృష్టించిన విపత్తు" అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘాటుగా విమర్శించారు. తెలంగాణలో పంటలు ఎండని జిల్లా లేదని, నీళ్ల కరువు లేని ప్రాంతం లేదని, పాత తెలంగాణ మళ్లీ పునరావృతం అయిందని వ్యాఖ్యానించారు. నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని ఇంత ఆగం చేస్తారా అని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇగిలించిన పరిస్థితి ప్రజలది అయిందని అన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్ధుంపూర్, సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రం శివారులో ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. రైతుల నుంచి ఎండిన పంటల వివరాలను తెలుసుకున్నారు. శాభాష్‌పల్లి బ్రిడ్జి నుంచి నీటి మట్టం తగ్గిన మిడ్‌మానేరు ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం సిరిసిల్లలో విలేకరులతో మాట్లాడారు. నీటి నిల్వ సామర్థ్యం తెల్వని లత్కోర్‌లు, చవట దద్దమ్మలు రాజ్యమేలుతున్నారని, కాబట్టే ఈ పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువా!? మనుషులు తెచ్చిన కరువా!? కాంగ్రెస్ తెచ్చిన కరువా!? అని ప్రశ్నించారు. "కేసీఆర్ ఎల్లిండు. ఇక ఆగడు. ఎక్కడ రైతులకు కష్టం వచ్చినా గద్ద లెక్క వాలుతా. సమస్యలు పరిష్కారం అయ్యేలా మెడలు వంచుతా" అని హెచ్చరించారు. ఎండిన పంటకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ఇప్పుడు ఉన్నోళ్లకు కాళేశ్వరం గురించి తోక తెల్వదు. తొండం తెల్వదు. ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని పంప్‌లు ఉన్నాయో వీళ్లకు తెలుసా!? ప్రాజెక్టులో చిన్న చిన్న లోపాలు జరుగుతాయి. వాటిని భూతద్దంలో పెట్టి చూపుతున్నారు. ఇప్పటికీ కాళేశ్వరంలో ఏదో వెంట్రుక దొరుకుతుందనే ఉద్దేశంతో ఉన్నారు. తెలివితక్కువతనంతో 50 టీఎంసీల నీళ్లు వదిలేశారు. కేసీఆర్‌ను బద్‌నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు పోయేలా చేశారు" అని తప్పుబట్టారు. ఈ దద్దమ్మలకు చేతగాకపోతే గోదావరిలో నీళ్లు వచ్చే సమయంలో 50 వేల మంది రైతులతో కలిసి వెళ్లి.. వీళ్లను పండబెట్టి తొక్కి అయినా మేడిగడ్డ నుంచి నీళ్లను పంపుతానని అన్నారు. కరీంనగర్ జిల్లాలో నాలుగు సజీవ ధారలు సృష్టించామని, వాటి ఫలితాలను కరీంనగర్ ప్రజలు అనుభవించారని కేసీఆర్ గుర్తు చేశారు. 15 నుంచి 20 లక్షల ఎకరాల మధ్య పంటలు ఎండిపోయాయమని లెక్కలు చెబుతున్నారని, ఇందుకు నీటి నిల్వ గురించి తెలియకపోవడం ఒక కారణమైతే.. పాత బోర్లతోనైనా పంటను రక్షించుకుందామంటే నాణ్యమైన కరెంట్ లేకపోవడం మరో కారణమని తప్పుబట్టారు. మోటార్లు కాలిపోయి ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండిపోయాయని విమర్శించారు. కొంతమంది మంత్రులు తమను బద్‌నాం చేస్తున్నారని, అది శుద్ధ తప్పని చెప్పారు. తమ హయాంలో 25 జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ కురిసిందని, అక్కడ కూడా ఈ పరిస్థితులు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థత, వైఫల్యం తప్ప వేరే కారణం లేదన్నారు. "నాలుగు మాసాల వరకూ ఏమీ అనలేదు. కొత్త ప్రభుత్వానికి టైం ఇవ్వాలని ఊరుకున్నా. వాళ్లు ఎన్ని పిచ్చి ఆరోపణలు చేసినా.. వాళ్లకు తొత్తులుగా ఉన్న మీడియాతో అడ్డగోలుగా వార్తలు రాయించినా మాట్లాడలేదు. ఎండిన పంటలు చూడడానికి సూర్యాపేట జిల్లాకు పోగానే కాలువలకు నీళ్లు వచ్చాయి. మళ్లీ బస్ పోగానే వాపస్ పోయాయి. కరీంనగర్‌కు వస్తున్నానంటే మొత్తం కూలిపోయిందని చెప్పిన కాళేశ్వరం పంప్‌లను ఆన్ చేసి వరద కాలువకు నీళ్లు వదిలారు. అయినా.. సీఎం సిగ్గు లేకుండా కేసీఆర్ ముందే చెప్పాలని అంటాడు. సీఎం నువ్వా, నేనా!?" అని ఎద్దేవా చేశారు.

బోనస్ ఇవ్వకపోతే కొరికి చంపుతారు

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై కేసీఆర్ నిలదీశారు. బ్యాంకులతో మీటింగ్ పెట్టి రుణ మాఫీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటకు రూ.500 బోనస్ ఇవ్వకుంటే కొరికి చంపుతారని అన్నారు. "అగ్రస్ పాటపాడినట్లే జల్దీ రుణాలు తెచ్చుకోండి. డిసెంబరు 9న మాఫీ చేస్తానని చెప్పి నాలుగు నెలలు అయ్యింది. రైతు బంధు విషయంలో తొండి పెట్టారు. ఇస్తారా లేదా అనే కన్ఫ్యూజన్‌లో పెట్టారు. ఇంకా వంద శాతం ఇవ్వలేదు. దానిమీద ఓ పాలసీ లేదు. ధైర్యం లేదు. వెర్రి, తిర్రి వేషాల కారణంగా వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంది. మిమ్మల్ని వేటాడి, వెంటాడి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేస్తాం" అని స్పష్టం చేశారు. పంటకు బోనస్ ఇవ్వకపోతే వెంటాడతామన్నారు. గొర్రెల పంపిణీ లేదని, దళిత బంధు ఇవ్వడం లేదని తప్పుబట్టారు. కల్యాణ లక్ష్మికి తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పారని, దీనిని ఇవ్వకపోతే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు. వృద్ధాప్య పింఛనును రూ.4000 చొప్పున ఇంట్లో ఇద్దరికి ఇస్తామని చెప్పారని, దాని సంగతి ఏమైందని నిలదీశారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, సిగ్గు లేకుండా మళ్లీ నాలుగు హామీలు ఇచ్చారని, అన్నీ మోసాలేనని మండిపడ్డారు. దళితులు, యాదవులు, మహిళలు, వృద్ధులు, కొత్త రేషన్ కార్డుదారులు, రైతులు.. అన్ని వర్గాలనూ మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో 200 మంది రైతులు చనిపోయారని ఆరోపిస్తే.. 48 గంటల్లో జాబితా ఇమ్మన్నారని, నాలుగు గంటల్లోనే ఇచ్చామని, అయినా ఉలుకూ పలుకూ లేదని తప్పుబట్టారు. ఆయా కుటుంబాలను పరామర్శించాలని, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పాపం తగులుతుందని శపించారు. హైదరాబాద్‌లో రూపాయికి నల్లా ఇచ్చామని, ఇప్పుడు మళ్లీ ఎందుకు ట్యాంకర్ల దందా నడుస్తోందో చెప్పాలని కేసీఆర్ నిలదీశారు. చీము నెత్తురు ఉంటే హైదరాబాద్‌లో ట్యాంకర్లు ఫ్రీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ప్రజలకు తాగునీళ్లు అంటే తమాషాగా ఉందా? బంగారం లాంటి మిషన్ భగీరథ స్కీమ్‌ను ఎందుకు నడపడం లేదు!?" అని ప్రశ్నించారు.

మేడిగడ్డలో పది వేల మంది రైతులతో ధర్నా

మేడిగడ్డలో పది వేల మంది రైతులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపడతామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్ధుంపూర్, సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో ఎండిన పంటలను పరిశీలించారు. రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ వారికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం అందించాలన్నారు. బండి సంపత్ పొలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌కు ఎండిన పంటలను చూపిస్తూ రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. అంతకుముందు, కరీంనగర్ జిల్లా రామగుడు మండలం వెదిర గ్రామంలో వరి గొలుసుతో స్వాగతం పలికిన రైతులతో కేసీఆర్ మాట్లాడారు. పంటల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

నేత కార్మికుల సమస్యలపై రణరంగం చేస్తాం

సిరిసిల్లలో రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాలు వంటి ఆర్డర్లతో చేనేత కార్మికులకు తాము ఉపాధి కల్పించామని, ఇప్పుడు మళ్లీ పాత రోజులే వచ్చాయని కార్మికులు చెబుతున్నారని కేసీఆర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇవ్వాల్సిన రూ.300 కోట్ల బకాయిలు కూడా ఇవ్వడం లేదని చెప్పారని, హైకోర్టుకు వెళ్లయినా బకాయిలు ఇప్పిస్తామని చెప్పారు. "సిరిసిల్లలో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యేట్లు ఉన్నాయని అంటే.. ఓ కాంగ్రెసోడు నిరోధ్‌లు, పాపడ్‌లు అమ్ముకుని బతకమని అన్నాడు. నిరోధ్‌లు అమ్ముకుని బతకాలా కుక్కల కొడుకుల్లారా!? మీరు మనుషులేనా? చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతీస్తారా!? చేనేత కార్మికులను మొన్నటిదాకా దొబ్బితిన్నారు.. దోచుకుతిన్నారని అంటారా దొంగ నా కొడుకుల్లారా" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్రమంతా రణరంగం చేసి ఫుట్‌బాల్ ఆడతామని, విడిచిపెట్టమని హెచ్చరించారు. చేనేత కార్మికులను నీచంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులపై

కేసీఆర్ ప్రేమంతా నటన

మంత్రి పొంగులేటి ధ్వజం



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "పబ్లిక్ మెమొరీ ఈజ్ వెరీ షార్ట్.. అని ఏ మహానుభావుడు అన్నాడో కానీ, అది అక్షరాల నిజం. నిత్య జీవిత సంసారసంకుల సమరంలో పడి మనం చాలా విషయాలు మరిచిపోతాం. అలాగే అధికారంలో నుంచి ప్రతిపక్షంలోకి రాగానే, ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు రైతుల కష్టాలు, నీతులు గుర్తుకొస్తున్నాయి" అని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు ప్రేమికుడిగా పర్యటనలు చేస్తూ, ప్రకటనలతో ఊదరగొడుతున్నారని, ఆయన ప్రకటనలను చూస్తే ఆశ్చర్యం వేస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో అంతా అహంకారం నియంతృత్వం, అవినీతిమయమేనని, ఇప్పుడు ఆయన రైతుల పట్ల చూపిస్తోందంతా నటనేనంటూ ఎద్దేవా చేశారు. తొమ్మిదిన్నర ఏళ్ల అధికారంలో తెలంగాణ ప్రజలతో చెలగాటమాడి, అధికారం కోల్పోగానే, రాత్రికి రాత్రే ప్రజా ప్రేమికుడిగా ఫోజు కొడుతున్న అహంకారవాది కేసీఆర్ అని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చూపడానికి కేసీఆర్ శతవిధాల ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మొన్న నల్లగొండ పర్యటన, ఇప్పుడు కరీంనగర్ పర్యటన ఇందులో భాగమేనని విమర్శించారు. తమ ఉనికిని కాపాడుకోవడానికి కేసీఆర్ రైతులను పావులుగా వాడుకోవడం బాధాకరమని అన్నారు. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ పంట నష్టపోయిన రైతులను ఎన్నడూ పరామర్శించిన పాపాన పోలేదని, నష్ట పరిహారం ఇవ్వాలన్న ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. అకాల వర్షాలతో వరి పంట దెబ్బతిని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయితే పట్టించుకోలేదన్నారు. అధికారం పోగానే, కేసీఆర్‌కు రైతులు గుర్తుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులను పరామర్శించడానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన కేసీఆర్, అదే జిల్లాలో ఆయన నిర్మించిన మహాద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టును కూడా సందర్శించి ఉంటే బాగుండేదని అన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి నా ఈక తెల్వదు తోక తెల్వదు. ఈ ప్రభుత్వానికి వెంట్రుక కూడా తెల్వదు" అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు ఈక, తోక తెలిసిన వ్యక్తి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కుప్పకూలింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనేక తప్పిదాల వల్లనే కరువు ఏర్పడిందని, ఇందులో మా ప్రభుత్వానికి ఏ పాత్రా లేదని మంత్రి స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చే నాటికే వర్షాకాలం ముగిసిందని, టీఆర్‌ఎస్ పాలనలో పూర్తి స్థాయి వర్షపాతం నమోదు కాలేదని, ఫలితంగా ఏర్పడిన కరువును కాంగ్రెస్ వైఫల్యంగా చెప్పడానికి కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వర్ష భావ పరిస్థితుల వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, దాదాపు పదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తికి ఆ మాత్రం తెలియదా? అని ప్రశ్నించారు

కేసీఆర్ ఫ్యామిలీకి 2లక్షల కోట్ల ఆస్తులు

చిట్టా నా దగ్గర ఉంది: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబానికి రూ.2లక్షల కోట్ల ఆస్తులున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఆ ఆస్తుల తాలూకు చిట్టా అంతా తన దగ్గర ఉందని, దాన్ని బయట పెడతానని చెప్పారు. కేసీఆర్ ఫ్యామిలీ ఆస్తులపై క్యాబినెట్‌లో చర్చించి.. తీర్మానం చేసి, సీబీఐతో విచారణ జరిపించి.. అందర్నీ జైలుకు పంపుతామని హెచ్చరించారు. కేసీఆర్ ఓ సన్నాసి అని, ఏజెంట్లను, బ్రోకర్లను నియమించుకుని ధరణి, కాళేశ్వరం పేర్లతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుమార్తె కవితకు దుబాయ్‌లోని బూర్జ్ ఖలీఫాలోని 69వ అంతస్తులో ఫ్లాట్ ఉందని... గతంలో రూపాయికి లేని స్థాయి నుంచి, బూర్జ్ ఖలీఫాలో ఫ్లాట్ తీసుకునే స్థాయికి ఆమె ఎలా ఎదిగారని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులను రికవరీ చేసి ప్రజలకు పంచుతామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ దీక్ష పేరుతో ఆస్పత్రుల్లో విటమిన్లు తీసుకున్నారని, ఆ విటమిన్లతో 50ఏళ్లు బతకొచ్చని చెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ టీవీ చానల్‌తో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ సిరిసిల్లలో మాట్లాడుతూ తనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవన్నారు. తాను కాంట్రాక్టర్‌ను కాదని, కాంట్రాక్టర్‌ను అని రుజువు చేస్తే మంత్రి పదవిని వదులుకుంటానని స్పష్టం చేశారు. తాను మిడ్‌మానేరు ప్రాజెక్టులోని కట్ట కాంట్రాక్టులో తప్పు చేశానని కేసీఆర్ ఆరోపించారని, మరి.. పదేళ్లుగా చర్యలు తీసుకోకుండా ఏం చేశారని నిలదీశారు. తెలంగాణ ఇస్తే పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని చెప్పి, చివరకు రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకున్నారని.. ఇపుడేమో కుక్కలు, నక్కలు, సన్నాసులని అంటున్నారని ధ్వజమెత్తారు. మద్యం విధానం కేసులో తన బిడ్డే అరెస్టయితే గనక తాను కచ్చితంగా ఉరి వేసుకునేవాడినని అన్నారు. ఇపుడు కేసీఆర్.. రాజకీయ యాత్రలకన్నా, కూతురును చూసొచ్చేందుకు తిహాడ్ జైలు యాత్ర చేస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆయన రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆస్తులన్నీ ప్రభుత్వానికి అప్పగించాలని అన్నారు. రేపో, మాపో కాళేశ్వరంపై నియమించిన కమిటీ విచారణకు వస్తోందని, ఆ కమిటీ రిపోర్టు రాగానే కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్ అందరూ జైలుకు వెళ్తారని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒక్క సీటూ గెలవదని చెప్పారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి కూడా తన పేరును ప్రస్తావించే హక్కే లేదని, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంటే నిప్పులాంటి వ్యక్తి అని అన్నారు. తన పేరును వాడుకున్నవారు బతకలేరని, రాజకీయంగా తొక్కుకుంటూపోతానని వ్యాఖ్యానించారు.

మేనిఫెస్టో పేరిట ప్రజలను మోసం చేయొద్దు

- హామీలతో ఓట్లు దండుకొని అమలును మరిచారు
- పార్టీ మారితే పదవిపోయేలా చట్టం తెస్తామన్నమీరే.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు
- రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ


సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న హరీశ్‌రావు

హైదరాబాద్/గజ్వేల్/పాపన్నపేట/చిన్నశంకరంపేట/మెదక్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలతో ఓట్లు దండుకొని అధికారం వచ్చాక వాటి అమలును మరిచారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మేనిఫెస్టో పేరిట ప్రజలను మరోసారి మోసం చేయొద్దు" అని మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూచించారు. గతంలో ఇచ్చిన వాటిని అమలు చేయకుండా కొత్తగా హామీలిచ్చే నైతికత కాంగ్రెస్ లేదని ఆయన అన్నారు. ఈ మేరకు రాహుల్‌కు శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. " సోనియా గాంధీ పుట్టినరోజు డిసెంబరు 9 నాడే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. పంటల సాగుకోసం రూ.15వేల ఆర్థిక సాయం, మద్దతు ధరతోపాటు ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్.. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, పెన్షన్ రూ.4 వేలకు పెంపు.. మహిళలకు రూ.2500, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, ఆటోకార్మికులకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదు?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. పార్టీ.. మారిన వెంటనే పదవి పోయేలా చట్టం తీసుకొస్తామంటూనే.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం హాస్యాస్పదమని హరీశ్ రావు అన్నారు. స్వాతంత్ర్యం ఏర్పడిన అనంతరం మైనారిటీ మంత్రి లేకుండా ఏర్పడిన తొలి ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనని హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఇఫ్తార్ విందులో, మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి, చిన్నశంకరంపేటల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలోనూ ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ముస్లింలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోందని అన్నారు.

డీఎస్సీ దరఖాస్తుకు నో ఫీజ్: ఎమ్మెల్సీ బల్మూరి

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ దరఖాస్తులకు ఫీజు వసూలు చేయరాదనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందంటూ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వెల్లడించారు. ఈమేరకు ప్రతిపాదనను తాము సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జాబ్ క్యాలెండర్ విడుదల ఉంటుందని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో విద్యార్థులు, నిరుద్యోగులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైతే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలిచ్చి న్యాయం చేసిందన్నారు.

ఒరిజినల్ కాంగ్రెస్ వాళ్లకు అన్యాయం చేయవద్దు

- సీఎం రేవంత్‌ను కోరిన వీహెచ్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు బయట పడుతుండడంతో.. ఆ పార్టీ వాళ్లు ఒక్కొక్కరుగా వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, ఈ క్రమంలో ఒరిజినల్ కాంగ్రెస్ వాళ్లకు మాత్రం అన్యాయం చేయవద్దని మాజీ ఎంపీ వి. హన్మంతరావు అన్నారు. పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రస్తుతం కాంగ్రెస్ వేవ్ నడుస్తోందని, అందుకే అన్ని పార్టీల వారూ కాంగ్రెస్‌లోకి రావాలనుకుంటున్నారన్నారు. "హన్మంతంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే హన్మంతు. నాకు పదవి ఉన్నా.. లేకపోయినా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నా వంతు కృషి చేస్త" అని అన్నారు.

బీజేపీకి కూన శ్రీశైలంగౌడ్ గుడ్‌బై

- రేవంత్ సమక్షంలో తిరిగి సొంత గూటికి
- కండువాకప్పి ఆహ్వానించిన దీపా మున్షీ


సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్‌మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ బీజేపీకి గుడ్‌బై చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో తాను భాగస్వామ్యుడినై, ప్రజలకు మరింత చేరువకావాలన్న ఉద్దేశంతో రాజీనామా చేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. అనంతరం సీఎం నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. శ్రీశైలంగౌడ్ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్‌తోనే మొదలైంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న శ్రీశైలంగౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఏర్పాటు తర్వాత తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మల్కాజిగిరిలో రేవంత్‌రెడ్డి విజయానికి కృషి చేశారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన శ్రీశైలం గౌడ్.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇవ్వాలని బీజేపీ అధిష్ఠానంపై ఆయన ఒత్తిడి తీసుకువచ్చినా ఫలితం దక్కలేదు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీశైలంగౌడ్.. కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరిగింది. తాజాగా సీఎం రేవంత్ సూచన మేరకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు శ్రీశైలంగౌడ్ నివాసానికి వెళ్లి కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు శ్రీశైలంగౌడ్‌తోపాటు ఆయన సోదరులు కూన శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ రాము గౌడ్‌తోపాటు ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కాగా, సుమారు వంద మంది మాదిగ దండోరా నేతలు శుక్రవారం సతీష్ మాదిగ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

రేవంత్ సీఎంగా ఉన్నంత వరకూ

రాహుల్ ప్రధాని కాలేరు

(మొదటిపేజీ తరువాయి)

ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించిందని విమర్శించారు. రాష్ట్రంలో భూ గర్భజలాలు పడిపోయాయి..పంటలు ఎండిపోయాయి.. పశువులకు కూడా నీళ్లు దొరకని పరిస్థితి... ఇంత జరుగుతుంటే సీఎం రేవంత్ ఎందుకు సమీక్ష నిర్వహించడం లేదు? అని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన తర్వాత నాలుగు నెలల్లో ఏం సాధించారు? ఏ మొహం పెట్టుకుని తుక్కుగూడ మీటింగ్ పెడుతున్నారు? అని మండిపడ్డారు. గాల్లో దీపం పెట్టి దేవుడా నువ్వే దిక్కు అన్నట్లుగా కాంగ్రెస్ వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో ఆ పార్టీకి ప్రస్తుతం 40 ఎంపీ సీట్లు ఉన్నాయని, వచ్చే సారి అవి కూడా రావని జోస్యం చెప్పారు. కర్ణాటకలో 90శాతం సీట్లు, హిమాచల్‌లోని అన్ని ఎంపీ సీట్లను బీజేపీ కైవసం చేసుకోనుందని చెప్పారు. తెలంగాణలో తమకు డబుల్ డిజిట్ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఓల్డ్ సిటీలోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ బూతుల్లో ఎంఐఎం అక్రమాలకు పాల్పడుతోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. అంబర్‌పేటలో పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి, పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ప్రచారం చేయాలని సూచించారు. ఇచ్చిన మాట మేరకు రామమందిరం నిర్మాణాన్ని మోదీ పూర్తి చేశారని గుర్తు చేశారు. అసదుద్దీన్ ఒవైసీ లాంటి వాళ్లు ఎంత రెచ్చగొట్టినా రామ మందిరం నిర్మాణాన్ని ఏ ఒక్క ముస్లిం కూడా వ్యతిరేకించలేదన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ టిఫిన్ బైఠక్‌లు

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యకర్తలు, నాయకులు, బూత్ సభ్యులు, తమ ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తీసుకుని వచ్చి తమ తమ పోలింగ్ బూత్‌ల కూడళ్లలో టిఫిన్ బైఠక్‌లో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఫిర్ ఏక్ బార్.. మోదీ సర్కార్ నినాదంతో ప్రతీ పోలింగ్ బూత్‌లో ఓట్ల శాతం పెంచుకోవడమే లక్ష్యంగా టిఫిన్ బైఠక్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాచిగూడలో కిషన్‌రెడ్డి, కరీంనగర్ సాధన స్కూల్ వద్ద బండి సంజయ్, కోయిల్ కొండలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, చిక్కడపల్లిలో కె.లక్ష్మణ్, వినాయక్‌నగర్‌లో ఈటల రాజేందర్, డీడీ కాలనీలో మురళీధర్‌రావు, వనస్థలిపురంలో గరికపాటి మోహన్‌రావు, మెట్టుగూడలో అభయ్ పాటిల్ పాల్గొననున్నారు

రైతు హామీలు ఏమయ్యాయి..?

- రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా..
- వరికి రూ.500 బోనస్ ఎప్పుడిస్తారు
- అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి కాంగ్రెస్
- రైతు సత్యాగ్రహ దీక్షలో బీజేపీ రాష్ట్ర నేతలు


సంగారెడ్డిలో జరిగిన రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని తెలంగాణ బీజేపీ నేతలు విమర్శించారు. ఎన్నికల వేళ అన్నదాతలకు అబద్ధపు హామీలను ఆశ చూపి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయాలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్షలు చేశారు. నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మెదక్‌లో జరిగిన దీక్షలో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షల్లో డీకే అరుణ ప్రసంగించారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షకు ఎంపీ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నల్లగొండలో జరిగిన దీక్షలో బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అన్నదాతల పట్ల కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు.వరి క్వింటాకు రూ.500 బోనస్ ఏమైందని నిలదీశారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల పరిహారం ఇవ్వడంలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సర్కార్‌కు ముందు చూపు లేకనే పంటలు ఎండుతున్నాయని విమర్శించారు.



వాహనాలు నిలువ నీడ లేకపాయే!

(మొదటిపేజీ తరువాయి)

నీరూ లేక అల్లాడాల్సిందే.. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన నూతన సచివాలయంలో పరిస్థితి ఇదీ. బీఆర్‌ఎస్ పాలనలో వందల కోట్లు ఖర్చు చేసి సచివాలయం నిర్మించినా.. ప్రాథమికంగా కల్పించాల్సిన సౌకర్యాలపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా ఎండలు, వానల సమయంలో సచివాలయ ఉద్యోగుల నుంచి వాహనాల డ్రైవర్ల వరకూ ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మంత్రులు, అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా వచ్చే వారు ఎండాకాలంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు లేక తిప్పలు పడుతున్నారు. సాధారణంగా భారీ భవనాలకు అండర్ గ్రౌండ్ సెల్లార్‌లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తుంటారు. కానీ, కొత్త సచివాలయాన్ని ఇందుకు భిన్నంగా నిర్మించారు. సచివాలయ ప్రాంగణంలో మల్టీ లెవల్ పార్కింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆర్ అండ్ బీ అధికారులు ప్రతిపాదించినా అది కాగితాలకే పరిమితమైంది. ఫలితంగా సచివాలయం ప్రాంగణంలో ఎండలోనే కార్లను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. మార్చి నుంచే ఎండలు దంచి కొడుతుండడం, గంటల తరబడి వాహనాలు ఎండలోనే ఉండడంతో ఇంధనం ఆవిరైపోతుందని, మైలేజీ తగ్గిపోతుందని డ్రైవర్లు చెబుతున్నారు. వాహనాలకు తరచూ మెయింటనెన్స్ సమస్యలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. విశ్రాంతిగది లేకపోవడంతో వాహనాల్లోనే తాము భోజనం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు మరిన్ని ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారు. అంతేకాదు.. సెక్రటేరియట్ పార్కింగ్ ఏరియాలో నీళ్లు తాగేందుకు చలివేంద్రాన్ని కూడా అధికారులు ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క చెట్టూ మిగల్లేదు..

పాత సచివాలయంలో ఎటూ చూసినా పెద్ద పెద్ద చెట్లుండేవి. డ్రైవర్లు, సందర్శకులు కూడా ఆ చెట్ల కింద సేద తీరేవారు. డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి గది కూడా అందుబాటులో ఉండేది. కానీ ప్రస్తుత సచివాలయంలో నిలువ నీడే లేకుండా పోయింది. కొత్త సచివాలయ నిర్మాణం నేపథ్యంలో తాత్కాలికంగా బీఆర్‌కే భవన్‌కు తరలించినపుడు కూడా వాహనాల పార్కింగ్ కోసం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను వినియోగించుకున్నారు. కానీ, ఇపుడు అక్కడికి వెళ్లి రావాలంటే ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. పైగా అధికారులు ఎపుడు పిలుస్తారో, ఎటు వెళ్లాలంటారో తెలియదు. దాంతో డ్రైవర్లు ఇక్కడే ఉండి పోవాల్సి వస్తోంది. ఎంత పెద్ద చెట్టునైనా ఒక చోట నుంచి మరోచోటకు తరలించే సాంకేతికత అందుబాటులో ఉన్నా.. పాత సచివాలయంలో ఉన్న చెట్లను ఎందుకు సంరక్షించలేకపోయారనే వాదనలు వస్తున్నాయి. కనీసం కొత్త సచివాలయంలో నీడనిచ్చే మొక్కలు నాటి ఉన్నా.. ఈ పాటికి చెట్లుగా మారి ఉండేవని అంటున్నారు.

మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌కు సీఎం నివాళి

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. శుక్రవారం తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి శ్రీధర్‌బాబు, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి రోహిత్ చౌదరి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భట్టి

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నాం

» కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి కొందరి కుట్ర

» రాష్ట్రంలోకి కరువును తీసుకువచ్చిందే కేసీఆర్: భట్టి

ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రజలు కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి కరువును తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దేనని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరువు వచ్చిందనడం కేసీఆర్ అవివేకానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వర్షపు నీటిని వృథాగా వదిలేయడంతోనే నీటి సమస్య తలెత్తిందన్నారు. వేసవిలో విద్యుత్ కోతలు రానివ్వబోమని భట్టి తెలిపారు. తుక్కుగూడలో శనివారం జరగనున్న బహిరంగసభలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు గ్యారంటీలు ప్రకటించబోతోందని చెప్పారు. కాగా, దేశ ప్రజాస్వామ్య పటిష్ఠతకు ఎనలేని కృషి చేసిన మహానాయకుడు బాబూ జగ్జీవన్‌రాం అని భట్టి పేర్కొన్నారు.

వారంలో హైదరాబాద్‌కు జస్టిస్ చంద్రఘోష్

» కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణకు కసరత్తు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణలో కదలిక వచ్చింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ వారం రోజుల్లో హైదరాబాద్ రానున్నారు. మూడురోజుల పాటు ఇక్కడే బస చేసి, న్యాయ విచారణపై కసరత్తు చేయనున్నారు. తొలుత నీటిపారుదల శాఖ అధికారులతో భేటీ అయి.. న్యాయ విచారణకు అవసరమైన సిబ్బంది నియామకంపై చర్చలు జరపనున్నారు. ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించనున్నారు. బీఆర్‌కే భవన్ 8వ అంతస్తులో రూ.3.5 కోట్లతో న్యాయ విచారణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఆయన కోసం ముగ్గురు న్యాయవాదులతోపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) నుంచి చీఫ్ ఇంజనీర్ దాకా సాంకేతిక సిబ్బంది, ఆఫీస్ సబార్డినేట్ నుంచి సూపరింటెండెంట్ దాకా నాన్ టెక్నికల్ సిబ్బందిని సమకూర్చనున్నారు.

నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి

» వాటిని ఎన్నికల సంఘం పర్యవేక్షించాలి: అసదుద్దీన్

హైదరాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో మృతి చెందిన ముఖ్తార్ అన్సారీ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి బెదిరింపు కాల్స్ వ్యవహారాలను ఎన్నికల సంఘం పర్యవేక్షించాలని ఆయన కోరారు. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం జుమ్మాతుల్ విదా సందర్భంగా తలాబ్‌కట్ట మసీదులో జరిగిన సామూహిక ప్రార్థనల్లో అసదుద్దీన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో పేదలు, దళితులు, మైనారిటీ వర్గం ముస్లింలను నిర్వాసితులుగా మార్చి వారి హక్కులను కాలరాసే కుట్రలో భాగంగానే పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీలను తెరపైకి తెచ్చారని ఆరోపించారు. వారిని వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీఏఏ అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని తెలంగాణ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

బీఎస్పీని వీడిన ప్రవీణ్ కుమార్ సోదరుడు

పంజాగుట్ట, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నమ్ముకుని బీఎస్పీలో చేరితే తనను మోసం చేశారని ఆయన సోదరుడు అలంపూర్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ప్రసన్న కుమార్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తాను బీఎస్పీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రసన్న కుమార్ ప్రకటించారు. ఆయనతో పాటు చెన్నూరు నుంచి పోటీ చేసిన దాసారపు శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్పీని నమ్మి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టుకున్నామని, తమకు చెప్పకుండానే మరమ్మతులకు వచ్చిన కారు పార్టీలో చేరాడని మండిపడ్డారు. ప్రత్యక్ష రాజకీయాల్లో రావాలని మంచి ఉద్యోగాన్ని వదులుకుని పార్టీలో చేరితే మోసం చేశారన్నారు. తమతో పాటు మరో 13 మంది నేతలు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పనిచేయనున్నట్లు తెలిపారు.

డెలివరీ బాయ్ బ్యాగ్‌లో రూ.15 లక్షలు స్వాధీనం

» నగరంలో వాహనాల తనిఖీలు ముమ్మరం

» శుక్రవారం రూ. 76లక్షలు పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. అక్రమ నగదు రవాణాపై ఓ వైపు టాస్క్ ఫోర్స్ బృందాలు మరో వైపు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే గుట్టుగా తరలిస్తున్న రూ.76లక్షల నగదును పట్టుకున్నారు. మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. సోదాల్లో భాగంగా గుబాల నాగార్జున అనే జొమాటో డెలివరీబాయ్ బ్యాగ్‌లో బైక్‌పై తరలిస్తున్న రూ.14.97లక్షలను సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్, ఆసిఫ్‌నగర్ పోలీసులు సంయుక్తంగా మల్లెపల్లి సర్కిల్ వద్ద పట్టుకున్నారు. మంగళ్‌హాట్‌లోని ఓ ప్లైవుడ్ దుకాణం యజమాని ఆదేశాల మేరకు నగదు తీసుకెళ్తున్నానని డెలివరీ బాయ్ పోలీసులకు చెప్పాడు. అబిడ్స్ పరిధిలో హవాలా రూపంలో తరలిస్తున్న రూ.40లక్షలను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో రాజేష్, ముత్యాలు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. తమ యజమాని విల్సన్ బాబు ఆదేశాల మేరకు డబ్బును తరలిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కాగా, సికింద్రాబాద్‌లోని సీటీసీలో స్క్రాప్ వ్యాపారం చేస్తున్న నూర్ మహ్మద్, మాలిక్ అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై ఎలాంటి పత్రాలు లేకుండా రూ.21లక్షలు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.


పోలీసులు అదుపులోకి తీసుకున్న నగదు, ఇద్దరు వ్యక్తులు



తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దీపా దాస్‌మున్షీ, సీతక్క, తదితరులు

నేడే కాంగ్రెస్ జనజాతర

(మొదటిపేజీ తరువాయి)

కాకుండా చూసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సీఎం సూచన మేరకు పార్టీ అభ్యర్థులు, మంత్రులు జన సమీకరణకు భారీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా తుక్కుగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఎనిమిది లోక్‌సభ నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జనాన్ని సమీకరిస్తున్నారు. అయితే సభకు వస్తున్న వారిలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలకుగాను ప్రభుత్వం ఇప్పటికి అమలు చేసిన ఐదు గ్యారెంటీల లబ్ధిదారుల్లో మహిళలే అధికం కావడంతో.. సభలో వారి భాగస్వామ్యం ఎక్కువ ఉండేలా చూస్తున్నారు.

ప్రియాంక పర్యటన రద్దు..

జనజాతర సభలో పాల్గొనేందుకు రాహుల్‌గాంధీతో పాటు ప్రియాంకగాంధీ కూడా రావాల్సి ఉన్నా.. చివరి నిమిషంలో ఆమె పర్యటన రద్దయింది. తుక్కుగూడ తరహాలోనే రాజస్థాన్‌లోనూ శనివారం పార్టీ మేనిఫెస్టో విడుదల సభ జరుగుతోంది. ఆ సభలో పాల్గొనేందుకు ప్రియాంక వెళ్లాలని ఏఐసీసీ నిర్ణయించడంతో.. ఆమె తెలంగాణ టూర్ రద్దయింది. కాగా, తుక్కుగూడ సభ వేదికగా కాంగ్రెస్ మేనిఫెస్టో తెలుగు ప్రతిని రాహుల్‌గాంధీ ప్రజలకు అంకితం చేస్తారు. మేనిఫెస్టోతోపాటు 'పాంచ్ న్యాయ్' గ్యారెంటీల తెలుగు ప్రతులనూ విడుదదల చేయనున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న హామీలను ప్రకటించనున్నారు. పార్టీ తరఫున ప్రధాని అభ్యర్థి అయిన రాహుల్ గాంధీ.. దేశ ప్రజలకు స్వయంగా హామీలు ఇస్తున్న సభ కావడంతో ఈ సభను సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మంగా తీసుకున్నారు. కాగా, జనజాతర సభ వేదికగా ప్రధాని మోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లే టార్గెట్‌గా రాహుల్ ప్రసంగం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మోదీ పదేళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, కాంగ్రెస్ పార్టీ చూపుతున్న పరిష్కార మార్గాలు, ఇస్తున్న హామీలను రాహుల్ వివరించనున్నట్లు పేర్కొన్నాయి. కాగా, రాష్ట్రంలో వందరోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి వివరించనున్నారు.

భారీగా ఏర్పాట్లు.. సౌకర్యాలు..

జనజాతర సభకు 10 లక్షల మందిని సమీకరించేందుకు ఏర్పాట్లు చేసిన కాంగ్రెస్ పార్టీ.. అంతమంది ఈ ఎండలకు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లూ చేసింది. 70 ఎకరాల విస్తీర్ణంలో సభను నిర్వహించనుండగా.. ఆ పక్కనే ఉన్న 550 ఎకరాలను వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. సభావేదికపై 250 మంది ముఖ్యనేతలు కూర్చొనే విధంగా భారీ వేదికను నిర్మించారు. వేదిక కుడివైపు 250 మంది రాష్ట్ర ముఖ్యనేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూర్చునేందుకు సీట్లు వేశారు. వేదిక ఎడమవైపు కళాకారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేదిక వెనుక భారీ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో పాటు సభ ప్రాంగణంలో జనాలకు కనిపించేలా నలుమూలలా స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కాగా, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సభకు హాజరయ్యే వారికి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాయంత్రం 5గంటలకు నిర్వహిస్తున్న సభకు రాష్ట్ర నలుమూల నుంచి హాజరవుతున్న వారికి తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. సభ ప్రాంగణంలో 24 లక్షల వాటర్ బాటిళ్ల అందుబాటులో ఉంచడంతోపాటు 12 లక్షల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీకి సిద్ధం చేశారు. సభకు వస్తున్నవారికి మార్గమధ్యంలో భోజన సదుపాయం కల్పించే బాధ్యతను స్థానిక నాయకత్వానికి అప్పగించారు. సభా ప్రాంగణం వద్ద అత్యవసర వైద్యసేవలు కూడా అందుబాటులో ఉంచారు.



జనజాతర సభకు వెళ్లే ముస్లింలకు ఇఫ్తార్ కిట్‌లు

కాంగ్రెస్ జనజాతర సభకు హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి తరలివెళ్లనున్న ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ కిట్‌లు అందించే ఏర్పాట్లు చేసినట్టు టీపీసీసీ కార్యదర్శి అలీ మస్కతి తెలిపారు. పదివేల మందికి పైగా ముస్లింలు హైదరాబాద్ నుంచి హాజరుకానున్నట్టు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈసారి కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేతలంతా ఇక్కడే..

జనజాతర సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నేతలు అహర్నిశలు కృషిచేస్తున్నారు. జనసమీకరణ, సభ ఏర్పాట్లపై రోజువారీ సమీక్షలు నిర్వహించారు. కొందరు నేతలు కొద్ది రోజులుగా ఇక్కడే పాగా వేసి నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యనేతలంతా ప్రతి రోజూ ఇక్కడకు వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు సభ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులు బహిరంగ సభ ఏర్పాట్లపై రోజువారీగా సమీక్షించారు. శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ.. మంత్రులు, ముఖ్యనేతలతో కలిసి సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. కాగా, జనజాతర సభకు భారీగా జనం తరలి వస్తుండడంతోపాటు దేశ నలుమూలల నుంచి కాంగ్రెస్ ముఖ్యనేతలంతా హాజరు కానుండడంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. తుక్కుగూడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ పార్టీ జనజాతర సభకు హాజరయ్యే ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ తుక్కుగూడ చుట్టు పక్కల రహదారుల వెంట తోరణాలు, కటౌట్లు, ఫ్లెక్సీలు భారీగా ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడ చూసినా కాంగ్రెస్ జెండాలే కనిపిస్తున్నాయి.



జగన్.. నాయకుడివేనా?

» బాబాయిని చంపినవారికి సీటు ఇస్తావా?

» హత్యా రాజకీయాలు చేసే అవినాశ్‌ను కాపాడే జగన్‌ను ఓడించండి: షర్మిల

» కడప సీటు కోసమే వివేకా హత్య: సునీత

కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): 'సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డిని చంపినవారిని శిక్షించలేని నీవు నాయకుడివి ఎలా అవుతావు?' అంటూ ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై ఆయన సోదరి, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విరుచుకుపడ్డారు. ఈ కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని కాపాడుతున్నాడని, హత్య చేసినవారికే మళ్లీ పార్టీ టికెట్ ఇచ్చాడని, న్యాయం, ధర్మం ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ ఘోరాన్ని ఆపడానికే వైఎస్సార్ బిడ్డగా తాను ఎంపీగా నిలబడ్డానని, ఇది న్యాయానికి, అధర్మానికి జరుగుతున్న పోరాటమని అన్నారు. తనవైపు న్యాయముందని, మరోవైపు వివేకా హత్య కేసు నిందితుడు, అధర్మం, అధికారం, డబ్బు ఉన్నాయని, ఎవరిని గెలిపిస్తారో ప్రజలే నిర్ణేతలని అన్నారు. కడప పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల ఏపీ న్యాయయాత్ర పేరిట శుక్రవారం కడప జిల్లాలోని బద్వేలు నియోజకవర్గం అమగంపల్లెలో బస్సుయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివేకానందరెడ్డి కూతురు డాక్టర్ సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... వైఎస్ వివేకాను గొడ్డలితో నరికి చంపి ఐదేళ్లు గడిచినా నిందితులకు శిక్ష పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'జగన్ రాష్ట్రానికే కాదు సొంత జిల్లాకు మంచి చేయలేదు. వివేకా హత్య ఎవరు చేయించారో అందరికీ తెలుసు. ఈ రోజు వైఎస్సార్ బిడ్డ కడప ఎంపీగా పోటీ చేస్తోందంటే దానికి కారణం జగనే. బాబాయిని చంపిన హంతకుడికి మళ్లీ సీటు ఇచ్చారు. హంతకులు మళ్లీ చట్టసభలకు వెళ్లకూడదు. న్యాయం వైపున్న షర్మిల కావాలో, అధర్మం వైపు ఉన్న అవినాశ్ కావాలో తేల్చుకోవాలి. హత్యా రాజకీయాలు చేసే అవినాశ్‌రెడ్డిని, కాపాడే జగన్‌రెడ్డిని ఇద్దరినీ ఓడించాలి' అని షర్మిల పిలుపునిచ్చారు. "వైఎస్ రాజశేఖరరెడ్డి,వివేకానందరెడ్డి రామలక్ష్మణుల్లా ఉండేవారు. అన్న మాటను వివేకానందరెడ్డి దాటేవారు కాదు. నాన్న చివరి కోరిక షర్మిలను ఎంపీ చేయాలని. కడప ఎంపీ సీటు కోసం నాన్నను హత్య చేశారు. ఈ పని చేయించింది అవినాశ్‌రెడ్డి. ఎన్నికల్లో మళ్లీ అతడు పోటీ చేస్తున్నాడు. వివేకా హంతకులను జగన్ కాపాడుతున్నాడు. వారికి శిక్ష పడాలంటే అవినాశ్‌ను ఓడించాలి" అని సునీత అన్నారు.

రాష్ట్రమంతా తిరిగి ప్రచారం చేస్తా

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి.. సంగారెడ్డిలో 20 వేల మెజార్టీ రావాలి

ఇక్కడ నా సతీమణి నిర్మల ప్రచారం చేస్తారు.. .. రాజకీయ కొట్లాటలకు పోవద్దు: జగ్గారెడ్డి



సంగారెడ్డి/కొండాపూర్, ఏప్రిల్ 5, (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తాను రాష్ట్రమంతా పర్యటించి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు. తన సతీమణి, టీఎస్ఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రచారం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి సంగారెడ్డి నియోజకవర్గంలో 20 వేల మెజార్టీ వచ్చేలా కృషిచేయాలని కార్యకర్తలను కోరారు. తాను వచ్చినా, రాకపోయినా కార్యకర్తలకు తన అండ ఉంటుందని చెప్పారు. కంది మండలంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటు పరం కానివ్వబోమన్నారు. కోడ్ ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, సీతక్క, రాజనర్సింహలను కలిసి నియోజకవర్గానికి కావలసిన నిధులు తెచ్చే బాధ్యత తనదేనని ఆయన చెప్పారు. నియోజక అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రోటోకాల్‌కు అడ్డుపడొద్దని, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా మెలగాలని జగ్గారెడ్డి సూచించారు. ఓట్లు వేసేటప్పుడు లేని పౌరుషం ఇప్పుడెందుకు వస్తుందన్నారు. మన ప్రభుత్వమే ఉందని, పనులు కాకపోతే తన పేరు చెప్పి చేయించుకోవాలని సూచించారు. అధికారులు చేయకపోతే తన సంగతి ఎట్లా ఉంటుదో వారికి తెలుసన్నారు. తాను ఎన్ని నిధులు తెచ్చినా, కొబ్బరికాయ కొట్టే చాన్స్ తనకు లేదు కదా అని వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో రాజకీయ కొట్లాటలు తీసుకురావద్దని సూచించారు.


సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి; హాజరైన మహిళా కాంగ్రెస్ నాయకురాలు జయారెడ్డి, ముఖ్య కార్యకర్తలు

రాధాకిషన్‌రావుకు అస్వస్థత

డాక్టర్‌ను పిలిపించి చికిత్స అందించిన పోలీసులు

» ట్యాపింగ్ కేసులో ఇద్దరు కానిస్టేబుళ్ల స్టేట్‌మెంట్ రికార్డు

» మునుగోడు ఉప ఎన్నికలో ట్యాపింగ్‌లో వీరి పాత్ర

» నేడు, రేపు మరికొందరిని విచారించే అవకాశం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి.. పోలీస్ కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రెండో రోజు విచారణలో ఉండగా ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో వెస్ట్ జోన్ పోలీసులు హుటాహుటిన డాక్టర్‌ను రప్పించి ప్రాథమిక చికిత్స అందించారు. ఉన్నట్లుండి బీపీ పెరిగిందని, వెంటనే మామూలైపోతోందని డాక్టర్ చెప్పినట్లు తెలిసింది. రాధాకిషన్‌రావుకు అస్వస్థత సంగతి తెలిసి ఆయన కూతురు, కుటుంబసభ్యులు హుటాహుటిన డ్రైఫ్రూట్స్, భోజనం తీసుకుని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. విచారణ అధికారుల అనుమతితో వాటిని ఆయనకు అందించారు. దీంతో విచారణ ప్రక్రియను గంటన్నర సేపు నిలిపివేశారు. రాధాకిషన్‌రావు ఆరోగ్యం మామూలు స్థితికి వచ్చిన తర్వాత విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌తో పాటు.. ఆధారాలు ధ్వంసం, అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రైవేట్ వ్యక్తుల ప్రొఫైల్స్ తయారు చేసి బెదిరింపులకు దిగడం ద్వారా రూ.కోట్లు కొల్లగొట్టడం, ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ డబ్బును హవాలా మార్గంలో తరలించడం వంటి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు రాబట్టడానికి, ఇంకా ఎంతమంది అధికారులు ఈ కుట్రలో పాల్పంచుకున్నారో..? ఏఏ నాయకులు ఈ నేరాన్ని చేయించారో తెలుసుకోవడానికి రాధాకిషన్‌రావును న్యాయస్థానం అనుమతితో పోలీసులు ఏడు రోజులు కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే.

ఇద్దరు కానిస్టేబుళ్లను విచారించిన పోలీసులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు కాస్టేబుళ్లను వెస్ట్ జోన్ పోలీసులు విచారించినట్లు తెలిసింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఎస్ఐబీ)లో పనిచేసిన ఈ ఇద్దరు ప్రస్తుతం నల్లగొండలో విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా వారి పాత్ర తేలడంతో కానిస్టేబుళ్లను ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచి) అధికారులు నల్లగొండలో అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఆదేశాలతో మునుగోడు ఎన్నికలో పోటీకి దిగిన ప్రధాన పార్టీ నాయకుడి ఫోన్లు ట్యాప్ చేయడంలో వీరు కీలక పాత్ర పోషించినట్లు తేలింది. వీరిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు సమాచారం. మరోవైపు ఉన్నతాధికారుల సూచనలతో.. ట్యాపింగ్‌లో పాలుపంచుకున్న క్షేత్రస్థాయి సిబ్బందిని గుర్తించి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. శని, ఆదివారాల్లో మరికొంత మందిని పిలిపించి విచారించే అవకాశం ఉందని చెబుతున్నారు.

నేతన్నల ఉసురు తీసింది బీఆర్ఎస్సే

బతుకమ్మ చీరలకు నిధులు ఎందుకు ఇవ్వలేదు ?

» కేటీఆర్ లేఖపై మంత్రి తుమ్మల మండిపాటు

» కార్మికుల కోసం 'నేతన్న భరోసా' పథకం ప్రకటించిన మంత్రి

» సహకార సంఘాలకు మరో రూ.7 కోట్లు బకాయిలు చెల్లిస్తామని వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలపై మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాయడంపై రాష్ట్ర వ్యవసాయ, చేనేత. జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేటీఆర్ లేఖ రాయడం మొగున్ని కొట్టి మొగసాలకు ఎక్కినట్లు ఉన్నదని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో చేనేత రంగం కుదేలయ్యిందని, బతుకమ్మ చీరల పేరుతో అనర్హులకు లబ్ధి చేకూర్చి కార్మికుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలను విస్మరించి మ్యాక్స్ సహకార సంఘాలను ప్రోత్సహించడం వల్ల నిజమైన చేనేత కార్మికులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో 393 చేనేత సహకార సంఘాలు ఉంటే... 105 సంఘాలకే పని కల్పించారని చెప్పారు. రాష్ట్రంలో 140 మ్యాక్స్, 135 ఎస్ఎస్ఐ యూనిట్లు ఉండగా వాటి విద్యుత్ వాడకాలను పరిశీలిస్తే వాటిల్లో 30 శాతం యూనిట్లు బోగస్ అని తేలిందన్నారు. త్వరలోనే ఆయా యూనిట్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదేళ్ల పాలనలో చేనేత రంగాన్ని ఉద్ధరించామని గొప్పలు చెబుతున్న బీఆర్ఎస్ నేతలు బతుకమ్మ చీరలకు సంబంధించి టెస్కో ఎందుకు చెల్లింపులు చేయలేదని ప్రశ్నించారు. బతుకమ్మ చీరలకు సంబంధించి ప్రభుత్వం 2023 నవంబరు నాటికి టెస్కోకు రూ.438.38 కోట్లు బకాయి ఉందని, 2023 అక్టోబరులో చేసిన చీరల పంపిణీకి గాను మరో రూ.351.52 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆర్భాటంగా పథకాలు మొదలుపెట్టి, ఎన్నికలు అయిపోగానే పథకాలను మూలన పడేసిన చరిత్ర గత ప్రభుత్వానికి ఉందని తుమ్మల ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన చేనేత మిత్ర పథకానికి కేబినేట్ ఆమోదమేలేదని, అందుకు నిధులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత చేనేత సంఘాల నుంచి రూ.53 కోట్ల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసినట్లు తుమ్మల తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద యూనిఫామ్‌ల సరఫరా, నూలు కొనుగోలు, సైజింగ్ కోసం 50 శాతం అడ్వాన్సు కింద రూ.47 కోట్లు చెల్లించామని చెప్పారు. అలాగే, గత ప్రభుత్వం హయాంలో చేనత సహకార సంఘాలకు ఉన్న బకాయిల్లో రూ.8.81 కోట్లు చెల్లించామని, త్వరలో మరో రూ.7 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఇక, చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలికంగా లబ్ధి చేకూర్చే పథకాలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో 'నేతన్న భరోసా' అనే పథకాన్ని తీసుకొస్తున్నామని తుమ్మల ప్రకటించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు, హ్యాండ్లూమ్ పార్కు పునరుద్ధరణ, కొత్త పవర్‌లూమ్ క్లస్టర్ల అభివృద్ధి, కొత్త మైక్రో హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు, నేషనల్ సెంటర్ ఆఫ్ డిజైన్స్ ఏర్పాటుతో పాటు స్టేట్ టెక్నికల్ టెక్స్‌టైల్ పాలసీ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే క్రమంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి తుమ్మల వివరించారు.



ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలో ఏనుగు కోసం డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న అధికారులు

ప్రాణహితను దాటిన ఏనుగు

- నదిలో ఈదుతూ గడ్చిరోలి అటవీ ప్రాంతం వైపు పయనం
- ఆపరేషన్ గజ సక్సెస్.. అధికారులు, ప్రజలకు ఉపశమనం

హైదరాబాద్, ఆసిఫాబాద్/పెంచికల్‌పేట ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మంద నుంచి విడిపోయి.. వెర్రెక్కి.. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇద్దరు రైతుల ప్రాణాలను బలిగొన్న ఏనుగు మహారాష్ట్ర వైపు వెళ్లిపోయింది. శుక్రవారం రాత్రి ప్రాణహిత నదిలో ఈదుతూ సరిహద్దులు దాటింది. అలాఅలా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా చిన్నవట్ర అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లుగా గుర్తించారు. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఏనుగు ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర మీదుగా ఆసిఫాబాద్ జిల్లాకు దారితప్పి వచ్చింది. కాగా, శుక్రవారం ఉదయం 7 గంటలకు పెంచికల్‌పేట మండలం కమ్మర్‌గాంలో ఏనుగు కొందరికి తారసపడింది. వారి సమాచారంతో అటవీశాఖ అధికారులు 100 మంది సిబ్బందితో కొండపల్లి, సలుగుపల్లి, లోడ్‌పల్లి అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఏనుగు కదలికలను ట్రాక్ చేశారు. మధ్యాహ్నం మురళీగూడ అడవి మీదుగా ప్రాణహిత తీరానికి చేరుకున్నట్లు గుర్తించారు. గడ్చిరోలి అటవీ ప్రాంతం వైపు వెళ్లేలా చేశారు. రాత్రి 7:30-8 గంటల ప్రాంతంలో గడ్చిరోలి వైపు వెళ్లిపోయిందని నిర్ధారించారు. తిరిగి వస్తుందనే భావనతో 24 గంటల పాటు పర్యవేక్షణకు సిబ్బందిని నియమించారు.

గుంపు నుంచి వీడినందుకే కోపం: పీసీసీఎఫ్ పర్గేయిన్

మంద నుంచి విడిపోయిన ఏనుగును అడవిలోకి లేదా మంద వైపు మళ్లించాలంటే, రాత్రి పూటనే సాధ్యపడుతుందని పీసీసీఎఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ మోహన్‌చంద్ర పర్గేయిన్ తెలిపారు. ఏనుగులు పగలంతా విశ్రాంతి తీసుకుంటాయని.. రాత్రిళ్లు ఆహారం కోసం బయల్దేరతాయని చెప్పారు. గుంపు నుంచి బయటకొచ్చిన ఏనుగులకు కోపం ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించారు.

రాష్ట్రంలో పెరిగిన బీరు అమ్మకాలు

- రోజుకు దాదాపు 2లక్షల కేసుల విక్రయం

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలతో పాటు బీర్ల అమ్మకాలూ పెరిగిపోతున్నాయి. రోజుకు దాదాపు 2లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోతున్నాయి. అయితే, కొన్ని రకాల బీరు బ్రాండ్లు మద్యం షాపుల్లో దొరకడం లేదని పలువురు వాపోతున్నారు. షాపుల వాళ్లు కావాలనే ఆ బ్రాండ్లను అమ్మడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం తయారీ కంపెనీలు ఇచ్చే బహుమతులకు ఆశపడి వైన్ షాపు ఓనర్లు ఏవేవో బ్రాండ్లను అమ్ముతున్నారని ఆరోపిస్తున్నారు. జనవరిలో 40లక్షల కేసులు, ఫిబ్రవరిలో 44 లక్షల కేసులు, మార్చిలో 56లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది మార్చిలో అమ్ముడైన 49.67లక్షల కేసులతో పోలిస్తే ఇది 13.3% ఎక్కువ.

ముదిరాజ్‌లకు సొసైటీలో సభ్యత్వం ఇవ్వండి

- హైకోర్టు ఆదేశం

ప్రాథమిక మత్స్యకార సహకార సొసైటీలో ముదిరాజ్ కులస్థులకు సభ్యత్వం ఇవ్వాలని హైకోర్టు మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్‌లు సరైన నమూనాలో దరఖాస్తు చేయాలని, ఈ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం మూడువారాల్లో పరిష్కరించాలని స్పష్టం చేసింది. సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం ఖాజీపూర్ ప్రైమరీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఆ గ్రామంలో 40 మంది ముదిరాజ్ కులస్థులకు సభ్యత్వం ఇవ్వడంలేదని పేర్కొంటూ ముదిరాజ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి. గణేశ్, పి. భూపతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదనలు వినిపిస్తూ.. మత్స్యకార కులాల్లో ఒకటిగా ఉన్న ముదిరాజ్‌లకు సభ్యత్వం ఇవ్వకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సరైన నమూనాలో దరఖాస్తులు సమర్పిస్తే చట్టప్రకారం పరిశీలిస్తామని పేర్కొన్నారు.

రిటైర్డు జడ్జి జస్టిస్ రామలింగేశ్వరరావు మృతి

ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఏ రామలింగేశ్వరరావు జర్మనీలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన తన కుమార్తె వద్దకు వెళ్లిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆయన పార్థివదేహాన్ని రెండుమూడు రోజుల్లో జర్మనీ నుంచి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆయన 1956లో జన్మించారు. ఆంధ్రా వర్సిటీ నుంచి డిగ్రీ, ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, తెలుగు వర్సిటీ నుంచి ఆస్ట్రాలజీలో ఎంఏ డిగ్రీలు పొందారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్స్ ద్వారా జోతిష విశారదగా గుర్తింపు పొందారు. 1982లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయికీలక కేసుల్లో వాదనలు వినిపించడంతోపాటు టీటీడీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వంటి సంస్థలకు న్యాయవాదిగా పనిచేశారు. 2013 నుంచి 2018 వరకు ఉమ్మడి ఏపీ హైకోర్టు జడ్జిగా వ్యవహరించి, ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు.

ఫైనాన్స్ ఏజెంట్ల దాష్టీకానికి యువకుడి బలి

- మృతుడు యూపీకి చెందిన వినయ్.. ఖమ్మంలో ఘటన
- ఈఎంఐ చెల్లించలేదని దాడి.. వెంబడించిన ఏజెంట్లు
- భయంతో చెరువులో దూకిన వినయ్.. ఈత రాక మృతి



ఖమ్మం క్రైం, ఏప్రిల్ 5: ఫైనాన్స్ ఏజెంట్ల రాక్షసత్వానికి ఖమ్మం నగరంలో ఓ యువకుడు బలైపోయాడు. బైక్ లోన్ తీసుకొని వాయిదాల చెల్లింపుల్లో జాప్యం చేయడంతో ఫైనాన్స్ ఇచ్చిన ఏజెంట్లు యువకుడిపై దాడికి దిగారు. అతడు ప్రాణభయంతో పారిపోతుండగా రాళ్లు పట్టుకొని వెంబడించారు. దీంతో యువకుడు ఎటూ తప్పించుకోలేక ఓ చెరువులో దూకాడు. ఈత రాక ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని ఉత్తరప్రదేశ్ నుంచి మార్బుల్ పని కోసం వచ్చిన వినయ్(20)గా గుర్తించారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీలోని ఆగ్రాకు చెందిన వినయ్(20), అతడి స్నేహితుడు అజయ్ మార్బుల్ పనుల కోసం కొంతకాలం క్రితం ఖమ్మం వచ్చారు. నగర పరిధిలోని దానవాయిగూడెంలో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం నగరంలోని మోహన్ సాయి సెకండ్ హ్యాండ్ ఫైనాన్స్ సంస్థ నుంచి రెండు బైక్‌లను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి కొద్దినెలలు ఈఎంఐలు చెల్లించారు. వినయ్ రూ.4,500, అజయ్ రూ.14,500 చెల్లించాల్సి ఉంది. ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లయిన అజయ్‌కుమార్, రాంచందర్ శుక్రవారం దానవాయిగూడేనికి వెళ్లారు. అజయ్ కొద్దిరోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లడంతో.. అతడి బైక్ ఎక్కడుందని వినయ్‌ను అడిగారు. బల్లేపల్లిలోని ఒకరికి అజయ్ అప్పు ఉన్నాడని, అతను బైక్‌ను తీసుకువెళ్లాడని వినయ్ తెలిపాడు. వెంటనే వినయ్‌ను తీసుకుని ఏజెంట్లు బల్లేపల్లికి వెళ్లారు. అక్కడ గొడవ జరిగింది. ఈ క్రమంలో రాంచందర్ కర్రతో వినయ్‌ను కొట్టాడు. వినయ్ భయంతో పారిపోతుండగా రికవరీ ఏజెంట్లు వెంబడించారు. భయంతో వినయ్ చెరువులో దూకాడు. ఈత రాకపోవడంతో చనిపోయాడు. విష యం తెలిసిన ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. రికవరీ ఏజెంట్లు అజయ్ కు మార్, రాంచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రంగంలోకి సీబీఐ



కవితను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్

- అనుమతించిన కోర్టు.. జైల్లోనే విచారణ
- కవిత బెయిల్ పిటిషన్‌పై ఎల్లుండి తీర్పు
- బెయిల్ వస్తే సీబీఐ అరెస్టు చేసే చాన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జ్యుడీషియల్ కస్టడీలోనే విచారించేందుకు సీబీఐకి రౌజ్ అవెన్యూ కోర్టు అనుమతి ఇచ్చింది. కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సోమవారం తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ఈ పరిణామం ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను అరెస్టు చేసిన ఈడీ.. మొత్తం పది రోజులపాటు తమ కస్టడీలోనే విచారించిన విషయం తెలిసిందే. అనంతరం ఆమెకు న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ కస్టడీ కూడా మంగళవారం ముగియనుంది. కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సోమవారం కోర్టు తీర్పు రానుంది. ఈ నేపథ్యంలోనే సీబీఐ తెరపైకి వచ్చింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితది కీలక పాత్రని, ఆమెను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని, ఆమెను జ్యుడీషియల్ కస్టడీలోనే విచారించడానికి తమకు అనుమతి ఇవ్వాలని రౌజ్ అవెన్యూ కోర్టులో సీబీఐ శుక్రవారం పిటిషన్ దాఖలు చేసింది. కవితను గతంలోనే విచారించామని, కేసుకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సేకరించామని, ఈ దశలో మరో సారి విచారిస్తే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని సీబీఐ తెలిపింది. దాంతో, కవితను విచారించేందుకు అనుమతి ఇస్తున్నామని రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా స్పష్టం చేశారు. కవితను జ్యుడీషియల్ కస్టడీలోనే ఇంటరాగేట్ చేయడానికి, ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడానికి అనుమతి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే, తిహాడ్ జైలు అధికారులకు ఒకరోజు ముందే సమాచారం ఇవ్వాలని, విచారించే సమయంలో తప్పనిసరిగా మహిళా కానిస్టేబుళ్లు అందుబాటులో ఉండాలని, అన్ని నిబంధనలను పకడ్బందీగా పాటించాలని నిర్దేశించారు. ల్యాప్‌టాప్, స్టేషనరీ సామగ్రి తీసుకెళ్లడానికి సీబీఐకి అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో వచ్చే వారంలో కవితను సీబీఐ అధికారులు విచారించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే.. సోమవారం కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు రానుంది. బెయిల్ వస్తుందా? లేదా పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేస్తుందా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ కవితకు బెయిల్ వస్తే.. సీబీఐ మళ్లీ ఆమెను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మళ్లీ కోర్టులో రిమాండ్ చేసి సీబీఐ కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్టు సమాచారం. బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తే తిహాడ్ జైలులోనే కవితను విచారించనున్నారు.

నేడు వడగాలులు.. రేపు వర్షాలు

- 40-43.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు
- రేపు ఉరుములతో కూడిన వానలు
- రెండ్రోజుల పాటు తగ్గనున్న ఎండలు
- రాష్ట్రంలో తాగునీటికి ఇబ్బందుల్లేవు
- సందీప్ సుల్తానియా

హైదరాబాద్, గజ్వేల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండే ఎండలు, ఉక్కబోత, వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్న వేళ హైదరాబాద్ వాతావరణ కేంద్రం కాస్త 'చల్లటి' కబురు చెప్పింది. రాగల రెండు రోజుల్లో ఎండలు తగ్గుతాయని, ఆకాశం మేఘావృతం అవుతుందని పేర్కొంది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం మాత్రం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, గద్వాల జిల్లాల్లో కొన్ని చోట్ల వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా శుక్రవారం ఎండ తీవ్రత గట్టిగానే కనిపించింది. మూడు జిల్లాలు మినహా అన్నిచోట్ల పగటిపూట ఉష్ణోగ్రతలు 40-43.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా కోల్వాయి, సిరిసిల్ల జిల్లా మార్తాన్‌పేట, నల్లగొండ జిల్లా మాడుగులపల్లి, గూడూరు, సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో 43.5 డిగ్రీలు, ములుగు జిల్లా ధర్మవరం, భద్రాద్రి జిల్లా కలెక్టరేట్, జనగాంలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో తాగునీటికి ఇబ్బందులు లేవని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా అక్కారంలోని 40ఎంఎల్ పంప్‌హౌజ్, కుకునూరుపల్లి మండలం తిప్పారంలోని రా వాటర్ పంప్‌హౌజ్, మంగోల్‌లో 540 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీ, కొండపాక మండల కేంద్రంలోని ఇంటర్మీడియేటరీ హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్ పంప్‌హౌజ్‌లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి రిజర్వాయర్‌పై నిఘా ఉంచామని, గ్రామాల్లో నీటి సరఫరాపై ప్రతి రోజు అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్ష జరుపుతున్నారని తెలిపారు. గత నెలలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో గ్రామాల్లో నీటి సరఫరా విభాగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మరమ్మతులు చేశామని, ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. జూన్, జూలై వరకు తాగునీటి కొరత లేకుండా పటిష్ఠ ప్రణాళిక రచించామన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించేలా కలెక్టర్ల వద్ద ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



సిద్దిపేట జిల్లా అక్కారం గ్రామంలో పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా

పొంచి ఉన్న ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పు

- ఏటా 14 లక్షల కేసులు..లాన్సెట్ అధ్యయనం

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పురుషుల పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావితం చేసే ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. తాజా అధ్యయనం ప్రకారం ప్రస్తుతం ఏటా 14లక్షల మంది పురుషులు ఆ క్యాన్సర్ బారిన పడుతుండగా, 3.75లక్షల మంది మృత్యువాత పడుతున్నట్లుగా తేలింది. 2020నాటికి ప్రపంచవ్యాప్తంగా నమోదైన కేసులు, మరణాలు, భవిష్యత్తులో దాని వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థలో భాగమైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఆర్‌సీ) పరిశోధకులతో కలిసి 'ది లాన్సెట్ కమిషన్ ఆన్ ప్రొస్టేట్ క్యాన్సర్' అధ్యయనం చేసింది. ఆ వివరాలను తాజాగా విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు 2020- 2040 మధ్య కాలంలో రెట్టింపు కంటే ఎక్కువ కానున్నాయని పేర్కొంది. ప్రస్తుతం నమోదవుతోన్న వాటి కంటే 85శాతం పెరుగుదల ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. అదే స్థాయిలో మరణాలు కూడా చోటు చేసుకుంటాయని తెలిపింది. 2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏటా 29లక్షల ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు నమోదవుతాయని, అలాగే ప్రతీ సంవత్సరం 7లక్షల మంది దాని బారినపడి మరణిస్తారని అంచనా వేసింది. ప్రధానంగా అల్పాదాయ దేశాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటుందని తెలిపింది. వృద్ధతరం ఎక్కువగా ఉండటం, జీవిత కాలం పెరగడం, జీవనశైలిలో మార్పుల వల్ల ఈ క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా కనిపిస్తున్నట్లు ఆ స్టడీ అభిప్రాయపడింది. రానున్న కాలంలో ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా పెరిగే అవకాశం ఉన్నందున ఈ వ్యాధి రిస్క్ ఎక్కువగా ఉన్నవారిని ముందుగా గుర్తించి.. వారికి తగిన కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా దీని ముప్పును తగ్గించవచ్చని లాన్సెట్ కమిషన్ ఆన్ ప్రొస్టేట్ క్యాన్సర్ పరిశోధకుడు ప్రొఫెసర్ నిక్ జేమ్స్ సూచించారు. దీనిపై ఒక కార్యచరణ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఏటా ఒకసారి ప్రొస్టేట్ పరీక్షలు చేయించుకోవాలి



జీవితకాలం పెరగడంతో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ప్రొస్టేట్ క్యాన్సర్ ఎక్కువగా వయసు మళ్లిన వారిలోనే వస్తుంది. ఇది నివారించలేనిది. కాకపోతే ముందస్తు పరీక్షల ద్వారా నిర్ధారణ అయితే, చికిత్స ద్వారా నయం చేయవచ్చు. మరణాన్నీ నివారించవచ్చు. అందుకే 50 ఏళ్లు దాటిన పురుషులు తప్పనిసరిగా ఏటా ఒకసారి ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ (పీఎస్ఏ) పరీక్షలు చేయించుకోవాలి. 60 ఏళ్లు దాటిన వారిలో ఈ క్యాన్సర్ రిస్క్ ఎక్కువ. ఏ మాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

- డాక్టర్ సుంకవల్లి చిన్నబాబు రోబోటిక్ సర్జికల్ అంకాలజిస్టు, క్లినికల్ డైరెక్టర్ యశోద ఆస్పత్రి, హైదరాబాద్.

వార్తలు సమాప్తం

తొలి తెలుగు టీవీ న్యూస్‌రీడర్ శాంతిస్వరూప్ ఇక లేరు





హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "నమస్కారం.. ఈ రోజు వార్తల్లో ముఖ్యాంశాలు.." అనే పలకరింపుతో నాలుగు దశాబ్దాల కిందట తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, కోట్లాదిమంది మదిలో ఓ అందమైన జ్ఞాపకంగా నిలిచిపోయిన ఆ స్వరూపం ఇక కనపడదు. ఆ గాత్రం వినపడదు. టెలీప్రాంప్టర్ లేని రోజుల్లోనే.. కాగితం చూడకుండా, నేరుగా ప్రేక్షకుల వైపు చూస్తూ.. చెదరని చిరునవ్వుతో, స్పష్టమైన ఉచ్చారణతో వార్తలు చదివి వినిపించిన తొలి తెలుగు టీవీ న్యూస్ రీడర్.. జయంతి శాంతి స్వరూప్ (74) ఇక లేరు. కొంతకాలంగా మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న ఆయనకు రెండు రోజుల క్రితం గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు ఆయన్ను ఆస్పత్రిలో చేర్పగా.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. శాంతి స్వరూప్ పుట్టిపెరిగిందంతా.. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోనే. ఆయన తండ్రి నరసింహం.. ప్రఖ్యాత శాస్త్రవేత్త శాంతి స్వరూప్ భట్నాగర్ మీద అభిమానంతో తన కుమారుడికి ఆ పేరు పెట్టారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన శాంతి స్వరూప్.. నారాయణ గూడ న్యూసైన్స్ కాలేజీ లో బీఎస్సీ డిగ్రీ చదివే సమయంలో నాటకాలు రాసి ప్రదర్శిస్తుండేవారు. అలా కళారంగ ప్రవేశం చేసిన ఆయన.. 1970లో ఆకాశవాణి వార్తా విభాగంలో క్యాజువల్ ఎనౌన్సర్‌గా చేరి ఏడాదిపాటు పని చేశారు. ఆ తర్వాత దూరదర్శన్‌లో చేరారు. 1983, నవంబర్ 14న సాయంత్రం 7 గంటలకు దూరదర్శన్‌లో మొట్టమొదటిసారిగా ప్రసారమైన వార్తా బులెటిన్‌లో వార్తలు చదివి, తొలి తెలుగు టీవీ న్యూస్‌రీడర్‌గా చరిత్రకెక్కారు. సందర్భాన్ని బట్టి వాచకాన్ని మారుస్తూ వార్తలు చదవడంలో ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఆరేళ్లపాటు ప్రసారమైన 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు దూరదర్శన్‌లో పనిచేసిన శాంతి స్వరూప్ 2011లో పదవీ విరమణ పొందారు. న్యూస్‌రీడర్‌గానే కాదు.. కవిగా, రచయితగానూ శాంతి స్వరూప్‌కు గుర్తింపు ఉంది. భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఇతివృత్తంగా "రాతి మేఘం", క్రికెట్ మీద అభిమానంతో "క్రేజ్", సతీసహగమనాన్ని నిరసిస్తూ "అర్ధాగ్ని" తదితర నవలలు రాశారాయన. "కర్పూర శిల్పం" సినిమాలో కథానాయకుడిగా నటించారు . కానీ ఆ సినిమా విడుదల కాలేదు. న్యూస్ రీడర్‌గా అందించిన సేవలకుగాను జీవనసాఫల్య పురస్కారం సహా ఎన్నో పురస్కారాలను అందుకున్నారు.

ముగిసిన అంత్యక్రియలు

శాంతి స్వరూప్ భార్య రోజారాణి దూరదర్శన్‌లో క్యాజువల్ అనౌన్సర్‌గా పనిచేశారు. 1980 ఆగస్టు 21న వారి వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు.. మేఘాన్ష్, అవ్యయ. ఇద్దరూ ఐఐటీలో చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. రోజారాణి క్యాన్సర్‌తో చాలా కాలం కిందట కన్నుమూశారు. కాగా.. శాంతి స్వరూప్ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం అంబర్ పేట శ్మశానవాటికలో పూర్తయ్యాయి. అంతకు ముందు.. శాంతి స్వరూప్ భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. శాంతి స్వరూప్ మృతి పట్ల.. సీఎం రేవంత్, ఏపీ సీఎం జగన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ సీఎంలు కేసీఆర్, చంద్రబాబు తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 6 ఏప్రిల్ 2024

diksuchi@andhrajyothy.com

ఇందిరాగాంధీ ఉడాన్ అకాడమీలో
సీపీఎల్, ఏఎంఈ కోర్సులు

అమేథీలోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ)- కమర్షియల్ పైలెట్ లైసెన్స్ (సీపీఎల్), ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(ఏఎంఈ) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ/వైవా, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

కమర్షియల్ పైలెట్ లైసెన్స్ (సీపీఎల్)

- కోర్సు వ్యవధి రెండేళ్లు. అభ్యర్థులు ఈ కోర్సుతో పాటు బీఎస్సీ(ఏవియేషన్) డిగ్రీలో కూడా చేరవచ్చు. దీని వ్యవధి మూడేళ్లు. రామ్ మనోహర్ లోహియా అవధ్ యూనివర్సిటీలో చదవాల్సి ఉంటుంది. సీపీఎల్ కోర్సులో ఏవియేషన్ సబ్జెక్ట్‌లకు సంబంధించి నిర్దేశిత సిలబస్, ఫ్లయింగ్-ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తయ్యాక డిగ్రీ తరగతులకు హాజరు కావాలి.

సీట్లు: సీపీఎల్ కోర్సులో మొత్తం 125 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 49, ఓబీసీలకు 34, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 13, ఎస్సీలకు 19, ఎస్టీలకు 10 సీట్లు కేటాయించారు. బీఎస్సీ(ఏవియేషన్) డిగ్రీలో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఒక్కో సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి కనీసం 17 ఏళ్లు ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ వర్గాలకు 33 ఏళ్లు మించకూడదు. అభ్యర్థుల ఎత్తు కనీసం 158 సెం.మీ ఉండాలి.

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ (ఏఎంఈ)

- కోర్సు వ్యవధి మూడేళ్లు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 12, ఓబీసీ అభ్యర్థులకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా పన్నెండోతరగతి/ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ నాటికి అభ్యర్థుల వయసు కనీసం 17 ఏళ్లు ఉండాలి.

ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్: ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. జనరల్ ఇంగ్లీష్, మేథ్స్, ఫిజిక్స్, రీజనింగ్ అండ్ కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్/పన్నెండో తరగతి స్థాయిలోనే ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఇంటర్వ్యూ/వైవా: ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్‌లో అర్హత సాధించినవారిని మాత్రమే ఇంటర్వ్యూ/వైవాకి పంపుతారు. ఇక్కడ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. పదోతరగతి, ఇంటర్/పన్నెండోతరగతి మార్కుల పత్రాలు; కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ పత్రాలు, అడ్మిట్ కార్డ్ వెంట తీసుకెళ్లాలి.

సీపీఎల్ కోర్సుకు పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్/సైకోమెట్రిక్ టెస్ట్ కూడా ఉంటాయి. వీటిలో అర్హత పొందిన వారితో తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **సీపీఎల్ కోర్సు ఫీజు:** రూ.45,00,000
- **ఏఎంఈ కోర్సు ఫీజు:** రూ.4.5 లక్షలు
- **దరఖాస్తు ఫీజు:** సీపీఎల్-జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.12,000; ఏఎంఈ- జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 9
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 24 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 3
- **ఇంటర్వ్యూ/వైవాల షెడ్యూల్ విడుదల:** ఏఎంఈకి జూన్ 21న; సీపీఎల్‌కి జూన్ 25
- **ఇంటర్వ్యూలు, వైవా, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ల ప్రారంభ తేదీ:** జూలై 16
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏఎంఈకి జూలై 22న; సీపీఎల్‌కి ఆగస్టు 26
- **కమిటెడ్ మనీ చెల్లించాల్సిన తేదీ:** ఏఎంఈ కోర్సుకు జూలై 31; సీపీఎల్ కోర్సుకు సెప్టెంబరు 6
- **జాయినింగ్ తేదీ:** ఏఎంఈకి ఆగస్టు 5న; సీపీఎల్‌కి సెప్టెంబరు 25
- **వెబ్‌సైట్:** igrua.gov.in



మీకు తెలుసా?

- చిన్న తోక, తలమీద కిరీటంలాంటి ఈక ఉండే పక్షిని 'కాలిఫోర్నియా క్వయిల్' అని పిలుస్తారు. దీన్నే వాలీ క్వయిల్ అని పిలుస్తారు.
- మగపక్షుల రెక్కల్లో నలుపుదం, తెలుపు ఉండే ఆడపక్షుల్లో గోధుమరంగు, తెలుపు ఉంటాయి.
- ఇవి డస్ట్‌బాత్ చేయటానికి ఇష్టపడతాయి. బురదలో, మట్టిలో తిరుగుతుంటాయి.
- దాదాపు పన్నెండు గుడ్లు పెడతాయి. గోధుమ రంగు గుడ్లమీద చుక్కల్లా ఉంటాయి. ఆడ, మగ పక్షులు రెండు వీటిని 23 రోజుల పాటు పొదుగుతాయి. పుట్టిన పిల్లలు నాలుగువారాల్లో స్వతంత్రంగా బతుకుతాయి.
- వీటి ఆనవాళ్లు దక్షిణ అమెరికాలో 12 వేల సంవత్సరాల క్రితం ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు.



- 24 నుంచి 27 సెం.మీ పొడవుండే ఈ పక్షుల వింగ్ స్పాన్ కేవలం 32 సెం.మీ ఉంటుంది. వీటి బరువు మాత్రం 150 గ్రాముల నుంచి 190 గ్రాములు మాత్రమే ఉంటాయి.
- గంటకు అరవై నాలుగు కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుతాయి.
- దక్షిణ అమెరికాలోని చిలీ, అర్జెంటీనాతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో వీటి సంఖ్య ఎక్కువే.
- కాలిఫోర్నియాలో 1932 సంవత్సరంలోనే ఆ రాష్ట్ర పక్షిగా క్వయిల్‌ను గుర్తించారు. వాల్ట్ డిస్నీ మూవీస్‌లో ఈ పక్షులను 'బాంబి' పేరుతో చూపిస్తారు.
- కాలిఫోర్నియా క్వయిల్‌ను 'చికాగో' అని కూడా పిలుస్తారు.
+ ఇవి విత్తనాలు, పండ్లు, ఆకులు, పూలు, బెర్రీస్, పురుగులు తిని బతుకుతాయి.
- వీటి జీవనకాలం గరిష్ఠంగా నాలుగేళ్లు మాత్రమే ఉంటాయి.


నైసర్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కు చెందిన స్కూల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ (ఎస్‌సీఎస్)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా కెమిస్ట్రీ విభాగాల్లో రీసెర్చ్ వర్క్‌లు నిర్వహిస్తారు. రెండు నెలల వ్యవధి గల ఈ ప్రోగ్రామ్ మేలో ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5,000 స్టయిపెండ్; స్లీపర్ క్లాస్ రైల్వే ఫేర్/బస్ ఫేర్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ/ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ తేదీలు:** మే 12 నుంచి జూలై 12 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.niser.ac.in



విశాఖ ఐఐపీఈలో పీహెచ్‌డీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)- పీహెచ్‌డీ 2024 ఆటమ్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్, స్పాన్సర్డ్, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు ఉండదు.



స్పెషలైజేషన్‌లు: బయోసైన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. నిర్దేశించిన ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా అర్హులే. రెగ్యులర్ అభ్యర్థులకు వ్యాలిడ్ గేట్/నెట్ స్కోర్ ఉంటేనే సంస్థ రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ ఇస్తుంది. ఐఐటీలు, ఐఐఎస్సీలు, ఐఐపీఈ, ఆర్‌జీఐపీటీ సంస్థలనుంచి కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్/డ్యూయెల్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/రెండేళ్ల ఎమ్మెస్సీ పూర్తిచేసినవారికి నేరుగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పించడంతోపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు. ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీ కింద అప్లయ్ చేసుకోవాలంటే సీఎస్ఐఆర్/యూజీసీ/డీఎస్‌టీ/డీబీటీ/ ఐసీఎంఆర్ ఫెలోషిప్ పొంది ఉండాలి. వ్యాలిడ్ అవార్డ్ లెటర్‌ను దరఖాస్తుకు జత చేయాలి. స్పాన్సర్డ్ కేటగిరీ అభ్యర్థులకు నిర్దేశించిన ప్రకారం బోధన/రీసెర్చ్ అనుభవం ఉండాలి. వర్కింగ్ ప్రొఫెషనల్స్ ప్రోగ్రామ్‌లో చేరేనాటికి వారు పనిచేస్తున్న ప్రాజెక్ట్ వ్యవధి కనీసం రెండేళ్లు ఉండాలి.

రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్: సంస్థ నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు గరిష్ఠంగా అయిదేళ్లపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ ఇస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.31,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.35,000 ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.30,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 17 నుంచి 22 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 30
- **అడ్మిషన తేదీ:** జూలై 17
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in


6 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



నిట్ దుర్గాపూర్‌లో టీచింగ్ పోస్టులు

ఖాళీలు 43

పశ్చిమ బెంగాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దుర్గాపూర్...వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఫ్యాకల్టీ భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2/గ్రేడ్-1: **37 పోస్టులు**
2. అసోసియేట్ ప్రొఫెసర్: **5 పోస్టులు**
3. ప్రొఫెసర్: **1 పోస్టు**

విభాగాలు: బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితరాలు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 60 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. **చివరి తేదీ:** ఏప్రిల్ 30

దరఖాస్తులు హార్డ్‌కాపీలు పోస్టులో పంపేందుకు చివరి తేదీ: మే 10

వెబ్‌సైట్: nitdgp.ac.in/

జాబ్ కార్నర్

గోవాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బేసిల్) దరఖాస్తులు కోరుతోంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో పారామెడికల్ ఉద్యోగాలు

ఖాళీలు 54

1. మెడికల్ ఆఫీసర్: **4 పోస్టులు**
2. ఫార్మసిస్ట్: **2 పోస్టులు**
3. వార్డ్ అటెండెంట్: **2 పోస్టులు**
4. పంచకర్మ టెక్నీషియన్(మేల్, ఫిమేల్): **10 పోస్టులు**
5. స్టాఫ్ నర్స్: **10 పోస్టులు**
6. పంచకర్మ అటెండెంట్: **7 పోస్టులు**
7. ల్యాబ్ అటెండెంట్: **6 పోస్టులు**
8. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
9. ఓటీ టెక్నీషియన్: **1 పోస్టు**
10. గార్డెన్ సూపర్‌వైజర్: **2 పోస్టులు**
11. మ్యూజియం కీపర్: **2 పోస్టులు**
12. ఐటీ అసిస్టెంట్: **2 పోస్టులు**
13. అసిస్టెంట్ లైబ్రరీ ఆఫీసర్: **1 పోస్టు**
14. రిసెప్షనిస్ట్: **2 పోస్టులు**
15. హెల్ప్ డెస్క్ రిసెప్షనిస్ట్: **2 పోస్టులు**



అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఏప్రిల్ 9

వెబ్‌సైట్: www.becil.com/vacancies

ఎన్‌ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్‌ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): **100 పోస్టులు**
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): **139 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

గరిష్ఠ వయోపరిమితి: యూఆర్/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులు 42 సంవత్సరాలు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్‌ఎంఈ అండ్ టెక్నికల్(ఒఅండ్ఎం) అభ్యర్థులకు రూ.18,000 - రూ.22,000. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 - రూ.18,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

అప్రెంటిస్‌లు

ఎన్‌ఎండీసీలో

ఖాళీలు 193

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్)లోని భారత ప్రభుత్వ సంస్థ- నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎండీసీ), బైలదిల ఐరన్‌ఓర్ మైన్, కిరండుల్ కాంప్లెక్స్...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

1. ట్రేడ్ అప్రెంటిస్: **147 ఖాళీలు** 2. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **38 ఖాళీలు**
3. టెక్నీషియన్ అప్రెంటిస్: **9 ఖాళీలు**

విభాగాలు: ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్ డీజిల్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత

ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 15, 16, 18, 19, 20, 21, 22, 25, 26

వేదిక: బైలా క్లబ్ అండ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్, బీఐఓఎం, కిరండుల్ కాంప్లెక్స్, కిరండుల్, దంతేవాడ, ఛత్తీస్‌గఢ్.

వెబ్‌సైట్: https://www.nmdc.co.in/careers

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో

ఖాళీలు 1113

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే... 2024-25 సంవత్సరానికి రాయ్‌పూర్ డివిజన్, వ్యాగన్ రిపేర్ షాప్(రాయ్‌పూర్)లో కింద పేర్కొన్న అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: **ట్రేడ్ అప్రెంటిస్**

ట్రేడులు: వెల్డర్, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లీష్, హిందీ), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెషినిస్ట్, మెకానిక్ డీజిల్, మెషీన్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్.

అర్హత: అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 2 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 1

వెబ్‌సైట్: https://secr.indianrailways.gov.in/

డైలీ సుడోకు - 274

		7	4		6	3		5
			5	8		9	4	
	2				9			
7	5							
2	9						5	3
							9	1
			6				3	
	3	9		7	1			
6		2	9		3	8		

సుడోకు - 273 సమాధానం

3	2	7	6	4	1	9	8	5
5	1	8	3	2	9	7	4	6
9	6	4	7	8	5	3	1	2
2	4	9	5	1	3	8	6	7
8	7	1	9	6	4	5	2	3
6	5	3	8	7	2	4	9	1
4	3	2	1	9	7	6	5	8
7	9	6	2	5	8	1	3	4
1	8	5	4	3	6	2	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 6 ఏప్రిల్ 2024

దేశీ మార్కెట్లోకి మోటోరోలా ఎడ్జ్



మోటోరోలా ఎడ్జ్ 50 ప్రొ ఇండియన్ మార్కెట్లోకి వచ్చింది. ఏఐ బ్యాకింగ్‌తో ట్రిపుల్ రేర్ కెమెరా సిస్టమ్, 50 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా దీనిలో ఉన్నాయి. 13-మెగాపిక్సెల్ సెన్సర్, అల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్, 3ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో 10-మెగాపిక్సెల్ టెలిఫొటో షూటర్, ఓఐఎస్ సపోర్ట్ ఉన్నాయి. 8.19 ఎంఎం మందం, 186 గ్రాముల బరువు ఉంది. 4ఎన్ఎం ఆక్టా-కోర్ స్నాప్‌డ్రాగన్ పవర్‌కు తోడు 4,500ఎంఏహెచ్ బ్యాటరీ సపోర్ట్ ఉంది. వైర్డ్, వైర్‌లెస్ టర్బో చార్జింగ్ సదుపాయం ఉంది. 6.7 ఇంచీల 15కె పిఓలెడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లే, 11హెచ్‌జెడ్ రిఫ్రెష రేటు ఉన్నాయి. మూడేళ్ళ పాటు ఓఎస్, నాలుగేళ్ళ సెక్యూరిటీ అప్‌గ్రేడ్స్ ఉంటాయి. బ్లాక్ బ్యూటీ, లక్సే లావెండర్, మూన్‌లైట్ పెరల్ షేడ్ రంగుల్లో లభిస్తుంది. 8జీబీ + 256 జీబీ వేరియంట్ ధర రూ.31,999 కాగా 12జీబీ + 256జీబీ వేరియంట్ ధర రూ.35,999. రెండోది మాత్రం లాంచింగ్ ఆఫర్ కింద రూ.31,999కి లభించనుంది. మోటారాలా ఆన్‌లైన్‌కు తోడు రిటైల్ స్టోర్స్‌లో లభిస్తుంది.


ఈ నెలలోనే శాంసంగ్ గెలాక్సీ ఫోన్స్



ప్రొడక్ట్

శాంసంగ్ నుంచి ఈ నెలలో రెండు గెలాక్సీ ఫోన్‌లు విడుదల అవుతున్నాయి. అందులో ఒకటి ఎం55 5జీ కాగా రెండోది ఎం15 5జీ. ఈ నెల 8న ఇవి ఇండియన్ మార్కెట్లోకి రానున్నాయని సమాచారం. రెంటికీ శాంసంగ్ నాక్స్ సెక్యూరిటీ సపోర్ట్ ఉంది. గెలాక్సీ ఎం55 5జీ - 6.7 ఇంచీల ఫుల్ హెచ్‌డీ + సూపర్ అమోల్డ్ ప్లస్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో వస్తోంది. వెయ్యి నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ ఉంటుంది. విజన్ బూస్టర్ టెక్నాలజీని ఉపయోగిస్తుండటంతో సూర్యకాంతిలోనూ స్ర్కీన్ స్పష్టంగా కనిపిస్తుంది. 5000ఎంఎ హెచ్ బ్యాటరీ, 45 వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ సదుపాయాలు ఉన్నాయి. ట్రిపుల్ కెమెరా యూనిట్ ఉంది. 50-మెగాపిక్సెల్ ప్రైమరీ సెన్సర్‌కు తోడు ఆప్టికల్ ఇమేజ్ స్టెబి లైజేషన్ ఉంది. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 50 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా సెన్సర్ ఉంది. నైటోగ్రఫీ ఫీచర్ ఉంది. ఏఐ బ్యాక్డ్ టూల్స్ అంటే ఇమేజ్ క్లిప్పర్, ఆబ్జెక్ట్ ఎరేజర్ ఉన్నాయి. ఇందులో ఎం55 5జీ డెనిమ్ బ్లాక్, లైట్ గ్రీన్ షేడ్ రంగుల్లో లభ్యమవుతుంది. 8జీబీ + 128జీబీ వేరియంట్ ఎం15 5జీ విషయా నికి వస్తే దీనిలో మీడియాటెక్ డైమెన్సిటీ 6100 చిప్‌సెట్, 6.5 ఇంచీల సూపర్ అమోల్డ్ డిస్‌ప్లే 50-మెగా పిక్సెల్ ట్రిపుల్ రేర్ కెమెరాయూనిట్ ఉన్నాయి. హెడ్‌సెట్‌కు 6000ఎంఏహెచ్ బ్యాటరీ బ్యాకింగ్ ఉంది. దాంతో రెండు రోజుల పాటు బ్యాటరీ లైఫ్ ఉంటుంది. ఇది బ్లూ టోపెజ్, సెలస్టయిన్ బ్లూ, స్టోన్ గ్రే రంగుల్లో దొరకనుంది.

పెయిడ్ మోడ్‌లో గూగుల్ సెర్చ్!



విషయం ఏదైనప్పటికీ వెంటనే గూగుల్‌లో వెతుక్కునే దశకు చేరుకున్నాం. అయితే ఇప్పటివరకు సంబంధిత సేవలు అన్నీ ఉచితం. అయితే ఇకముందు అలా ఉండకపోవచ్చు. గూగుల్ తన సెర్చ్ ఇంజన్‌కు ఏఐ ఫీచర్స్‌ను జోడిస్తోంది. యూజర్ అనుభవాన్ని పెంచేందుకు ఈ చర్య తీసుకుంటోంది. అలాగే దీని ద్వారా రెవెన్యూ పెంచుకోవాలని కూడా చూస్తోందని సమాచారం. ఆండ్రాయిడ్ అథారిటీని ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ఈ న్యూస్‌కు ఊతం. గూగుల్‌కు ప్రత్యేకించి సబ్‌స్ర్కిప్షన్ సర్వీసులు జెమిని అడ్వాన్స్‌డ్ లేదా గూగుల్ వన్‌లో దీని కలపవచ్చని అంటున్నారు. అలా కాకుంటే గూగుల్ సెర్చ్‌ని అలాగే ఫ్రీ సర్వీస్‌గా ఉంచి ప్రీమియర్ టైర్‌ని పరిచయం చేయడానికి తోడు ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని భావిస్తున్నారు. యూజర్లకు మంచి అనుభవాన్ని అందించడం, అదే సమయంలో రెవెన్యూ పెంచుకోవడం అన్న రెండు లక్ష్యాలతో ఈ మార్పులకు గూగుల్ శ్రీకారం చుడుతోంది. సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్(ఎస్‌జీఈ) పేరిట గత ఏడాది మే నెలలోనే ఏఐ పవర్డ్ సెర్చ్ సర్వీసుని గూగుల్ ఆరంభించింది. ఆప్షనల్ ఫీచర్‌గా ఇది పనిచేస్తోంది. గూగుల్ రెవెన్యూపై ఇదంటా ప్రభావం చూపుతున్న నేపథ్యంలో గూగుల్ మార్పు దిశగా అడుగులు వేస్తోందని తెలిసింది.

వర్డ్‌పాడ్‌కు మైక్రోసాఫ్ట్ చెల్లుచీటీ ప్రత్యామ్నాయాలు ఇవే!

మైక్రోసాఫ్ట్ - విండోస్ 11లో వర్డ్‌ప్యాడ్‌కు స్వస్తి పలికింది. యూజర్ ఎక్స్‌పీరియెన్స్‌ను పెంచేందుకు వీలుగా మైక్రోసాఫ్ట్ ఈ చర్య తీసుకుంది. అసలు దీన్ని ఎందుకు తొలగించారన్నది మాత్రం స్పష్టంగా తెలియలేదు. బేసిక్ వర్డ్ ప్రాసెసింగ్ టాస్కుల కోసం యూజర్లు దీన్ని ఉపయోగించేవారు. అయితే వర్డ్ ప్రాసెసింగ్ అవసరాల కోసం ప్రస్తుతం ఉన్న ప్రత్యామ్నాయాలను ఈ నేపథ్యంలో చూద్దాం.

నోట్‌ప్యాడ్: దశాబ్దాలుగా ఇది ఉంది. రిలయబుల్ టెక్ట్స్ ఎడిటింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఏవీ ఇందులో లేవు. అయినప్పటికీ టెక్ట్స్ టాస్కులను త్వరగా చేసుకునేందుకు మంచి టూల్‌గానే ఉపయోగపడుతోంది.



ఆల్టర్నేట్

టైపొర: ఇది రైటర్ ఫ్రెండ్లీ సాఫ్ట్‌వేర్. ప్రివ్యూ సామర్థ్యాలు ఉన్నాయి. క్రియేటివ్ మైండ్ ఉన్న వ్యక్తులు దీన్ని అభిమానిస్తారు. ఫైల్ మేనేజ్‌మెంట్ ఫీచర్లకు తోడు వివిధ ఎక్స్‌పోర్ట్ ఫార్మేట్‌లను ఇది సపోర్ట్ చేస్తుంది.

ఎడిట్‌ప్యాడ్: ఇది ఆన్‌లైన్ ఎడిటర్. గ్రామర్ చెక్‌కు తోడు ప్లగారిజమ్ డిటెక్షన్, కంటెంట్ సమ్మరైజేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సులువుగా షేరింగ్ ఆప్షన్స్ కూడా ఉన్నాయి.

1 రైటర్: బేసిక్ ఫంక్షనాలిటీకి తోడు అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఉన్నాయి. స్ర్కీన్ రైటింగ్ స్పేస్‌ను అందిస్తోంది. మార్క్‌డౌన్ ఫైల్స్, ఐక్లౌడ్ డ్రైవ్ ఇంటిగ్రేషన్ సపోర్ట్ ఉన్నాయి. రైటర్లకు ఇదో మంచి చాయిస్.

గూగుల్ డాక్స్: డాక్యుమెంట్ ఎడిటింగ్‌కు ఇది పవర్‌హౌస్. సంప్రదాయ వర్డ్ ప్రాసెసర్లకు ఇది ప్రత్యామ్నాయం. పీడీఎఫ్ ఎడిటింగ్, రియల్‌టైమ్ కొలాబిరేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. వర్డ్ ప్యాడ్‌కు సరైన ప్రత్యామ్నాయం ఇదే అని కూడా చెప్పవచ్చు.

ఇన్ఫో

ఇన్‌స్టాగ్రామ్‌లో వానిష్ మోడ్

మెసేజ్‌లు పలు రకాలు. వాటిలో కొన్నింటికి పెద్ద ప్రాధాన్యం ఉండదు. ఒకసారి చూసిన తరవాత వాటితో పని అయిపోతుంది. అలాగే కొన్నింటిని వెంటనే తొలగించాల్సి వస్తుంది కూడా. అలాంటి వాటికోసమే 'వానిష్ మోడ్'ని ఇన్‌స్టాగ్రామ్ పరిచయం చేసింది. డైరెక్ట్ మెసేజ్‌ల పరిధిలో మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు ఇతర కంటెంట్ యూజర్‌కు అనుకూలంగా మాయం చేసుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. దీనికోసం ఇన్‌స్టాగ్రామ్‌లో మెసెంజర్ ఫీచర్‌ను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం...




- స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- మెసెంజర్ ఐకాన్ లేదా పేపర్ ఎయిర్‌ప్లేన్ ఐకాన్(సెండ్)ని టాప్ చేయాలి.
- వానిష్ మోడ్ పెట్టాలని అనుకున్న చాట్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- చాట్‌లోనే వానిష్ మోడ్‌ని యాక్టివేట్ చేసేందుకు వానిష్ మోడ్‌ని స్వైప్‌అప్ చేయాలి. డిజేబుల్ చేయాలనుకున్నా మళ్ళీ స్వైప్‌అప్ శరణ్యం.

వానిష్ మోడ్‌లో పంపిన మెసేజ్ అ విధంగా నోట్‌పై అవుతుంది. అదే విధంగా వానిష్ మోడ్ లేని మెసేజ్‌లు సైతం అందుతూ ఉంటాయి. వానిష్ మోడ్‌లో ఉన్న వాటిని కాపీ, సేవ్, తిరిగి పంపుకొనే వెసులుబాటు ఉండదు. కనెక్ట్ అయిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్‌తోనే ఈ పని వీలువుతుంది. ఈ ఫీచర్‌లో ప్రైవసీ ఉన్నప్పటికీ, చాలా జాగ్రత్తగా దీన్ని ఉపయోగించాలి. నమ్మకం ఉన్న వ్యక్తులతో సాగిస్తేనే మంచిది. డిజెపియరింగ్ మెసేజ్‌లను వేరే డివైజ్‌లతో పట్టుకునే అవకాశం ఇప్పటికీ ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వానిష్ మోడ్ కదా అని ఆదమరిస్తే కొన్ని ఇబ్బందులు తప్పవు.

యూట్యూబ్ ఆఫ్‌లైన్ మ్యూజిక్ ఇప్పుడు డెస్క్‌టాప్‌పైనా..



ఆఫ్‌లైన్‌లో వినేందుకు వీలుగా మొబైల్స్‌లోకి యూట్యూబ్ మ్యూజిక్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. ఇప్పుడు ఆ సదుపాయాన్ని డెస్క్‌టాప్ యూజర్లకూ కల్పిస్తున్నారు. ప్రస్తుతం దాని విడుదల కార్యక్రమం ఆరంభమైందని '9టు5 గూగుల్' మొదట గుర్తించింది. డెస్క్‌టాప్‌పై యూట్యూబ్ మ్యూజిక్ వెబ్‌సైట్‌ని ఓపెన్ చేస్తే 'న్యూ! డౌన్‌లోడ్ మ్యూజిక్ టు లిజన్ ఆఫ్‌లైన్' అని కనిపిస్తుంది. సైడ్‌బార్‌పై లైబ్రరీ పక్కన స్ర్కీన్‌పై ఇది ఉంటుంది. టాబ్‌పై క్లిక్ చేస్తే 'డౌన్‌లోడ్స్' కనిపిస్తుంది. ఎప్పుడంటే అప్పుడు లైబ్రరీ - డౌన్‌లోడ్స్ టాబ్‌తో యాక్సెస్ పొందవచ్చు. సింగ్యులర్ మ్యూజిక్ ట్రాక్స్‌కు తోడు పూర్తి ఆల్బమ్స్, ప్లేలిస్ట్‌లు లేదా పాడ్‌క్యాస్ట్‌లను కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫైల్‌ని సేవ్ చేసుకునేందుకు డౌన్‌లోడ్ బటన్‌పై క్లిక్ చేయాలి. డౌన్‌లోడింగ్ ఇండికేటర్ కనిపిస్తుంది. డౌన్‌లోడ్ పూర్తికాగానే డౌన్‌లోడ్ టాబ్ కింద ఫైల్ కనిపిస్తుంది. కనీసం 30 రోజులకు ఒకసారైన యాక్టివ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు డౌన్‌లోడ్ చేసింది అలాగే ఉంటుంది. నిజానికి మొబైల్ అప్లికేషన్‌కు కూడా ఇదే వర్తిస్తుంది.



'మెసేజెస్'కు శాటిలైట్ సపోర్ట్!

గూగుల్ - మెసేజెస్ యాప్‌నకు శాటిలైట్ మెసెజింగ్ సపోర్ట్‌ని జోడించే పనిలో ఉంది. మొబైల్ నెట్‌వర్క్ లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకుండానే యూజర్లు మాట్లాడుకునే వెసులుబాటు దీంతో లభిస్తుంది. యాపిల్ లేటెస్ట్ బేటా వెర్షన్‌లో ఇది కనిపించిందని '9టు5 గూగుల్' పేర్కొంది. ఆ కథనంలో భాగంగా మూడు అభిప్రాయాలను వెల్లడించింది. అందులో మూడోది ఆసక్తికరంగా ఉంది. దాని ప్రకారం ఎమర్జెన్సీ సర్వీసులు సహా ఎవరికైనా మెసేజ్ చేసే అవకాశం ఉంటుంది. ఐఫోన్‌తో కేవలం ఎమర్జెన్సీ సర్వీసులకు మెసేజ్ చేసుకోవచ్చు. గూగుల్ మాత్రం ఇది ఎవరికైనా అంటుండటం గమనార్హం. ఇప్పటికే ఈ పనిలో ఉన్న జీపీఎస్ నేవిగేషన్ జెయింట్ గార్మిన్‌తో దీనికోసం భాగస్వామ్యం కుదుర్చుకోనుందని కూడా సమాచారం. ఆండ్రాయిడ్ 15 అధికారికంగా విడుదల కావడానికి ముందే పై సదుపాయం అందుబాటులోకి వస్తుందా అన్నది తెలియదు. ఆండ్రాయిడ్ ఓఎస్‌లో తదుపరి రాబోయే ఫీచర్ ఆటో కనెక్ట్ టు శాటిలైట్ కాగా శాటిలైట్ ఐకాన్ కూడా స్టాటస్‌బార్‌పై ఉండనుందని తెలిసింది. మొత్తానికి గూగుల్ మెసేజెస్ తన కోర్ విధులను మెరుగుపరుస్తోందని చెప్పవచ్చు.

'అకౌంట్ లేకుండానే'



ఓపెన్ ఏఐ సృష్టించిన చాట్‌జీపీటీ ఇకపై అందరికీ అందుబాటులోకి ఉండనుంది. ప్రత్యేకించి అకౌంట్ క్రియేట్ చేసుకోకుండానే ఈ ఏఐ టూల్‌ని పొందవచ్చు. అయితే ఇందులోనూ కొన్ని లాభ నష్టాలు ఉన్నాయి. ముఖ్యంగా సైన్ కాకుండా చాట్‌జీపీటీ ఉపయోగించుకునే వారికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఓపెన్ ఏఐ బ్లాగ్‌పోస్ట్ ప్రకారం సైన్ చేయకుండానే యూజర్లు చాట్‌బోట్‌ని ఉపయోగించుకోవచ్చు. చాట్‌బోట్‌ను ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తే దాంతో సమకూరే ప్రయోజనాలు జనాలకు అర్థమవుతుందని ఓపెన్ ఏఐ తలపోస్తోంది. ఏఐతో యూజర్ చేసే సంభాషణ ఇప్పటికీ రికార్డు అవుతోంది. మోడల్ ట్రైనింగ్ కోసం దీన్ని ఉపయోగిస్తోంది. అయితే ఆ కసరత్తును తప్పించుకునే ఆప్షన్ యూజర్లకు ఉంది. అందుకోసం చాట్‌జీపీటీ సెట్టింగ్స్‌లోకి మొదట వెళ్ళాలి. సంభాషణను ప్రైవేటీకరించేందుకు వీలుగా దాన్ని టర్నాఫ్ చేయాలి. దాంతో ఇక చాట్స్ షేరింగ్, చాట్ హిస్టరీ, కస్టమ్ సూచనలతో ఒనగూరే ప్రయోజనాలు కూడా ఉండవు. అకౌంట్ వెర్షన్ మాదిరిగానే జీపీటీ 3.5 మోడల్‌ని న్యూవెర్షన్ కూడా వాడుకుంటుంది. ఓపెన్ ఏఐ ఇటీవల కంటెంట్ సేఫ్‌గార్డ్ ఫీచర్లను పరిచయం చేసింది. అయితే సైన్ కాకుండా చాట్‌జీపీటీని ఉపయోగించుకునే వారికి ఆ ఫీచర్ల సపోర్ట్ ఉంటుందా లేదా అన్నది మాత్రం తెలియరాలేదు. సైన్‌ఔట్ వెర్షన్ క్రమక్రమంగా అందుబాటులోకి రానుందని సమాచారం.

చాట్ జీపీటీ



డాల్-ఈ జనరేటెడ్ ఇమేజెస్ ఎడిటింగ్

చాట్‌జీపీటీ - ఇంటర్‌ఫేస్ పరిధిలోనే కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. డాల్-ఈ ఇమేజెస్‌ను దీంతో నేరుగా ఎడిట్ చేసుకోవచ్చు. వెబ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్ వెర్షన్లలో ఈ ఎడిటింగ్‌కు వీలు ఉంటుంది. ఇందుకోసం

- డాల్-ఈ ని ఉపయోగించి చాట్ జీపీటీ ఇమేజెస్‌ను జనరేట్ చేయాలి.
- ఇమేజ్ జనరేట్ అయితే చాలు, ఎడిట్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. కొత్త ఇంటర్‌ఫేస్ అక్కడ కనిపిస్తుంది. అది ఎడిటింగ్‌కు అనుమతిస్తుంది.
- సెలెక్ట్ టూల్ ఉపయోగించి ట్వీక్ చేయాలని అనుకుంటున్న పార్టులను హైలైట్ చేసుకోవాలి. సెలెక్ట్ టూల్‌ని కాదని కూడా ఇదే పని చేసుకోవచ్చు.
- టెక్ట్స్ ఫీల్డ్‌లోని ప్రాంప్ట్ ప్రకారం మార్పులను ఎంటర్ చేయాలి.
- మార్పులు కాగానే సేవ్ చేసుకుంటే సరిపోతుంది.

ఇందులో ముందుగా సెట్ చేసిన స్టయిల్స్ అంటే వుడ్‌కట్, క్లోజ్-అప్, లో యాంగిల్, ఆర్టిఫీషియల్ లైటింగ్ వంటివి ఉంటాయి. అందువల్ల పెద్దగా నైపుణ్యం లేకున్నప్పటికీ ఇమేజెస్ ఎడిటింగ్ చేసుకోవచ్చు.



ఆండ్రాయిడ్ 15

వాల్యూమ్ ప్యానల్‌లో మార్పులు!



అప్‌గ్రేడ్

ఆండ్రాయిడ్ 15 పూర్తి స్థాయిలో ఇంకా రూపుదిద్దుకోలేదు. అయినప్పటికీ వాల్యూమ్ ప్యానల్ రూపంలోనే కాదు ఫంక్షనాలిటీలోనూ మార్పులు ఉంటాయని 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. మొదటగా అప్-టు-డేట్ డిజైన్‌తో ఉండనుంది. స్లయిడర్స్ లుక్‌పరంగా చాలా పెద్దగా ఉంటాయి. పిక్సెల్స్‌లో బ్రైటనర్ స్లయిడర్ మాదిరిగా ఉండొచ్చు. లుక్స్ వరకు ఇదో గణనీయ మార్పు కానుంది. డిజైన్ అర్థవంతంగా మడుచుకునే విధంగా ఉంటుంది. వాల్యూమ్ సెట్టింగ్స్ అన్నీ కనిపించేలా ప్యానల్ ఉంటుంది. అనుకూలమైన సైజ్ కావడంతో యాప్ పనిచేస్తున్నప్పుడు ప్యానల్ ఆటోమేటిక్‌గా తగ్గుతుంది. అలాగే ఐకాన్‌ని టాప్ చేస్తే, ఆడియో స్ట్రీమ్ మ్యూట్‌లోకి వెళుతుంది. నాయిస్ కంట్రోల్ అదుపులోకి వస్తుంది. అంటే ఇక హెడ్‌ఫోన్లతో పనిచేస్తుంది. దీని రిలీజ్ మే నెల మధ్యలో ఉండొచ్చని భావిస్తున్నారు.

మీట్‌గీక్ యూజ్‌ఫుల్ యాప్

ఆఫీసుల్లో పదేపదే జరిపే సమావేశాలంటే విసుగెత్తే వ్యక్తుల కోసం ఉద్దేశించిన ఏఐ యాప్ 'మీట్‌గీక్'. సమావేశాలను రికార్డ్ చేయడమే కాదు, మీటింగ్ మినిట్స్‌ను ట్రాన్స్‌క్రైబ్, సమ్మరైజ్ చేయడంలో సహకరిస్తుంది ఈ యాప్. ఈ మీటింగ్ యాప్ నిమిషాల్లో పనులను చక్కబెడుతుంది. పలు ఏఐ ఫీచర్లకు కూడా ఇది నెలవు. దీంతో ఒనగూరే ప్రయోజనాల విషయానికి వస్తే....



- దీంట్లో మీటింగ్ ఎజెండా టెంప్లేట్స్ ఉంటాయి. మీటింగ్ మినిట్స్ నుంచి యాక్షన్ ఐటెమ్స్, ఇంటర్వ్యూలు, బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్స్ వరకు అన్నింటికీ అవి ఉపయోగపడతాయి.
- ఏఐ సహకారంతో ఈ యాప్ సమావేశంలోని యాక్షన్ ఐటెమ్స్‌ను బైటకు తీస్తుంది. టాపిక్స్ వారీగా, ఇంపార్టెంట్ ఫ్యాక్ట్స్, సవాళ్ళు తదితరాలను అవగాహన కోసం విడదీస్తుంది.
- మెషీన్ లెర్నింగ్‌ను కూడా ఈ యాప్ ఉపయోగిస్తుంది. తద్వారా మీటింగ్‌లో జరిగే సంభాషణల నుంచి నేర్చుకునే వెసులుబాటును కల్పిస్తుంది. ఇది పర్సనలైజ్డ్ ఇన్‌సైట్స్, బిహేవియరల్ ట్రెండ్స్, ప్రాజెక్ట్ గోల్స్‌ను తెల్సుకునేందుకు ఉపయోగపడుతుంది.
- పరిమితంగా ఉపయోగించుకునే వరకు ఈ యాప్ ఉచితం. ఎలాంటి పరిమితులు లేకుండా ఫీచర్లు అన్నింటినీ ఉపయోగించుకోవాలంటే నెలకు 15 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

రిమైండర్స్ యాప్ 'డ్యూయాప్'

కొన్ని టాస్క్‌లను మర్చిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఆ విషయంలో అలెర్ట్ చేసేందుకు ఉపయోగపడేది 'డ్యూ యాప్'. ఐఓఎస్ యూజర్లకు ఇది బాగా ప్రయోజనకరం. పేరుకు తగ్గట్టు ఇది రిమైండింగ్ యాప్. డెడ్‌లైన్‌కు ముందు పనులు పూర్తయ్యేలా చూస్తుంది. రిమైండర్ల క్యాప్చర్ నుంచి సమయానికి వాటిని పంపడం వరకు సంబంధిత పనులన్నింటినీ నిర్వర్తిస్తుంది.



నేచురల్ డేట్-పార్సింగ్ ఫీచర్లతో ఇది ఇన్‌స్టాంట్‌గా పనిచేస్తుంది. ప్రాంప్ట్‌ను టైప్ చేస్తే చాలు, రిమైండర్‌తో వెంటపడుతుంది. కాలానుగుణంగా నోటిఫికేషన్లతో అలెర్ట్ చేస్తుంది. టాస్క్ పూర్తయ్యే వరకు వెంటపడుతుంది. అంటే పని పూర్తయ్యేవరకు రిమైండర్లతో వెంటాడుతుంది. యూజర్లు దీంట్లో రికరింగ్ టాస్కులను చేర్చుకోవచ్చు. అప్పుడు పదేపదే చేసే పనులు మర్చిపోవడానికి వీలు లేకుండా చేస్తుంది. దీంతో పని పూర్తవ్వడమే కాదు, కొన్ని సందర్భాల్లో ఇది ఉత్పాదకత పెంపునకు దోహదపడుతుంది. ఈ యాప్ ఐ.ఓ.ఎస్ డివైజ్‌లు అంటే మ్యాక్, ఐఫోన్, యాపిల్ వాచ్ తదితరాల్లో పనిచేస్తుంది. మరోలా చెప్పుకోవాలంటే ఐక్లౌడ్, డ్రాప్‌బాక్స్ సహాయంతో రిమైండర్, టైమర్ పరంగా సింక్ చేసుకోవచ్చు.